# తిమింగిలం వేట

కొడవటిగంటి కుటుంబరావు

విజయవాడలో జానకి పెళ్ళి అయినప్పుడు పదిమందీ కలిశారు. వాళ్ళలో అయిదేళ్ళ తరవాతా, ఏడేళ్ళ తరవాతా కూడా కలుసుకుని ఎంత మారిపోయామంటే ఎంతమారిపోయామనుకున్నవాళ్లు ఉన్నారు. రాఘవయ్యకు పూర్తిగా బట్టతల అయింది. హనుమాయమ్మకు ఒక్క దంతం మిగల్లేదు. మధుసూదనం తల ముగ్గుబుట్ట. కామేశ్వరి అప్పుడే అయిదుగురు పిల్లల తల్లి! చాలామంది పిల్లలు ఉన్నారు. సంపెంగపువ్వుల్లాగా వేరువేరు రంగుల్లోనూ, సైజుల్లోనూ, వాళ్ళు పరిగెత్తుతూ, అరుస్తూ, పందిరి స్తంభాలు ఎగబాకుతూ, నవ్వుతూ, ఏడుస్తూ నానా రభసా చేస్తున్నారు.

పిల్లల్లో హెచ్చుమంది ఒకరినొకరు చూసుకోవటం యిదే మొదటిసారి. అయినప్పటికీ, చిన్నతనం నుంచీ ఒకరినొకరు ఎరుగున్నట్టుగా, 'ఒరే', 'ఒసే', అని పిలుచుకున్నారు. ప్రతి ఒక్కరూ తమకు ఎవరిపైన ఎంత ఇష్టమో తేల్చేసుకుని, తమ యిష్టాలనూ, అభిమానాలనూ క్షణంలో అవతలివాళ్ళకు తెలియజేసేసుకున్నారు. ప్రేమబంధాలేర్పడ్డాయి. కొన్ని జంట లేర్పడ్డాయి — మగజంటలూ, ఆడజంటలూ, ఆడమగ జంటలు కూడానూ. అబ్బాయి లెట్లాగైనా మగవాళ్ళనిపించారు. వాళ్ళు అమ్మాయిల మెప్పు సంపాదించటానికి గప్పాలు కొట్టారు. ఫీట్లు చేశారు. గట్టిగా మాట్లాడారు. పాపం, వాళ్ళు తమకన్న అయిదింతలు వయసుగల ఆడవాళ్ళ ఆకర్షణకుకూడా గురిఅయారు. మంచి రంగూ మంచి చీరాలూ, మంచి జుట్టూ గల ఆడవాళ్ళు మగవాళ్ళను ఎంతగా ఆకర్షించాలో మగపిల్లలను అంతగానూ ఆకర్షించారు.

విడిదిలో నాగభూషణం పిల్లల్నందర్నీ చేర్చి ఎవరెవరి పిల్లలో తెలుసుకోవటానికి ప్రయత్నించాడు. కొందరు పిలవగానే వచ్చారు, మరికొందరు స్తంభించిపోయారు. ఇంకొందరు పారిపోయారు. నాగభూషణం, "నే నెవరో తెలుసుట్రా, నాగపాషాణాన్ని. రండి, మీ కంతా ఒకటే గమ్మత్తు చెబుతా!" అని ఏవేవో వెధవమాటలు చెప్పి, పిల్లల్ని మొత్తంమీద దగ్గిరికి చేర్చాడు.

"నాగపాషాణం! హోహో!" అని

ముందుపళ్ళు లేని కుర్రాడొకడు పెద్ద పెట్టున నవ్వాడు

"కాదురా, నాగభూషణం", అని మరోకుర్రాడు గట్టిగా అరిచాడు.

నాగభూషణం వెంట సీతారామయ్యా, వెంకటేశ్వర్లూ, చలపతీ, మరికొందరూ చేరి తమకు గుర్తులేని పిల్లలందర్ని గురించీ తెలుసుకున్నారు.

"మళ్ళీ వీళ్ళను మనం చూడటానికెన్నేళ్ళు పట్టుతుందో!" అన్నాడు వెంకటేశ్వర్లు.

"నా చిన్నతనంలో మూడుతరాల వాళ్ళం ఒకే కట్టలో ఉండేవాళ్ళం. ఈ పదేళ్ళలో కట్టలు తెగినై. నా తరవాత తరంవాళ్ళలో సగంమందిని నే నెరగను. మా రవిగాడి కూతుర్నీ కొడుకునూ నే నిప్పుడే చూస్తున్నా," అన్నాడు చలపతి.

"ప్రపంచం చిన్నదవుతున్నది కాదుట్రా? అంచేత మనుషుల మధ్య దూరం జాస్తి అవుతున్నదిలే," అన్నాడు నాగభూషణం.

సంభాషణ పెళ్ళిళ్ళకేసి నడిచింది.

"అదే వచ్చిన చిక్కు. పిల్లలకు నంబంధాలు చూడాలన్నా దేశమంతా వెతకవలిసొస్తున్నది అన్నాడు సతారామయ్య

"ప్రోగ్రెస్‌రా, ప్రోగ్రెస్! మన తాతలనాడు నడిచిపోయి సంబంధాలు వెతికారు. తరవాత రైళ్ళమీద తిరిగారు. ఇప్పుడు విమానాలమీద తిరగాలి. అచ్యుతం ఏం చేశాడో విన్నారుగా? పిల్లకి సంబంధం చూశాడు. పిల్లాడు ఢిల్లీలో పోస్టయి ఉన్నాడు. వాడు పిల్లను ఆమోదించటం తప్ప అంతా సెటిలయింది. ముహూర్తం దగ్గిరలోనే ఉంది. కుర్రాడు పెళ్ళి కొకసారీ, పెళ్ళి చూపుల కొకసారీ రావడం పొసగదు; అంచేత అచ్యుతం పిల్లతో సహా ప్లేనెక్కి వెళ్ళాడు. అబ్బాయి అమ్మాయిని చూసి ఓకే చేశాడు. అదీ ఇవాళ్టి స్టైల్!" అన్నాడు నాగభూషణం.

"సరేగాని ఈ పెళ్ళికి కుటుంబరావు చాలా కట్నం కుమ్మరిస్తున్నాట్టగా?" అన్నా రొకరు.

"ఎంతలే! పదివేలు! కక్కనీ! లంచాలు తిని బాగా కొవ్వి ఉన్నాడు."

"అందు కిది శిక్ష అంటావా ఏమిటి?"

"కాకపోతే ఏమిటి?"




"ఈ శిక్ష అనేమాటను ఎంతతప్పుగా వాడుతున్నారో! కిందటిజన్మలో చేసిన దానికి శిక్ష అనుభవిస్తున్నా మంటారు. అదంతా నాన్సెన్స్; శిక్ష అనేది ఒకానొక తప్పుకు ఒకానొకరు విధించేదే. శిక్ష అనుభవించేవాడు తా నా శిక్ష ఎందు కనుభవిస్తున్నాడో—"

"ఊరుకోవోయ్, నీ ధర్మపన్నాలూ నువ్వూనూ!... ఏంరా, కుర్రా డేమంత గొప్పఇదిగా లేడుగదా, కుటుంబరావింత కట్నం ఎందుకు పోస్తున్నా డంటావ్?"

"ఆ అబ్బాయి ఐ.ఏ.యస్. సెలెక్షను వెంట్రుకవాసిలో పోయింది. మరి నలుగుర్ని సెలెక్షను చేసుకున్నట్టయితే ఛాన్సు కొట్టేవాడేట! పదివేలతో పోయింది నయం! సెలెక్టై అయుంటే పదిహేనువేలు తీసుకునేవాడు."

"అవున్రా! శ్లాబ్‌సిస్టమ్. ఇన్‌కమ్‌టాక్సు కుంటుంది, చూడూ, అంతే!" అన్నాడు నాగభూషణం



"కట్నాలిచ్చే పిల్లతండ్రి పెద్ద ఫూలా? కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకునే పెళ్ళికొడుకు పెద్ద ఫూలా? ఈ సమస్య ఎంత ఆలోచించినా తెగకుండా ఉంది," అన్నాడు వెంకటేశ్వర్లు.

"మొత్తం మీద ఇద్దరూ ఫూల్సే నంటావ్?"

"నిరభ్యంతరంగా! ఇద్దర్నీ చూసి లోకం నవ్వుతూనేఉంది."

"అంటే పెళ్ళిళ్ళను చూసే లోకం నవ్వుతున్నదన్నమాట!"

"మెల్లిగా అడుగుతావేమిటి? పెళ్ళంత ఫూలిష్‌థింగ్ మరోటుందా?"

ఎదిగిన ఆడపిల్లలకు సంబంధాలెవరు వెతకాలి? పెద్దవాళ్ళా? పెళ్ళి కావాలిసిన పిల్లలేనా? వాళ్ళు తమ కాబోయేభర్తలను తామే వెతుక్కోగలరా? ప్రేమ పెళ్ళిళ్ళ మాటేమిటి? అవి సాధ్యమేనా? ప్రేమ అన్నది పెళ్ళికి దోహదమా? ప్రతిబంధకమా? ఇటువంటి సమస్యలను గురించి సీరియస్‌గా, సగం వేళాకోళంగా మాట్లాడుకున్నారు. సెక్సువిషయాలమీద సంభాషణ నడిచేటప్పుడు అశ్లీలాలతో కూడిన జోక్స్ వెయ్యకుండా ఉండటం మగవాళ్ళకు సాధ్యంకాదు.

"ప్రేమకూ పెళ్ళికీ మధ్య కడుపనేది ఒక పెద్ద అవాంతరం," అన్నా రొకరు.

"పెళ్ళిగాని ఆడదానికి కడుపేగదరా ప్రేమచిహ్నం?" అన్నారు మరొకరు.


"పెళ్ళయిన దానికి అలాటి దేమీ ఉండదేం?" అని అమాయికంగా ఇంకొకరడిగారు.

"పెళ్ళయినాక ప్రేమకు చిహ్నాలేమిట్రా, నీ మొహం?"

ఆడపిల్లలు మగపిల్లలతో స్వేచ్ఛగా తిరిగితేగాని ప్రేమానుభూతి ఉండదు గదా, ఎన్నో తిరుగుళ్ళ అనంతరంగాని ప్రేమ దొరక్కపోతే? తప్పిన చోట నల్లా యురేనియం దొరుకుతున్నదా? ప్రేమ గీగర్ కౌంటర్లు మోసగించవని ఏమిటీ? ఎంతమందిదగ్గిర గీగర్ కౌంటర్లుండవో ఎలాతెలుస్తుంది? కథల్లోనూ, సినిమాల్లోనూ చూసి అదే ప్రేమ అని భ్రమపడేవాళ్ళ గతేంకానూ?

ప్రశ్నలు వచ్చినంతజోరుగా సమాధానాలు రాలేదు.

"ఒరే, ఎందుకురా ఈ చర్చలూ? ఈ ప్రపంచంలో ఏ ఆడదానికి ఏ మగవాణ్ణి పెళ్ళి చేసినా జీవితం ఒకటిగానేఉంటుంది. తేడా లన్నీ డబ్బునుబట్టి వస్తాయిగాని మనిషినిబట్టి రావు. అసలు, దాంపత్యంలో దంపతుల స్వభావమే నూటికి తొంభై తొమ్మిదిపాళ్ళు రిఫ్లెక్టవుతుంది. ఒక మొగుడితో దెబ్బలాడే పెళ్ళాం ఇంకే మొగుడితోనైనా దెబ్బలాడుతుంది. ఒక పెళ్ళాన్ని నెత్తి కెత్తుకుని మోసే మగాడు ఇంకేపెళ్ళాన్నయినా అలాగే మోస్తాడు. ఈ చిన్నరహస్యం తెలీక అయోమయంలో పడతాం. నా క్లాస్‌మేట్



శాస్త్రి అనిఉండేవాడు. మేంఫోర్తు ఇయర్‌లో ఉండగా వాడికి ఫస్టియర్ చదివే ప్రమీలపైన దారుణమైన ప్రేమ పుట్టుకొచ్చింది చాలా బాధపడిపోయా తనుకోండి! ఊర్వసికోసం పురూరవుడు కూడా అంతబాధ పడిఉండడు. అటువంటిశాస్త్రి చదువుసంధ్యలూ, అందచందాలూ లేనిదాన్ని పెళ్ళిచేసుకుని దాసానుదాసుడై ఉన్నాడు — వాడు ఆడదాన్ని ఆరాధించకుండా ఉండలేడు — నే నాడవాళ్ళతో మాట్లాడకుండా ఉండలేనట్టు।" అన్నాడు నాగభూషణం.

ఆడవాళ్ళ కొంపు మరో రకంగా ఉన్నది. వాళ్ళందరూ ఒక పెద్దగదిలో చేరారు. కొందరు అలంకరించుకుంటున్నారు. కొందరు అలంకరణాలు మార్చుకుంటున్నారు. సుభద్ర అప్పటికే రెండు చీరెలు కట్టివిడిచి, మూడోచీరె కట్టుతున్నది. వయసు మళ్ళినవాళ్లు ఎన్నడెన్నడో జరిగిన సంఘటన లన్నిటినీ నెమరువేస్తున్నారు. ఈ కాలపు పెళ్ళిళ్ళ మీద వ్యాఖ్యానాలు చేస్తున్నారు పిల్లల కోళ్ళవంటి తల్లులకు తమ పిల్లల లాగూ బొందులు విప్పటంతోనూ, జుట్టులో ఇరుక్కుపోయిన గొలుసులు తియ్యటంతోనూ సరిపోతున్నది

ఇందిర ఆడవాళ్ళ మధ్య కూచుని అంతా ఆలకిస్తున్నది విన్నదంతా తనకు కావలిసినవిధంగా జీర్ణించుకుంటున్నది. ఆపిల్ల బుద్ధెరిగిన తరవాత ఎవరు చెప్పిన ఏమాటా నిస్సంకోచంగా, పూర్తివిశ్వాసంతో స్వీకరించి ఎరగదు ప్రతిదానికీ అబద్ధాలు చెప్పేవాళ్ళమధ్యనో,

తనకన్న తెలివితేటలు చాలా తక్కువగా ఉన్నవాళ్ళమధ్యనో పెరిగినదాని లాటి మన స్తత్వం ఆమెకు అలవడింది నిజానికి ఆమె తండ్రి నాగభూషణంగాని, తల్లి సుభద్రగాని ప్రతిదానికీ అబద్ధాలాడే వాళ్ళు కారు, తెలివితక్కువవాళ్ళూ కాదు. కాని వాళ్ళిద్దరి దృక్పథాలూ ఎక్కడా కలిసేవికావు. ఒకరు ఉత్తరంగా చూస్తే రెండోవాళ్ళు దక్షిణంగా చూస్తారు. ఒకరి జీవితపు విలువలు రెండోవాళ్ళకి క్షుద్రంగా కనిపిస్తాయి. వాళ్ళమధ్య ఈ వైరుధ్యం తెచ్చిపెట్టుకున్నదికాదు; మొదటినుంచీ ఉన్నదే. అయితే దానిమూలంగా వారిద్దరూ ఒకరితో ఒకరు విభేదించటానికి గల కారణాలు కాలక్రమాన పెరిగాయి. మొదట్లో అతిముఖ్యమైన విషయాలమీదనే కీచులాడుకునేవారు. రానురాను చీపురుకట్టను తలమీద నిలబెట్టాలా, చివరలమీద నిలబెట్టాలా అన్న విషయానిక్కూడా అభిప్రాయభేదమే ఉంటూవచ్చి వాళ్ళు ఒకరిగొంతు లొకరు కొద్దినిముషాలు మించి భరించలేరు. ఒకరి దృఢవిశ్వాసా లొకరికి విషతుల్యంగా పరిణమించాయి. ఈ దాంపత్య స్వారస్యాన్ని ఇందిర ఏళ్ళ తరబడి చూస్తున్నది. కొంతకాలం ఆమె మనసు తండ్రివైపు మొగ్గేది. మరికొంతకాలం తల్లివైపు మొగ్గేది. చివర కిద్దరూ ఉంటలే అనే నిర్ణయానికి వచ్చింది; ఎవరు చెప్పేదానిలోనూ పూర్తి నిజం లేదని నిశ్చయించుకున్నది.

పదహారేళ్ళు గట్టిగా నిండని ఇందిరకు మామూలుమనుషులు అవలంబించే నమ్మకాలలో చాలాభాగం వృథా అని ఏనాడో తెలిసిపోయింది దేవుడిలో నమ్మకం ఉన్నవాళ్ళకన్న లేనివాళ్ళే 'తేలికగా' ప్రయాణిస్తున్నట్టు కనపడ్డారు. మద్రాసులో ఇందిర దైవభక్తి గలవాళ్ళను చాలామందిని చూసింది. నీలవేణి వాళ్ళింట్లో ప్రతిదానికీ వర్జమూ, రాహుకాలమూ, యమగండమూ చూస్తారు ఎవరికి కాస్త జబ్బు చేసినా వెంకటేశ్వరస్వామికి ముడుపులు కడతారు. ఏడాదికి రెండు మూడు సార్లు ఇంటిల్లిపాతీ తిరపతి వెళ్ళి, మగాళ్ళంతా గుళ్ళు చేయించుకుని, బోడిగుళ్ళతో తిరగటానికి సిగ్గుపడి, టోపీలు పెట్టుకు తిరుగుతారు — దేవుడిలో నమ్మకం లేనివాళ్ళు నవ్వుతారని నమ్మకం ఉన్నవాళ్ళకు భయం! ఆ నమ్మకం ఉంటే నేం, లేక పోతే నేం?

నీలవేణివాళ్ళింటి నిత్యజీవితం ఇందిరకు బాగాతెలుసు. వాళ్ళు ఈ యుగానికీ, ఈ తరానికీ చెందిన ట్టుండరు. వాళ్ళ తిండీ, ఆలోచనలూ, మాటలూ, గొంతెమ్మ కోరికలూ, భయాలూ, అనుమానాలూ, అన్నీ పాతవాసన. వాళ్ళ నిషేధాలూ అటువంటివే. వారానికో సినిమా చూడటమూ, ఎక్కడన్నా మంచి పాటకచ్చేరీ ఉంటే వెళ్ళటమూ, ఇంట్లో రేడియో పెట్టటమూ, కొత్తరకం నైలాన్లూ, జార్జెట్లూ కొనటమూ, ఎత్తు



యువ

మడమల చెప్పు వేసుకోవటమూ, గోళ్ళకి క్యూటెక్స్ పూసుకోవటమూ — ఇలాటి వన్నీ వాళ్ళ దృష్టిలో అఘాయిత్యం మనుషులు చేసే పనులు! ఆఖరుకు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్ర లంటేకూడా వాళ్ళ కేవో భయం: "మా కాలంలో మే మిలాంటి ఎరగమమ్మా!" అన్నది నీల నాయినమ్మ

వాళ్ళ మనస్తత్వం ఇందిరకి అర్థమయింది. ఒక రేడియో కాదు, స్టెయిన్‌లెస్ గ్లాసు కాదు — ఏదైనా ఒక వంద ఏళ్ళపాటు నిలబడితే తప్ప. దాన్ని వాళ్ళామోదించరు. ఒక శతాబ్దం వెనక పడిఉండటానికి ఇంతకన్న మంచి సూత్రం ఏం కావాలి?

ఇందిర కున్న దృఢ విశ్వాసాలలో డబ్బుమీది విశ్వాసం ఒకటి. మనిషి అవసరాలే గాక, ధైర్యమూ, ఆత్మ విశ్వాసమూ, స్థాయీ, పలుకుబడీ — అన్నీ డబ్బుపైన ఆధారపడి ఉన్నాయి. ఈ సంగతి అనేకసార్లు గమనించింది ఇందిర. ఆమె తండ్రి నాగభూషణం డబ్బు ఖాతరుచేసేవాడు కాదు. సులువుగా అయినా, పదీ సంపాదించుకునే అవకాశాలను ఆయన చాలాసార్లు వదులుకున్నాడు. అది ఇందిర కర్థమయేదికాదు. అంతకన్న అర్థమయేవి కావు ఆయన చెప్పే కొన్ని ఆదర్శాలు. ఆయన లిస్టులో కొన్ని పనులు 'నీచం': కొన్ని విధాల డబ్బు సంపాదించటం కన్న మాడటం మేలు. కొంతకాలం తన తండ్రి చెప్పే కబుర్లను ఇందిర ప్రగల్భాలకింద కొట్టేసింది. కానీ తీరా విచారిస్తే, ఆ మనిషి డబ్బుకు ఇబ్బంది పడేటప్పుడుకూడా డబ్బంటే ఖాతరు లేనట్టే ప్రవర్తించేవాడని తెలిసింది. అదొక రకం పిచ్చి అయిఉంటుం దన్న నిర్ధారణకు వచ్చింది ఇందిర. డబ్బు ఏ పరిస్థితుల్లోనూ తృణీకరించవలసినది కాదు. అక్రమంగా డబ్బు సంపాదించే వాళ్ళనుకూడా జనం చాటున తిట్టినా ఎదట గౌరవిస్తున్నారు. ఈ కుటుంబ రావునే చూడరాదూ? డబ్బును అయస్కాంతంలాగా ఆకర్షిస్తాడు. చాటున ఒక్కరుకూడా ఆయన్నిగురించి మంచిగా చెప్పుకోరు. కిందటేడు ఆయన తమ్ముడి కొడుకు పెళ్ళి జరిగితే ఈ వచ్చిన బంధువుల్లో నాలుగోవంతుమంది రాలేదు. ఎందుకంటే ఆయన గట్టిగా రెండొందలు తెచ్చుకోలేని బడిపంతులు!

డబ్బులో నమ్మకం ఉన్నట్టుగానే ఇందిరకు మరొకందులోకూడా గాఢమైన విశ్వాసం ఉన్నది — దేనికిగాని సాధ్యమైనమటుకు ఇంకోరిపై ఆధారపడరాదు. నీ విషయం ఇంకొకరి కెందుకు పట్టుతుంది? ఇంకొకరి భారం మీద వేసుకునేవాళ్ళంత మూర్ఖులో, తమ భారం ఇంకోరిపైన వేసేవాళ్ళు కూడా అంతమూర్ఖులే. ఆ వెంకటేశ్వర్లు గారమ్మాయి వర్ధని చూడరాదూ? తనకు

తల్లిదండ్రులు మొగుణ్ణి వెతుకుతారని నాలుగేళ్ళుగా ఎదురుచూస్తున్నది. వాళ్ళు తమకు చాతకాదని చెప్పరు. వాళ్ళకే తెలీదేమో. మొదటిఏడు పాడు సంబంధాలని తోసేసినవి రెండో ఏడు ఫరవాలేదనిపించాయి; మూడో ఏడు మంచి వనిపించాయి; ఈ యేడు గొప్ప వనిపించాయి. తల్లిదండ్రులు ఈ విధంగా తమ అభిప్రాయాలు తారుమారు చేసుకుంటూండటం చూసి, వాళ్ళ అసమర్థత గ్రహించింది కాబోలు వర్ధని, సుభద్రమ్మత్తయ్య దగ్గిర చిన్నశోకం పెట్టింది.


"స్టుపిడ్ !" అనుకున్నది ఇందిర. అదంతా వర్ధని మీద ద్వేషం కాదు; ఇందిర తన మనశ్శక్తులను దృఢపరుచుకునేటందుకు ఆవిధంగా కొందరు మనుషలనూ, వైఖరులనూ కసితీర తిట్టుకునేది. అది తనకు బలం! నాలుగేళ్ళ తరవాత అయేది, పధ్నాలుగేళ్ళ తరవాత అయేది, తనపెళ్ళి తానే చేసుకోవాలని ఇందిర కొంతకాలంక్రితమే నిర్ణయించుకున్నది.

ఇందిరను — పదహారేళ్ళు నిండని దాన్ని — గురించి తెలుసుకోవటం అవసర మనుకునేపక్షంలో ఆమెకు వేటిలో బొత్తిగా నమ్మకం లేదోకూడా తెలుసుకోవటం అవసరమే. ఆమెకు చదువులో నమ్మకం లేదు. పెద్ద చదువులు దండగ. ఆడది ఉద్యోగాలు చేసి ఊళ్ళేలదు—పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచారిణిగా ఉండదలిస్తేతప్పు. పెళ్ళికాకుండా ఉండిపోవాలనే ఉద్దేశం ఇందిర కేకోశానా లేదు ఇల్లాలు ఉద్యోగం పెద్ద ఉద్యోగమే సరయినవాడికి ఇల్లాలు కావటంలో ఉంది చాకచక్యమంతా.

ఆమెకు ప్రేమలో నమ్మకం లేదు ప్రేమంటే ఏమిటో తెలీదు. అయినా అందులో నమ్మకం లేదు. ప్రేమకూ త్యాగానికీ — అంటే అడ్డమైన కష్టాలూ పడటానికీ — ఏదో సంబంధం ఉందని ఇందిరకు గట్టి నమ్మకం. ప్రేమ అనేది పరీక్షకు వచ్చేది కష్టాల్లోనే కద! ప్రేమ నిరూపించటాని కని ఎందుకు కష్టాల్లో పడటం? కేవలం బుద్ధితక్కువ.

ఇంకొక్క విషయంకూడా స్పష్టం చెయ్యాలి. ఇందిరలో విప్లవ చైతన్యం ఏమీ లేదు. సంఘాన్నీ, సాంఘిక నియమాలనూ ధిక్కరించి, పదిమందీ నడిచే బాట వదిలేసి ఒంటరిగా వెళ్ళిపోయే తత్వం ఆమెలో ఎకోశానా లేదు. అట్లా చేసినవాళ్ళెవరూ బాగుపడరు. సుఖపడరు; ఎక్కడన్నా కోటికొకరు గొప్పవాళ్లయితే అవుతారేమో! అట్లా గొప్పది కావటం ఇందిర ఉద్దేశం కాదు

లోకం చెప్పేది వింటే లోకం అర్థం కాదు. లోకం చేసేది తెలియాలి. నీతీ, నిజాయితీ, ప్రేమా, ధర్మమూ, కళా, సంస్కారమూ, శీలమూ, దేశభక్తీ, అభ్యుదయమూ, పుణ్యమూ పాపమూ మొదలైనవాటిని గురించి తెగమాట్లాడ



తారు. దెబ్బలాడుకుంటారుకూడా. కాని ఆచరణలో డబ్బు వీటన్నిటినీ జయిస్తుంది. సుఖాపేక్షకన్న బలవత్తరమైన వేదీ లేదు.

"కనకమ్మొదిన వొచ్చిందర్రోయ్! రా వదినా, రా!" "ఇదేనా రావటం? నీ కోసమే ఎదురు చూస్తున్నాం, పిన్నీ. రైలువేళ అయినాక నీకోసం మామయ్య పదిసార్లన్నా అడిగాడు — వచ్చిందా, వచ్చిందా అని." "రైల్లో రాలేదు, తల్లీ. కార్లో వచ్చాం. దారిలో చిన్న ఆక్సిడెంటు కూడా అయింది." "హయ్యో, హయ్యో! ఎవరికీ దెబ్బలు తగల్లేదుగద?" "ఎవడో గొడ్డకాసుకునే కుర్రాడల్లే ఉన్నాడు, కారుకింద పడ్డాడు. కాలువిరిగిందంతే. ప్రాణంపోలేదు." "ఓస్ ఇంతేనా?" "శేషమ్మత్తా, కాస్త లేవ్వమ్మా, తల్లీ. కనకమ్మొదిన కూర్చుంటుంది!"

కనకమ్మ రాకతో ఆడవాళ్ళంతా ఎర చూసినచేపలైపోయి అంతులేనిసంచలనం పొందారు. ఇందిర కీ కనకమ్మ ఎవరో తెలియలేదు. మనిషిని పరీక్షగా చూసింది. ఆవిడ సన్నగా, ఎత్తుగా, కొంచెం జబ్బుమనిషిలాగా కనపడింది. వయసు నలభైకి లోపే ఉంటాయేమో గాని, మొహం పాలిపోయి ముడతలు పడటంచేతా, జుట్టు నెరవటంచేతా, కళ్ళజోడు పెట్టుకోవడంవల్లా మనిషిలో ముసలితనపు లక్షణాలు జాస్తిగా ఉన్నాయి. చెవులకు రవ్వలదుద్దులున్నాయి మెడలో

పాతకాలపు జిగినీ ఉన్నది దాన్లోవికూడా రవ్వలల్లేనే ఉన్నాయి. బనారసు సిల్కు చీర కట్టుకున్నది, చీరె జరీముద్ద. ఆవిడ మొహం నిలువునా సాగదీసినట్టుగా ఉన్నది. చిన్నమూతి, నలుపెక్కుతున్న పెదవులూనూ.

ఆడవాళ్ళు మర్యాదచేస్తున్నదీ, ఆరాధిస్తున్నదీ కనకమ్మను కాదు, ఆవిడ వెనక డబ్బును. ఈ సంగతి తెలుసుకోవటానికి ఎమ్మే చదవాలా ?

ఈ కనకమ్మను గురించి తమఇంట్లో ఎన్నడూ జాస్తిగా మాట్లాడుకున్నట్టు లేదు. అంత దగ్గరబంధుత్వం కాదేమో. ఇతరుల సంభాషణనుబట్టి, ఆవిడ ఉండేది హైదరాబాదులో ననీ. ఆవిడ భర్త రఘురామయ్య అనీ, ఆయన అక్కడివాడే ననీ, కాంగ్రెసు పెద్దల్లో ఒక డనీ, ఆవిడకొడుకు ఈ మధ్యనే అమెరికా వెళ్ళా డనీ, వాళ్ళకు అయిదారులక్షల ఆస్తీ, ఒక పెద్ద లంకంత ఇల్లూ ఉన్నా యనీ ఇందిరకు తెలియవచ్చింది.

"నాకే అంత ఆస్తి ఉంటే నన్నూ అందలం పడతారు వీళ్ళు." అనుకున్న దామె.

తరవాత ఆమెకు రఘురామయ్యగారు కూడా కనిపించాడు. కనకమ్మనుబట్టి ఆయనవయసు ఏభైలభై అయిదో ఉండవచ్చు, కాని చూపులకు కనకమ్మకన్నా చిన్నగా కనిపిస్తాడు గాంధీటోపీ పెట్టుకున్నంతసేపూ ఇంకా కుర్రాడుగా కనిపిస్తాడు. పచ్చని పసిమి, చిన్నమొహం, మొహాన ఎలాటి ముడతలూ లేవు, కళ్ళు నొసలు కాక పాదాలు తప్పిస్తే. టోపీ తీసేస్తే బట్టతల. గొప్పవాడి పోజు లేవీ లేవు. అందరితోనూ కలివిడిగా మాట్లాడతాడు, ఎవ రేజోకు వేసినా నవ్వుతాడు. మాటమాత్రం కొంచెం హైదరాబాదు యాస. ఆయన మిగిలినవాళ్ళకు కనకమ్మగారిద్వారా బంధువు.

మగవాళ్ళంతా ఆయనకు బ్రహ్మరథం పడతారని ఇందిరకు చూడకుండానే తెల్సు. ఆయన ఈ పెళ్ళికి రావటం పేదలకు అన్నదానం చెయ్యటంకన్న గొప్పపని అయినట్టుగా కొందరు కీర్తించారు. ఆక్సిడెంటు మాట విని అందరూ అద్భుతంగా ఆశ్చర్యం అభినయించారు.

"చిక్కేమిటంటే. మనపల్లెటూళ్ళవాళ్ళింకా మోటార్లకు అలవాటు పడలేదు. వాళ్ళు కారును చూసి భయపడవలసిన క్షణంలో ఆశ్చర్యంలో మునిగిపోతారు." అన్నాడు రఘురామయ్యగారు.

"అది నిజం. బస్తీలలోవాళ్ళు ఎంత స్పీడుగా వచ్చే కారునైనా అంగుళం ఎడంలో అవలీలగా తప్పుకుంటారు. పల్లెటూళ్ళవాళ్ళు కారుకు అడుగు దూరంలో ఉన్నా ఆక్సిడెంటు జరుగుతుంది. కంగారు పడతారు !" అన్నాడు సీతాపతి.

పెళ్ళి బాగానే జరిగింది అయినా లోపాలను ఒక్కటికూడా బీరుపోకుండా అన్నిటినీ ఆహూతులు విమర్శించు కున్నారు

ఇందిర అవకాశం చిక్కినప్పుడు పెళ్ళికూతురు జానకితో మాట్లాడింది. ఈ సంబంధం ఆమెకు నచ్చిందా? లేక మనస్సు సరిపెట్టుకున్నదా? పెళ్ళికొడుకు లోని ఆమె కేమేం అందాలు నచ్చలేదు? జానకి ఏమీ చెప్పలేకపోయింది. ఈ సంబంధం మంచిదో చెడ్డదోకూడా ఆమెకు తెలీదు. వాళ్ళమ్మ, నాన్న మంచి సంబంధమన్నారు; అందుచేత మంచిదే అయుండాలి...లేదు, తన కిలాంటి భర్త వస్తే బాగుంటుందని ఆమె ముందుగా అనుకోలేదు—అనుకున్నట్టు జ్ఞాపకంలేదు.

వచ్చిన సంబంధాల్లో ఇంతకన్నా అందంగా ఉన్న వాళ్ళెవరూ లేరా? ఏ సంబంధాలు వచ్చిందీకూడా జానకికి తెలియదు.

'ఇడియట్' అనుకున్నది ఇందిర.

పెళ్ళిలో ఆఖరు ప్రోగ్రాంకింద పాట కచ్చేరీ పెట్టారు. పాటగాడు గొప్పవాట్ట. అతడు పాడుతుంటే ఎవరూ విన్నట్టులేదు. చాలా సేపు పాట ఆలకిస్తున్నట్టు కూర్చున్న ఒక పెద్దమనిషి అకస్మాత్తుగా పక్కవాడి కేసి తిరిగి, "అయితే కాంపెన్సేషన్ రాదంటావా ?" అన్నాడు.

"కాంపెన్సేషను మాట దేవు డెరుగు? ఖర్చులుకూడా వచ్చేట్టులేవు." అన్నాడు మొదటి పెద్దమనిషి నిట్టూర్చి లేచి, జేబులోంచి ఒక చుట్ట తీస్తూ అవతలికి వెళ్ళి పోయాడు

ఇందిర ఈ సంఘటన తన మనసులో రిజిస్టరు చేసుకున్నది. ఎవరి గొడవ వాళ్ళది! వాస్తవ జీవితం అంటే. ఉద్యమాలు వచ్చినప్పుడు పదిమందీ కలిసి ఒకే గొడవలో పడిపోతారు; కాని అది అసహజమని ఇందిర నమ్మకం. వాళ్ళ స్కూలు పిల్లలు పదిమందీ కలిసి నాటకం వెయ్యటం ఆమె చూసింది. పది స్వభావాలు ఏకోన్ముఖం కావటం ఎంత దుస్సాధ్యమైన పనో ఆమె గమనించింది.

పెళ్ళినుంచి తిరిగి వచ్చేటప్పుడు నాగభూషణమూ, సుభద్రా పెళ్ళిగురించి మాట్లాడుకున్నారు. అంటే ఒకరి నొకరి వ్యతిరేకాభిప్రాయాలు ఖండించు కున్నారు.

"పెళ్ళికొడుకు నా కేం నచ్చలేదు. పెళ్ళికొడుకు పెద్దక్క మెళ్ళో కట్టెడు బంగారం. పెళ్ళికొడుకు తల్లి కెంత నిక్కు? భూమ్మీద నిలిచిందా? రాఘవయ్య కూతురు షోకులు చూడలేక చచ్చాం! దాని కళ్ళెప్పుడూ మగాళ్ళ మీదే!" అంటూ సుభద్ర మెటేక్ అల్లుకు పోయింది.

"పెళ్ళికొడుక్కేం నిక్షేపంగా ఉన్నాడు," అన్నాడు నాగభూషణం.

"మీ రనాల్సిందే."

"ఇంకా చాలామంది అన్నారు"

"నే వింటుండగా ఒక్క రన్లేదు - ఒక్కరు!"

"కీచులాట్టాని కే మొగుడైతే నేం?"

"ఆ వేదాంతంలో పడితే వేలకు వేలు కట్నా లివ్వటం దేనికీ?"

"బుద్ధిలేక!"

"రేపు మీ కూతురికి కట్నం లేకుండా పెళ్ళి చేస్తారు! నే చూస్తా!"

"కట్నం తీసుకోకుండా వచ్చే మొగుడు మరింత లోకువ. వాడిపైన ఒంటికాలితో పోవచ్చు. ఇందిరని కట్నం అడగనివాడికే ఇద్దాం!"

మెడమీద తల ఉన్నవా డెవడూ కట్నం తీసుకోకుండా పెళ్ళాడ్డు. నే రాసిస్తా!"

"సరే అయితే ఎవడు తక్కువకట్నం తీసుకుంటే వాడి కిచ్చి చేద్దాం."

"అంతే. ఏ కుంటాడికో, గుడ్డాడికో ఇచ్చి చేస్తేసరి!"


ఇందిర ఈ సంభాషణ వింటూ ఉండి పోయింది.

ఇందిర తమ్ముళ్ళు శేషూ, సుబ్బూ కిటికీ దగ్గిర చేరి, కళ్ళల్లో పడే నలక లను కూడా ఖాతరు చెయ్యకుండా రైలు మార్గంవెంబడి గల దృశ్యాలను ఒకరి కొకరు చూపించుకుంటున్నారు.

## 2

నాగభూషణానికి మద్రాసులో కో ఆప రేటివ్ ఇన్సూరెన్సు కంపెనీలో పని: రెండువందలయాభైదాకా చేతికి వస్తుంది. కొచ్చేరు పొలాలమీద ఏటా ఏడెనిమి దొందలు వస్తుంది. వాటిని బట్టలూ, దుప్పట్లూ, పాత్రసామగ్రీ, ఇతర గృహోపకరణాలూ కొనటానికి ఖర్చు చేసేస్తాడు. అందులోనే తన అరవై అయిదేళ్ళ ఎండోమెంటు పాలసీ - అయిదువేలు - ప్రీమియం కట్టేస్తాడు జీవితంలో నిత్యఖర్చు అనే బాధ లేకుండా గడుస్తుంది. వాళ్ళింటో "ఎవరూ విలాసపు ఖర్చులు చెయ్యరు. సుభద్ర మ్మకు చీరలపిచ్చి ఉన్నది. ఎవ రే కొత్త రకం చీర కొన్నట్టు తెలిసినా అలాటిది తానుకూడా కొనేదాకా నిద్రపోదు ఆవి డకు ఇద్దరన్నలూ అప్పుడప్పుడూ డబ్బు పంపిస్తూంటారు.

సుభద్రమ్మ అందగత్తెల్లోకీ రాదు. అనాకారుల్లోకీ రాదు. "నువు కొంచెం శ్రద్ధగా అలంకరించుకున్నా వంటే పెద్ద అందగత్తెల్లో జమ అవుతావమ్మా." అని సుభద్ర పెద్ద వదినెగారు ఏనాడో అన్నది. ఆవిడగారు అందగత్తె కాక పోయినా అందచందాలు తెలిసిన మనిషి ఒక విధమైన స్పెషలిస్టుకూడా. ఎవరి జుట్టు ఏ విధంగా ముడవాలో, ఎవరికి ఏ రంగు చీరలు ఎట్లా కట్టుకుంటే అం దంగా ఉంటుందో ఆవిడ చెప్పేది ఆవిడ సలహాల ప్రకారం అలంకరించు కుంటున్న వాళ్ళు - బద్ధకస్తులై మానేస్తే ఏమోగాని - డజన్ల సంఖ్యలో




"ఇప్పు డర్థమయింది; కుక్కకి గుడ్డ ఎక్కడినించి తెచ్చిందీ!"

ఉండాలి. సుభద్ర మటుకు సుభద్ర ఆవిడ నేర్పిన ముడే వేసుకుంటున్నది, అప్పటి జుట్టులో ఒకవంతు రాలిపోయినా కూడా.

పదిహేనేళ్ళ ఉద్యోగంలో నాగభూషణం సాధించిన ఘనకార్య మేమంటే ఇల్లుకట్టాడు. దానికి తోటి గుమాస్తాలు పొలంలో ఇల్లని పేరుపెట్టారు. ఎవరో ఒక ఎకరం పొలాన్ని ఇళ్ళ స్థలాల కింద మార్చి చౌకగా అమ్మారు; నాగభూషణం స్నేహితులు కొందరు కొంటుంటే తనుకూడా ఒకటిన్నర గ్రౌండు కొన్నాడు. పొలం అమ్మినవాడు బాగు పడ్డాడు; వాడికి మూడేళ్ళుగా దానిమీద చిల్లిగవ్వ రావటంలేదు. నాలుగేళ్ళ క్రితంకూడా వరి వేశాడు. చుట్టుపక్కల ఊరు పెరిగింది. గొడ్లూ, మేకలూ వచ్చి పైరు కంటికి కనపడకుండా చేశాయి మూడేళ్లు ఎండబెట్టి ఇళ్ళస్థలాలకింద అమ్మాడు: అయిదుసెంట్ల ప్లాటులో తనుకూడా ఒక గుడిసె వేశాడు.

ఆ స్థలాల్లో అందరికన్న ఆఖరుకు ఇల్లు కట్టినవాడు నాగభూషణమే; మిగతా వాళ్ళంతా పాకలు వేసుకున్నారు. పునాదితో ఇళ్ళు కట్టటానికి కార్పొరేషను ఒప్పదు; ఆ స్థలాలు డెవలప్ కాలేదు; అందరూ కలిసి బెటర్మెంటు చార్జీలు కట్టి ప్లాను శాంక్షను చేయించుకున్నాకగాని పక్కాగా ఇళ్ళు కట్టటానికిలేదు. అయినా నాగభూషణం మంగళూరు పెంకులతో ఇల్లు కట్టాడు. కప్పును స్తంభాలమీద నిలబెట్టి, స్తంభాలమధ్య నాలుగున్నర అంగుళాల గోడ కట్టి, అందులోనే రెండు వాకిళ్ళూ, ఆరు కిటికీలూ పెట్టాడు. నేల గచ్చు చేశాడు వంటిల్లు మరుగుగా

ఉండటానికి తడక ఒకటి అమర్చాడు. ఇల్లుకుగాను పదిహేను వందల దాకా ఖర్చయింది. స్థలంతో కూడా రెండువేలు. అయితే నేం నెలకు ముప్పైఅయిదు రూపాయల అద్దె మాఫయి పోయింది. నాలుగైదేళ్ళలో పెట్టినఖర్చు వచ్చేస్తుంది. దొడ్లో నాలుగురకాల పాదులు పెట్టుకుని సుఖంగా తినవచ్చు. పనిలోపని, నాలుగు పూలమొక్కలు కూడా వేస్తే తల్లికీ పిల్లకీ పోలేరన్ని పూలు!


కాని ఇదంతా చెప్పినంత సులువుగా జరగలేదు. నాగభూషణం జీవితమే ఒక హాండీకాప్ రేస్. అడుగడుగునా సుభద్ర అడ్డం తగులుతూనే ఉంది. మొదట స్థలం చూడటానికి వచ్చినప్పుడే ఆవిడ, "ఛీ! ఛీ! ఈ స్థలంలో గొడ్లుకూడా ఉండవు," అన్నది. సుబ్బు కడుపులో ఉన్నాడు, వేవిళ్ళు: సుభద్ర ఆ స్థలంలోనే వాంతి చేసుకున్నది. "నాన్న కొన్న స్థలం చూసి అమ్మ వాంతి చేసుకున్నది," అని ఇందిర గంభీరంగానూ, శేషు వచ్చీ రాని మాటలతోనూ, ఇంటికొచ్చినవాళ్ళందరికీ చెప్పారు. అదొక జోకుకింద పరిణమించి ఏళ్ళతరబడి సర్క్యులేషన్లో ఉండిపోయింది.

తరవాత ఇల్లు కట్టేటప్పుడు వచ్చి చూసి, "ఛీ! ఛీ! ఇది ఇల్లా! నిప్పు పెట్టెఅంత ఉన్నది. ఇదీ, చూస్తూం డండి, నా నెత్తినే కూలుతుంది!" అన్నది సుభద్ర.

"ఇంతకన్న చిన్న ఇంటికి 35 ఇచ్చుకుంటున్నాం. నాగభూషణం కొలతలతో సహా నిరూపించాడు కాని సుభద్రకు కొలతల్లో నమ్మకం లేదు. నిజానికి సుభద్రకు నమ్మకం లేంది గణితంలో కాదు. ఇటుకల్లో కాదు. ఇల్లు కట్టే వాళ్ళలో కాదు. వాస్తుశాస్త్రంలో కాదు — నాగభూషణంలో. తన ప్రాణం కొద్దీ ఒక్కొక్క నిట్టూర్పు [illegible] మొగుడు [illegible] చెప్పినా [illegible] పోతే పోని అనుకోవచ్చు [illegible] ఉండిపోయి ఏమీ ప్రయోజనం [illegible]

"నిన్నేం చేయమన్నా. [illegible] లోకి పోతున్నావు!" అన్నాడు [illegible] యిల్లా? చుట్టూ బంగాళాలు! [illegible] కావచ్చు. నీళ్ళులేవు. అందరూ బావులు తవ్వించారు. [illegible] చేసుకున్నాం. [illegible] పంపు [illegible], ఓడి [illegible] నీళ్ళు, ఆ నాయుడుగారి భార్య [illegible] ఓ బిందెడు నీళ్ళు తెస్తే తాగినట్టు, [illegible] లేదు. వాళ్ళయితే మాత్రం [illegible] ఎందుకిస్తారూ? నెలకు రెండుగదులు, [illegible] అయినా [illegible] లేదు.

"నువ్వొకొక్కటే బిందె పట్టుకు బయలు దేరుతున్నావు. బిగిలిన అందరూ బావుల్లో నీళ్ళే తాగుతున్నారు. నవ్వు ఉడుకుతున్నది, సబ్బు నురుగొస్తుంది. మన నీళ్ళకేం మాయరోగమా? మా వూళ్ళో ఇంతకన్న ఉప్పులు తాగాం," అనేవాడు నాగభూషణం.



"నా గీత బాగుంది నేను మీ ఇంట్లో పుట్టాను కాను."

"నాకా ఒంటర్లోనే ఉద్యోగమైతే ఏం చేసేదానివో?"

"ఇంకా నయం! ఉన్న ఉద్యోగం ఊడిం దనుకుని వస్తు ఉండుకున్నారు కారు. కలిగి కర్మం, లేక దరిద్రముకు! హాయ్యో, రాత! ఇంతోటిల్లు కట్టటానికి వెయ్యి రూపాయలు లోను తెచ్చారు. లోను!"

ఈ ధోరణిలో ఏళ్ళతరబడి సుభద్ర చెప్తూనే ఉంది. చూస్తూండగానే అనేక స్థలాలు గ్రౌండు రెండున్నర వేలకూ, మూడువేలకూ పెరిగిపోయాయి.

ఈ వాగ్వాదాలు వింటుంటే ఇందిరకు చెప్పరాని చిరాకొచ్చేది. చెప్పటం సరిగా చాతకాదుగాని వాళ్ళమ్మ చెప్పే దానిలో ఒకనిజం కనిపించేది ఇందిరకు: తన తండ్రికి సహాయం కోరటమ్మనే వైరాగ్యం చాలా ఉంది. సొంతఇల్లు అక్కై యుండకపోవ్వ, సిద్ధంగానూ సుఖంగా లేదు. ఈ యింటికి ఎంత చేసినా ఇంకా చెయ్యవలసింది ఉండనే ఉంది. అక్కై ఇంట్లో ఉంటున్నప్పుడు ఏ సున్నమూ కానీసినా, దర్వాజా ఏమోర్చుడు దనా యింటేదనూ, చేయించుకోవటమూనూ.

నాగభూషణం కొత్తఇంటి తలుపు లకూ, ద్వారబంధాలకూ, కిటికీలకూ తనే రంగు వేసి, ఎంత ఆదా చేశాడో గొప్పగా చెప్పేవాడు. ఆయనకు అర్థమైన వెట్టి పనులా చెయ్యటమంటే ఇష్టం. దాన్ని కప్పిపుచ్చటానికి రెండురూపాయ లాదా అయిందనీ, రూపాయి పావలా ఆదా అయిందనీ చెప్పేవాడు — గోలీ లాటలో రెండు గోలీలు గెలుచుకున్న పిల్లాడల్లే. ఆయన వంద లాదా చెయ్యటంగురించీ,

తేలు అదా చెయ్యటంగురించీ ఎన్నడూ మాట్లాడేవాడుకాదు.

ఆ పెద్ద ఆలోచనలు సుభద్ర కుండేవి. వేస్తే మూడంతస్తుల మేడ వెయ్యాలి. ఓ వందెకరాల పొలం కొనాలి ! తా నను భవించేది దారిద్ర్యమనే ఆవిడ ఉద్దేశం.

"మనకన్న దరిద్రు లున్నారు. వాళ్లను చూసి తృప్తి పడరాదూ ?" అని నాగ భూషణం.

తృప్తికి అంతేమిటి ? ఒకపూట తినే వాడు రెండుపూటలా మాడేవాణ్ణి చూసి తృప్తిపడనా ? అదేనా బతకటమంటే ? మనకన్న ఒక మెటు పైన ఉన్నవాళ్ళని చూసి పైకి పోవా లనుకుంటారా, లేక పోతే మన కింద ఉన్నవాణ్ణి చూసి, "అమ్మయ్యో, మనం ఇంత భాగ్యవంతుల మైపోయామే !" అని ఉన్నచోటనే చతికిలబడతారా ?

ఇందిర అభిప్రాయంకూడా అదే. స్థాయి పెంచుకోవటానికి ప్రయత్నించ టంలో తప్పేమీలేదు. ఎవ రెన్ని ప్రయ త్నాలు చేసినా అందు కే. ఆ మధ్య ఇన్సూరెన్సు కంపెనీలో జీతాలు తక్కు వగా ఉన్నాయనీ, సమ్మెలు చేస్తామనీ అల్లరి చేశారు. అదంతా పైకి పోవాలన్న తాపత్రయం కాదుకాబోలు. తన జీవితం మటుకు గుంటపూలు పూయటానికి వీల్లేదు. అందు కేం చెయ్యాలో ఇందిరకు తెలీదుగాని, ఏం చెయ్యవలి సొచ్చినా చేసేస్తుంది !

ఇందిరకు అటే స్నేహితురాళ్లు లేరు. ఇంటిపైన అసహ్యం పుట్టినప్పు డల్లా సుశీలావాళ్ళింటికి వెళ్ళేది. సుశీల నాన్న తన నాన్నకన్న మూడింతలు సంపాది స్తాడు వాళ్లు ఒక ఇల్లంతా అద్దెకు తీసుకు న్నారు. రెండువందలు అద్దె. కట్టటం ఎప్పుడు కట్టారోగాని, కొత్తగా కట్టిన ఇల్లల్లే ఉంటుంది. లోపలా, బయటా చక్కగా రంగు వేశారు. కాంపౌండు నిండా తొట్టెల్లో రకరకాల మొక్కలు. సగానికి సగం పూలమొక్కలు.

వాళ్ళకి కా రుంది. మూడేళ్ళ కిందట కొన్నకారు, కొత్తదల్లే ఉంటుంది. ప్రతి ఆదివారమూ ఎటోఒకటు పిక్నిక్ పోతారు. ఇంట్లో రేడియోగ్రా ముంది. అస్తమా నమూ సినిమాపాటల రికార్డులు మోగు తూంటాయి. ఇందిరకి సంగీతం మోజు లేదు. అది వేరే సంగతి. తనకు దేని పైనగాని మోజుండి, అది తీరకపోతే అది దరిద్రంకింద లెక్క !

సుశీలావాళ్ళింటి వాతావరణంలో ఇందిరకు నచ్చనివి లేవనికాదు. తన కన్న కొద్ది నెలలు పెద్దది, ఆ సుశీల వీలు దొరికినప్పుడల్లా ప్రేమ మహి మను గురించి మాట్లాడుతుంది. ప్రేమ సినిమా లొస్తే వదలదు. అస్తమానమూ ప్రేమ కథలు చదివి అందరికీ చెబు తుంది. "లవ్" అనేమాట ఆమె నోటంట చంటిపిల్లల చొంగకన్న ధారా



‘‘మీ ఆతిథ్యం మర్చిపోతాను దొర, మళ్ళా వారంలోపల తిరిగిరానూ ? ’’

శంగా వచ్చేస్తుంది — ఐ లవ్ పిక్నిక్స్, ఐ లవ్ స్వీట్స్, ఐ లవ్ క్రికెట్, ఐ లవ్ బ్లూ—అదీ వరస.

ఇంకో టేమిటంటే, సుశీలావాళ్ళ ఇంటికి సాయంకాలంపూట ఎవరెవరో వస్తారు. అప్పుడప్పుడూ రాజకీయాలు మాట్లాడతారు. ముఖ్యంగా సుశీలావాళ్ళ నాన్న అన్నిరకాల రాజకీయ వాదుల్నీ చేరుస్తాడు. డీ యం కే, కాంగ్రెసూ, సోషలిస్టూ, కమ్యూనిస్టూ; అన్ని రకాల రాజకీయాలను గురించీ ఆయన పక్షపాతం లేకుండా మాట్లాడతాడు. మనం పుస్తకాల్లో జరిగే హత్యలను గురించి జుగుప్స లేకుండా చదివినట్టుగా. చిత్రమేమిటంటే ఒకసారి కమ్యూనిస్టులను సమర్థించుతూ మాట్లాడేవాడు, ఇంకోసారి వాళ్ళను ఖండించేవాడు.

“కమ్యూనిస్టు దేశాల పట్లా, కమ్యూనిజం పట్లా కేపిటలిస్టుదేశాలు చాలా హిపోక్రిటికల్‌గా ఉన్నా యనటానికి సందేహంలేదు. రష్యాతోనూ, ఈస్టు యూరప్ దేశాలతోనూ డీల్ చేసే అమెరికా, ఫ్రాన్సు, బ్రిటనులు కమ్యూనిజమును ఎక్కిరాకుండా ఆపటానికి కోట్లుతగలెయ్యటం డౌన్‌రైట్ ఫూలిష్. చాతనయితే రష్యాతోనూ, చైనాతోనూ యుద్ధం పెట్టుకుని అమీ తుమీ తేల్చుకోవచ్చు. అంతేగాని చిన్నచిన్న దేశాలను నలగ్గొట్టటం డౌన్‌రైట్ బీస్ట్‌లీ!...” అని ఒకసారి అనేవాడు. — (సశేషం)

# తిమింగిలం వేట

(ఇందిర తనకు 16సంవత్సరాలు వచ్చేప్పటికే అనేక విషయాలు గ్రహించింది. తల్లి సుభద్రకూ తండ్రి నాగభూషణానికీ మధ్యలో వుండే అంతరం, భేదాభిప్రాయాలూ; ఒకరి కొకరు ఉత్తర దక్షిణ ధృవాలవత్ అని. జానకి పెళ్ళికి విజయవాడ వెళ్ళి ఎప్పుడూ చూడని అనేకమంది బంధువులనూ చూచింది - చాలామంది మనస్తత్వాలూ తెలుసుకుంది. తనకున్న స్నేహితురాండ్ర ఇంటిపరిస్థితులు తెలుసుకుంది. అనేక విషయాలు ఆకళింపు చేసుకుంది. అందువల్ల ఆమెలో స్థిరపడ్డ అభిప్రాయాలు కొన్ని - డబ్బు పుష్కలంగా ఉండాలనీ, డబ్బుతో అన్నీ జయించవచ్చుననీ, పెద్ద చదువులు ఆడవాళ్ళకు అనవసరమనీ, ఎవరిపెళ్ళి వారి నిర్ణయంమీదే జరగాలనీ, ఒకరిగొడవలతో మరొకరికి సంబంధం ఉండబోదనీ, ప్రేమ అనేది కథలకూ గాథలకూ తప్ప నిజజీవితంలో మిథ్య అనీ.) - ఇక చదవండి.

ఇంకోసారి, "ఈ కమ్యూనిస్టు దేశాలకు కొంచెంకూడా సెన్సున్నట్టు కనబడదు. చరిత్ర తమకు అనుకూలంగా ఉందిగదా అని ఇవి అమెరికా బ్రిటన్ వగైరా దేశాల్లో విప్లవంకోసం గోతి దగ్గర నక్కల్లే వేచి ఉన్నాయి. వాళ్ళను నమ్మి అనేక దేశాల్లో కమ్యూనిస్టులు ఆకాశంకేసి చూస్తూ, తమని తాము ఫూల్ చేసుకుంటూ, తమని నమ్మినవాళ్ళను కూడా ఫూల్ చేస్తున్నారు," అనేవాడు.

కాంగ్రెసు విషయంలోకూడా ఆయన ఒకప్పుడు అనుకూలంగానూ, ఒకప్పుడు ప్రతికూలంగానూ మాట్లాడేవాడు. "స్వాతంత్ర్యం కాంగ్రెసువాళ్ళ చేతి కొచ్చింది గనక బతికిపోయాం. మరో పార్టీ చేతి కొచ్చినట్టయితే దేశం ఈ పాటికి ముక్కలూ చెక్కలూ అయి, భీభత్సమైన పరిస్థితి ఏర్పడి ఉండును. దేశమంతటా పలుకుబడి గల మరో రాజకీయ పార్టీ ఏముంది ? ఆమాటకు వస్తే కాంగ్రెసులోనుంచి పుట్టని పార్టీకూడా ఏదీలేదు," అని ఒకసారి అనేవాడు.

మరోసారి, "ఈ కాంగ్రెసు నాయకుల ధోరణి చూస్తే అబగాపిల్లలు గుర్తుకొస్తారు. వీధిలో దమ్మిడీలు విసిరేస్తే ఎగబడతారు చూడూ, అదే తంతు. వీళ్ళ పరిపాలన సగానికి సగం ఫ్యూడల్‌గా ఉంటున్నది. రెండుపూటలా తినటానికి చాలని జీతాలను వీళ్ళు తెలిసి ఇస్తున్నారు. జమీందార్లకింద ఉద్యోగాలిలాగే ఉండేవిట. జీతం లెక్కలోకిరాదు; చాతనయితే జనాన్ని చెండుకుతిను ! అదే ధోరణిలో ఉంటున్నాయి ప్రభుత్వోద్యోగాలు కొన్ని. బ్రిటిషువాళ్ళు చేసిన పనే వీళ్ళూ చేస్తున్నారు !" అనేవాడు.

ఆయన రాజకీయసహకారానికి ఫలితం ఏమిటో, రోజూ ఆయనతో రాజకీయాలు మాట్లాడేవాళ్ళకూ్కడా తెలిసిఉండదు.

సుశీల అన్న స్నేహితుడు కాంతారావని ఉండేవాడు. అతను తరచు ఇందిరకు కనిపిస్తూండేవాడు. కారమ్స్ బాగా ఆడే

వాడు. వివేకానంద కాలేజీలో ఫోర్త్ఫియర్ చదువుతున్నాడు. అతను తన కారువాళ్ళే ఉన్నప్పుడు సైన్సు గురించో కమ్యూనిజం గురించో తప్ప మూడోవిషయం మాట్లాడేవాడు కాదు. అతననే మాటలు కూడా కొన్ని ఇందిర బాగా జ్ఞాపకం పెట్టుకున్నది.

"మనిషి సృష్టిలో ఎంతగొప్పవాడో రుజువవుతున్నది శాస్త్రజ్ఞానంలోనే— రాజకీయాలలో కాదు, నాగరికతలో కాదు, కళల్లో కాదు. మిగిలిన జంతువులతో పోలిస్తే గట్టిగా పదిలక్షల ఏళ్ల వయసులేని మనిషి పసివాడు. ఇంకో లక్ష ఏళ్ళకు కూడా మనిషి బాల్యం పూర్తికాదు. కాని ఇంకో వెయ్యేళ్ళలో మనిషి సంపాదించగల శాస్త్రజ్ఞానమూ, దాని ఉపయోగాలూ గురించి ఆలోచిస్తే తల తిరిగిపోతుంది ... ప్రపంచాన్ని స్వార్థం పాలిస్తున్నది. రాజకీయాలూ, శాసనాలూ అన్నీ స్వార్థాన్ని ఆశ్రయించుకున్నవే. కమ్యూనిజంకూడా అత్యధిక సంఖ్యాకుల స్వార్థమే. కాని అది కలవారి స్వార్థంలాగా వెర్రితలలు వెయ్యటం లేదు; నడివీధిలో బట్టలు విప్పెయ్యటం లేదు. పారిశ్రామికులు పనివాళ్ళ జీతం పెంచారు; సమ్మె చేస్తే బ్లాక్‌లెగ్స్‌కు రెండితలూ, మూడింతలూ కూలిఇస్తారు. లోకం దీన్ని సామాన్య విషయంగా పరిగణిస్తుంది. కాని నాకిది సిగ్గుమాలిన పనిగా కనిపిస్తుంది. దేశంలో దారిద్ర్యం తాండవిస్తుండగా అమెరికా బ్రిటనులవంటివి రక్షణ పేరిట కోట్లు ఖర్చు చెయ్యటం ఎంత సిగ్గుమాలిన పని! ఆస్తి, అసూయ, స్వార్థం, భయం, దౌర్జన్యం, రక్తదాహం — ఇవే మన జీవితాలనూ, రాజకీయాలనూ, అంతర్జాతీయ వ్యవహారాలనూ తీర్చిదిద్దుతున్నది!" ఇలా ఉంటుంది కాంతారావు ధోరణి.

ఇందిరకు అనిపించేది చాలాసార్లు, అందరూ మాట్లాడేదానికన్నా అతని మాటలు అర్థవంతంగా తెలుస్తూ, ఆసక్తికరంగా ఉండేవి. ఇంకో పదేళ్లు బతికుంటామని గట్టిగా చెప్పలేం; లక్షఏళ్ళ తర్వాత జరగబోయేదాన్ని గురించి లెక్కలు వేస్తాడేమిటి?

కామ్యూనిజమనగానే ఏవో ఆదర్శాలు వినపడతాయి. ఆదర్శాలు రోతే. ఆదర్శాలను నమ్మకుండా అవలంభించిన వాళ్ళు లోకాన్ని మభ్యపెడతారు. నమ్మి అవలంభించినవాళ్ళ స్వభావాలు మెలిక పడిపోతాయి. ఈ మాట ఇందిర తన తండ్రినోటే విన్నది. ఆ మాట ఆయన రుజువు చేశాడుకూడా. ఆయన కాంగ్రెసు వాళ్ళ ఉదాహరణే ఇచ్చాడు. గాంధీగారి ఆదర్శాలు కొందరిని పచ్చిదొంగలుగా తయారు చేశాయి. మరికొందరిని అస హజ స్వభావులుగా తయారు చేశాయి. ఆయన "నిజమైన" గాంధీ భక్తులను ఎరుగును. వాళ్ళ అసలు స్వభావాలు వేరు; వాళ్లు అలవరచుకోవటానికి ప్రయత్నించిన స్వభావాలు వేరు. వాళ్లు అయినవాళ్ళకూ, సంఘానికీ కూడా



ఎందుకూ పనికిరాకుండా పోయారు. తొందరపడి సన్యాసం పుచ్చుకొని, ఇంద్రియ సుఖాలకోసం అలమటిస్తూ, వాటిని తీర్చుకొనే ధైర్యసాహసాలులేక, తాము ధరించిన పాత్రలో బందీలుగా చిక్కుపోయిన స్వాములార్లలాగా తయారయారు.

ఒకసారి కాంతారావు మనిషి భవిష్యత్తంతా కమ్యూనిజంపైనే ఉన్నదనీ, పెట్టుబడిదారీవల్ల ఇకమీదట మానవ పీడనమే తప్ప పురోగమనం సాధ్యం కాదనీ వాదిస్తుంటే, ఇందిర ఈ వాదమే తెచ్చింది.

మొదట కాంతారావాశ్చర్యపోయాడు. సమాధానం చెప్పలేక గుడ్లు తేలవేస్తున్నాడనుకున్నది ఇందిర. అతను ఆశ్చర్యపోయింది ఇందిర ఆపాటి తెలివితేటలతో మాట్లాడినందుకు. అతను ఇందిరకు తాపీగా సమాధానం చెప్పాడు.

మనిషికి సహజమైన స్వభావమంటూ ఉంటే అది తలిదండ్రులనుంచి సంక్రమించినదే. ఆ స్వభావం పుట్టిన క్షణం నుంచీ మార్పు చెందుతూనే వస్తుంది. నాగరికమానవుడి స్వభావమంతా కృత్రిమమనే చెప్పాలి. ప్లీడర్లు డబ్బుకోసం ఎవరెవరి తగాదాలనో తమమీద వేసుకుని తమ క్లయింటుది న్యాయమైనా, అన్యాయమైనా అతడిపక్షము వాదించడంలో సహజత్వమేమీలేదు. పొలాలు దున్ని పండించే కుటుంబాలు ఏడాదికి మూడు నెలలు ఒంటిపూట తిండి తినటంలో ఏం సహజత్వం ఉన్నది? కార్మికులు పరిశ్రమలకు తమ శ్రమశక్తినంతా ధారపోసికూడా రాతియుగంనాటి మనుషుల్లాగా

కడుపు కింత తిండీ, వంటి కింత బట్టా లేకుండా క్షుద్రంగా జీవించటం సహజమేనా? మనుష్యుల స్వభావాలను సంఘానికి ఉపకరించేలాగ మెరిబెట్టటానికే చదువులూ, ఉపన్యాసాలూ, ధర్మబోధలూ, రాజకీయ ప్రచారాలూనూ! వర్గసమాజంలో ఈ కృషి యావత్తూ పాలక వర్గాని కనుగుణంగా పాలితుల మనస్తత్వాన్ని మెరిబెట్టటానికి జరుగుతుంది. పీడితులకు దైవభక్తీ, ప్రభుభక్తీ, విధియందు నమ్మకమూ మొదలైన క్షుద్రభావాలు ప్రచారమవుతాయి... ఇందిర చెప్పిన గాంధీ భక్తులు తమ స్వభావం కృత్రిమంగా తయారుకావటం చేత సంఘానికి పనికిరాకుండా పోలేదు; వారి స్వభావాల మెరికెలకు కాలదోషం పట్టి అతి కృత్రిమంగా కనిపింతాయి. నాటి కాంగ్రెసువాళ్ళు తమ గాంధీజాన్ని సొమ్ము చేసుకుని ఉంటారు. పదవులూ, డబ్బూ గడించి వుంటారు. పైకి వచ్చి ఉంటారు. ముఖ్యంగ నారంభించిన ఆదర్శాల చెప్పులను ఏనాడో విడనాడి ఒడ్డుకు చేరి ఉంటారు. ఈ మన దేశంలో నియోగిప్రభువుల ప్రతిభ సన్నగిల్లినాక వేదఘోషలో నిపుణులైనవాళ్ళు రెడ్డి ప్రభువులవద్ద మాన్యాలు పొందారు. వారి మునిమనవళ్లు ఆ వేదాలనే పట్టుకు వేళ్ళాడి చాందసులై, సంఘంలో గుడ్డిగబ్బిలాల్లాగా తయారయారు. సంఘం మారినంత వేగంగా స్వభావాలు మారవు. కాలగతిని గ్రహించినవాళ్ళు తమ స్వభావాలను కృత్రిమంగా మార్చుకోవాలి. ప్రజల స్వభావాలను మార్చాలి. సులువైన పని కాదు. కష్టపడాలి. జీవితం ప్రజాసామాన్యానికి వడ్డించిన విస్తరి అనుకోవటం పొరపాటు.

ఇందిర ఈ వాదనను తల కెక్కించుకోలేదు. తల కెక్కించుకుంటే మనస్సంతా గల్లంతవుతుంది. ఇటువంటి సిద్ధాంతాలు ప్రమాదకరమైనవి. వీటిని బుద్ధికి పట్టించుకుంటే మనశ్శాంతి ఉండదు; అనుసరించటం మొదలుపెడితే జీవితం అతివిషమార్గానపడి, అష్టకష్టాలకూ లోనై, చిట్టచివరకు త్యాగం పేరిట ఆత్మహత్యకు దారితీస్తుంది. ఈ కాంతారావు ఏపాటి కమ్యూనిస్టో ఇందిరకు తెలీదు. కాని వీళ్ళంతా చేరి కమ్యూనిజం ఇంతలో తీసుకువస్తారని ఆమెకు నమ్మకంలేదు. ఇంకో వందేళ్ళకు తెస్తే తెస్తారేమో? ఈలోపల ఎంత రక్తపాతం జరగాలో? తన జీవితం అంత దీర్ఘంకాదు; అందులో రక్తపాతాలకు చోటులేదు.

ఒకసారి సుశీలావాళ్ళు మహాబలిపురం పోతూ ఇందిరనుకూడా తీసుపోయారు. కారు వెనుకసీటులో సుశీలా, వాళ్ళమ్మా, ఇందిరా కూర్చున్నారు. సుశీల అన్న కారు డ్రైవు చేశాడు. అతని ప్రక్కన సుశీలతండ్రి కూర్చున్నాడు.



సుశీలతల్లి జుట్టుకు రంగు వేసుకుంటుందిట. ఆవిడ కాస్త అయోమయం మనిషి. అస్తమానమూ కళ్ళు అరమూసుకుని ఉంటుంది, సమాధిలో ఉన్నట్టుగా. చంగల్పట్టులో కారు ఆగినప్పుడావిడ, "అప్పుడే కత్రాలం వచ్చేసిందా?" అని అడిగింది. అందరూ నవ్వితే, "నిద్దర పట్టేసినట్టుందర్రా! ప్రభాకరం కారు నడిపితే నాకెప్పుడూ నిద్దర వచ్చేస్తుంది," అన్నది.

ప్రభాకరం సుశీల అన్న. అతను కూడా ఫోర్తియ్యరే. బియ్యే అయాక లా చదువుతాట్ట. అతే తెలివిగలవాడు కాడు. పాసుమార్కులతో బయటపడే బాపతు. అతి శ్రద్ధగా డ్రెస్ చేసుకుంటాడు. బట్టలు నలగనివ్వడు, జుట్టు రేగనివ్వడు. ఎప్పుడూ చిన్న అద్దమూ, చిన్న దువ్వెనా దగ్గిరుంచుకుంటాడు. ఫేసు పౌడరు ధారాళంగా వాడుతాడు. ప్రత్యేకంగా ఒక రుమాలులో ఫేస్‌పౌడరు చుట్టుకుని ఉంచుకుంటాడు; మొహం ఏమాత్రం జిడ్డుగా కనిపించినా, దానితో తుడుచుకుంటాడు. అందమైనవాడు కాడు గాని, అసహ్యంగా ఉండడు.

ఇందిరకు ప్రభాకరమంటే ఘనమైన అభిప్రాయం లేదు. కాని అతన్ని పెళ్ళి చేసుకోమంటే ఆమె అభ్యంతరం చెప్పి ఉండేది కాదు. వాళ్ళ ఇంటి వాతావరణంలో మెట్టటాని కామెకు సంకోచం లేదు. పుట్టిల్లు విడిచి మరోచోటికి వెళ్ళే ఆడదానికి మొగుడు కన్న వాతావరణం ముఖ్యం. ఇందిరకు కావలిసింది పుష్కలంగా డబ్బూ, శుభ్రమూ, శాంతీ— తన పుట్టింట లోపించినవి మూడూనూ.

ఆశలు పెట్టుకోవటం ఇందిరకు అలవాటు లేదుగాని, ప్రభాకరం తనకేసి

అకలిగా చూడటం ఆమె చాలాసార్లు గమనించింది. ఆమె అతన్ని ప్రోత్స హించలేదు; నిరుత్సాహ పరచలేదు.

"ఇక్కడ ఇడ్లీలు చాలా బాగుం టాయి. మద్రాసులోకన్న ఎంతో మెరుగు; అందరూ దిగండి." అన్నాడు ప్రభా కరం ఒకచివర కూర్చున్న ఇందిర ముందు దిగింది. దిగిన మరుక్షణం ఆమెకు అద్దంలో ప్రభాకరం మొహం కనిపించింది. అతను చిరునవ్వు నవ్వి కన్ను మలిపాడు. ఇది కొత్త వికారం. కొత్త చోట్ల కొత్త వికారాలు కలుగుతా యేమో.

హోటల్లోకి వెళ్ళేటప్పుడు కూడా ప్రభాకరం ఇందిర వెనక ఎలాగో చేరి ఆమెను తాకుతూనే ఉన్నాడు సీట్లలో కూర్చునేటప్పుడు మోచేత్తో ఆమె పక్కలో పొడిచాడుకూడా.

నిజంగానే ఇడ్లీ, వడా, సాంబరూ చాలా బాగుంది ఇడ్లీలు చాలా పెద్దవి కూడా. రెండిడ్లీలూ, ఒకవడా తినేసరికి ఇందిరకు గొంతుదాకా వచ్చింది అందరూ బాగానే తిన్నారు కాఫీ తాగి బయటి కొచ్చారు.

డిక్కీనిండా బుట్టల్లో పూరీలూ, కూరా, పులిహోరా, దధ్యోదనమూ ఉన్నాయి ప్రభాకరం బుట్టెడు పళ్ళు కొనితెచ్చాడు. కారు కదిలింది.

పక్షితీర్థం దగ్గిర ప్రభాకరం మళ్ళీ కారాపాడు.

"ఎన్నిసార్లు చూస్తాంరా, ఆగద్దల్సి," అన్నాడు తండ్రి.

"ఇందిర ఎన్నడూ చూసలేదేమో కావలిస్తే నేను పైకి తీసుకుపోయి చూపిస్తా"

ఇందిర కొంచెం ఆలోచించి కావా లన్నది

"అయితే నేనూ వస్తా." అన్నది సుశీల.

ముగ్గురూ కలిసి మెట్లెక్కారు. ప్రభా కరం తన మనస్సులో చెల్లెల్ని తిట్టు కుని ఉండాలి.

"తిండివేళకు పక్షులు కాశీనుండి తెల్ల వారురూమున బయలుదేరి వస్తాయి అంటారు –" అని ప్రభాకరం అంటుం డగా సుశీల మాట పూర్తి చేసింది:

"అవి చుట్టుపక్కల కొండలమీదే ఎగురుతూంటాయి"

"అవి తిండివేళకు రావటం చిత్రం!" అన్నాడు ప్రభాకరం.

"తిండిలో నల్లమందో ఏదో పెట్టి అలవాటు చేస్తారట అందుకోసం వస్తాయి." అన్నది సుశీల

"ఈ పక్షులు చచ్చిపోతే ఏం చేస్తారో," అన్నాడు ప్రభాకరం.

సుశీలకు తెలీదు, అందువేత ఏమీ అనలేదు

పైకి వెళ్ళేసరికి అక్కడ మరో పాతిక ముప్పైమంది ఉన్నారు. ఇంకా

పక్షు లొచ్చేవేళ కాలేదు. వాటికి తిండి పెట్టే మనిషికూడా రాలేదు.

"ఆఫ్టరాల్, ఇందులో ఏదైనా డివి విటీ ఉంటే ఉండవచ్చంటాను. ఏమం టావు ఇందిరా: బిట్వీ నవర్ సెల్వ్జ్, సుశీల ఒప్పుకోదులే:" అన్నాడు ప్రభాకరం.

"నేనూ ఒప్పుకోను." అన్నది ఇందిర

"ఫైన్! ఫైన్! ఆడవాళ్ళే ఎక్కువ ప్రోగ్రెసివ్గా ఉన్నారు. కంపెనీకోసం నేనుకూడా ఒప్పుకోను... కాని నా ఆనెస్ట్ ఒపీనియన్, డివినిటీ అన్నది మన కళ్ళఎదటే ఉందని. డివైన్ బ్యూటీ అంటాంగదా! డివైన్ఫుడ్! డివినిటీని మనం రోజూ ఆమోదిస్తూనే ఉన్నాం. పక్షులు వచ్చి మనిషి చేతిలోంచి ఆహారం తినటం డివైన్ఫినామినన్ ఎందుకు కాగూడదు? నేను కేవలమూ ఇంటలెక్చువల్ క్యూరియాసిటీతో మాట్లాడుతున్నాను—''

''నువు కాసేపు షటప్పవుతావా?'' అని సుశీల అన్నని మర్యాదగా అడిగింది

చట్రాయిపైకి మనిషి వచ్చికూర్చుని అన్నమో ఏదో కంపసాగాడు. ప్రేక్షకుల్లో సంచలనం సాగింది ప్రభాకరం చప్పున ఇందిర భుజంమీద చెయ్యివేసి, "అవిగో పక్షులు!" అంటూ ఆకాశం లోకి చూపాడు.

ఇందిర అతనిచెయ్యి తీసేసింది.

"ఓ!" అన్నాడు ప్రభాకరం తానేం చేసిందీ తనకే తెలియనట్టు

మొత్తంమీద ఈ ట్రిప్పులో ప్రభాకరం తనను ఇందిర ఆకర్షిస్తున్నట్టు బాగా బయటపడ్డాడు. నీరు తెర్లేదాకా గుంభనగానే ఉంటుందిగాని, తెర్లటం ప్రారంభించాక దాని ఉద్రేకం క్షణక్షణానికీ హెచ్చుతుంది

పక్షులు తిండి తిని ఎగిరిపోయాక కొండ దిగి వచ్చేటప్పుడు ప్రభాకరం కొండమేకలాగా దూకుతూ మెట్లు దిగిపోతుంటే ఇందిర సుశీలను మెట్లమీద ఆపి, "మీ బ్రదర్ని కాస్త సెల్ఫ్ కంట్రోల్ నేర్చుకోమని చెప్పు." అన్నది

సుశీల ఇందిరకేసి రెండు క్షణాలు పాటు నిర్వికారంగా చూసి, "నువు చెబితేనే ఎఫెక్టివ్గా ఉంటుంది." అన్నది సానుభూతి లేకుండా.

ఆ తరవాత సుశీల ఇందిరపట్ల చాలా చిత్రంగా ప్రవర్తించింది ఆమె ఇందిరతో చాలా మితంగా మాట్లాడింది; సాధ్యమైనంతవరకు మాట్లాడకుండా ఉండటానికి ప్రయత్నించినట్టు కనబడింది. తను అన్నమాట సుశీలకు కోపం తెప్పించి ఉంటుం దని ఇందిర అర్థం చేసుకుని, ఇకమీద వాళ్ళింటికి పోరాదని నిశ్చయించుకున్నది.

ఇటువంటి నిర్ణయాలు అమలుపెట్టటం ఇందిర కొంక లెక్కలోదికాదు. ఆమె తిరిగి సుశీలవాళ్ళగడప తొక్కలేదు.

ఇందిర స్కూలుఫైనలు పాసయింది. పై చదువుమాట ఆలోచించారు పెద్దవాళ్ళు అన్నివిషయాలలో లాగే ఇందులోకూడా నాగభూషణానికీ. సుభద్రకూ ఏకాభిప్రాయం కుదరలేదు.

"పిల్లను బియ్యేదాకా చదివించాల్సిందే." అన్నది సుభద్ర; అవతల పాటివాళ్ళ కూతుళ్ళంతా కాలేజీల్లో చదువుతున్నారు మరి.

"ఎందుకొచ్చిన బియ్యేడిగ్రీ ? నాలుగేళ్ళు కష్టపడి చదివినా ఓ నూర్రూపాయల ఉద్యోగం దొరకదు. వందలకొద్దీ బియ్యేలు ఉద్యోగాలు దొరక్క ఏడుస్తునారు. అందులోనూ పెళ్ళయి కాపరానికి పోవలసినపిల్లా ! హాయిగా ఏషార్టుహాండు టైపురైటింగో నేర్చేస్తే ఎక్కడైవా పదిరూపాయలు సంపాదించుకోవచ్చు." అన్నాడు నాగభూషణం.

"చాల్లెండి. కూటికి గతిలేనట్టు ! వెధవ షార్టుహాండూ, వెధవ టైప్రేటింగూనూ. అది పాసై అణాకానీ ఉద్యోగం చేస్తూకూర్చుంటే రేపు వచ్చే సమ్మంధాలు కూడా వెనక్కిపోతాయి. ఇంకానయం దర్జీపని నేర్చుకోమన్నారు కారు, ఆ హిందీ మేష్టరు కూతుర్లాగా !"

"అవును. దర్జీపనికూడా నేర్చుకోవచ్చు టైప్‌రైటింగ్‌తోబాటే. ఒక్క సంవత్సరం కాలేజీ చదువుకింద తగలేసేది ఖర్చుచేస్తే అరడజను విద్యలు నేర్చుకోవచ్చు; అన్నీ అక్కరకొచ్చేవే. ఎటొచ్చీ బియ్యేడిగ్రీ ఒకటే నాలుగ్గిన్నుకునేందుకూడా పనికిరానిది !" అన్నాడు నాగభూషణం ఊపు అందుకుని


"ఈకబుర్లకేమొచ్చెలే. పిల్ల కనీసం బియ్యేదాకా చదవాలిసిందే. మీ అమ్మాయేంచదువుతోందమ్మా అంటే దర్జీపని అని చెబుతామా ? వల్లకాదు ! వీల్లేదు!"

"నీ పరువుకోసమా దాన్ని చదవమంటున్నావు ? ఆమాట చెప్పవేం ?"

"మీపిల్ల బియ్యే పాసయిందంటే మీ పరువంతా తుడిచిపెట్టుకుపోతుందిగామాలు."

"నాకు పోవటానికి పరువంటూ ఉండేడిస్తేగద ? అంతా బాగానేఉంది. రేపు పెళ్ళిసంబధం వస్తే చదువు మధ్యలో మాన్పించేస్తామా ? సంబంధం వదిలేసుకుంటామా ? ముందుసంగతి ఆలోచించి మరీ నిర్ణయానికి రా !"

"ఏమీ ఆలోచించక్కర్లేదు. అన్నీ ఆలోచించే చెబుతున్నాను. అది కాలేజీలో చేరితీరాలిసిందే. అంతగా సమ్మంధమే వస్తే చదువు మాన్పించేస్తాం ? వస్తుందని మీరు రాసిస్తారాఏం ? కర్మచాలక దానికి మరినాలుగేళ్ళు పెళ్ళి కాకపోతే కనీసం బియ్యేఅయినా పాసయి ఉంటుంది. ఇందులో తప్పేమిటో నా కర్థంకావటం లేదు. కీడెంచి మేలెంచటం నేరమా ?"



ఈ వాగ్వాదమంతా వింటున్న ఇందిరకు, 'నన్నుగురించి కొట్లాడుకునేవాళ్ళ నన్నడగరేం? నా విషయంలో నా అభిప్రాయం వాళ్ళ కక్కర్లేదు! రేపు పెళ్ళివిషయం వచ్చినా ఇంతేగా? నా అదృష్టం బాగుండి ఇద్దరి ఉద్దేశాలూ కిలవకుండా ఉన్నాయిగాని, కలిస్తే నా గతి ఏమైఉండును?' అనుకున్నది.

"ఎందుకొచ్చిన చర్చా. నాకు చదువక్కర్లేదు; నేను చదువుకోను," అన్నదామె.

"చదువుకోక అడుక్కుతింటావా?" సుభద్ర కూతురుపైన విరుచుకుపడింది.

"చదువుకోనివాళ్ళంతా అడుక్కు తింటున్నారా? పొట్ట పోసుకోవటానికే చదువైతే, నా పొట్ట నేను పోసుకోటానికీ చదువు చాలు. ట్రైయినింగైపంతులమ్మపని చేసుకోవచ్చు."

"బియ్యే అయితే అది సాధ్యం కాదేం?" అన్నది సుభద్ర వెటకారంగా. ఆమె రెండోఫారందాకా చదివింది.

"డబ్బు తగలెయ్యాలి గదమ్మా? నాలుగేళ్ళ చదువుకూ తగలేసేది దాచి పెడితే కట్నం పొయ్యటానికైనా ఉంటుందిగా. కసువూడ్చి వంటచేసేటందుకు డిగ్రీకూడా దేనికీ."

"నేను కట్నాలుపోసి పెళ్ళి చెయ్యకేం?" అన్నాడు నాగభూషణం.

"పెళ్ళిఖర్చుకైనా డబ్బు కావాలిగా?" అన్నది ఇందిర.

"ఒసే, నువ్వు నీకు సంబంధించని విషయాలు మాట్లాడకు. కట్నాలే

పోస్తారో ఖర్చులే చేస్తారో నీ కెందుకు ? అదంతా మేం చూసుకోలేమూ ? నువ్వేం ఆరుస్తావా, తీరుస్తావా ? చదువుకో మంటున్నాం, చదువుకో ! చదువు కయే ఖర్చు ఎలాగే అని నీతో ఎవరొచ్చి మొర పెట్టుకున్నారూ ?" అన్నది సుభద్ర.

"చదువుకోమని నువే అంటున్నావు. నాన్న అనటంలేదు," అంటూ ఇందిర తల్లికి సవరణ పెట్టింది.

"ఎడిచావులే! ఇందు కున్నాయి తెలివి తేటలు. నువ్వసలు మాట్లాడవాక మధ్య వచ్చి — నా కసలే మండిపోతున్నది !" అన్నది సుభద్ర. నిజంగానే ఆవిడ తలంతా ఊవర పెట్టినట్టయింది. ఒకరు చెప్పటమూ ఒకరు వినటమూ ఈదిక్కు-మాలిన కొంపలో ఏనాడూలేదని, పాపం, సుభద్ర రోజూ అనుకుంటూనే ఉంటుంది. మొదటి ఒకరు తనూ, రెండో ఒకరు మిగిలినవాళ్ళలో ఎవరో ఒకరునూ.

ఈ వాదం మాటలతో తెగదని ఇందిర. "నన్ను బలవంతాన కాలేజీలో వేసినా నేను పుస్తకం తెరవను, చదవను, ఒక్క పరీక్షకూడా పాసుగాను. డబ్బెక్కువగా ఉంటే కాలేజీలో చేర్పించండి," అన్నది.

"అటువంటి మాటలంటేనే చెంపపగల గొట్టబుద్ధయేది," అన్నది సుభద్ర.

చివరకు సుభద్రపంతమే నెగ్గింది. నెగ్గ కేంజేస్తుంది ? మొండివాడు రాజుకన్న బలవంతుడు. తల్లీ తండ్రీ ఏకనిర్ణయానికి కొచ్చినాక తన నిర్ణయం విరుద్ధంగా ఉన్నప్పటికీ ఏమీ ప్రయోజనం ఉండదని ఇందిరకు తెలుసు. ఒక మంచిరోజున నాగభూషణం ఇందిరను తన వెంట శాంతోమ్‌కు తీసుకుపోయి అక్కడి మిషనరీ కాలేజీలో చేర్పించాడు.

ఆరోజే సుశీలకూడా అదే కాలేజీలో చేరింది. సుశీల తనను చూడకముందే ఇందిర సుశీలను చూసింది. కాని కావాలనే పలకరించలేదు. సుశీల మాత్రం ఇందిరను చూడగానే, "అరె, నువ్వూ ఇక్కడికే వచ్చావా? ఏమోయ్, ఎక్కడా కనిపించటమేలేదేం !" అన్నది ఏమీ జరగనట్టుగా.

ఇందిర ఎంత వద్దనుకున్నా సుశీలతో పాత స్నేహం మళ్ళీ కొనసాగించవలిసి వచ్చింది. ఇద్దరూ ఒకే సబ్జక్టులు తీసుకున్నారుకూడానూ.

"మా అన్నయ్య లా కాలేజీలో చేరాడు. తెలుసా ?" అన్నది సుశీల.

"తెలీదు. లా కాలేజీలో కోఎడ్యుకేషనేగా ?" అన్నది ఇందిర.

అందులో వ్యంగ్యం సుశీల కర్థంగాక ఏమీ అనలేదనుకున్నది ఇందిర. కాని కొంచెం సేపయాక, "మా ప్రభాకరం నువ్వనుకున్నటువంటివాడుకాడు. నీలో కొంత అకర్షణ ఉన్నదని నీకు తెలిసి ఉండకపోవచ్చు." అన్నది సుశీల.

"ఈమాట ఇప్పు డంటున్నావు గాని, వెనక నువ్వుకూడా అనుకున్నట్టు లేదే ?" అన్నది ఇందిర.

"నాదే తప్పు. నువే ప్రభాకరాన్ని ఎంకరేజ్ చేశా వనుకున్నాను," అన్నది సుశీల నిష్కపటంగా.

సుశీలపైన ఇందిరకు పూర్వం ఎన్నడూలేనంత సదభిప్రాయం కలిగింది.

ఇద్దరూ విడిపోయ్యేటప్పుడు, "మమ్మల్ని బాయికాట్ లో పెట్టక వెనకటి లాగే మా యింటికి ఎప్పుడైనా వస్తూం డేం ?" అన్నది సుశీల.

ఇందిర చూద్దాం లెమ్మన్నట్టు తల ఊపింది. వాళ్ళింటికి మరి వెళ్ళ నని ఆమెకు గట్టిగా తెలుసును.

ఇందిరకు కాలేజీలో కొత్త స్నేహితు రాలు దొరికింది. ఆమె పేరు శకుంతల. చాలా బ్రైట్ స్టూడెంటు. స్కూలు ఫైనలులో అన్ని సబ్జక్టులలోనూ డెబ్భై పైన తెచ్చుకుంది. వాళ్ళ నాన్న కాలేజీ లెక్చ రు. వాళ్ళ మేనమామ పద్మనాభ రావు "పద్మశ్రీ" అనే పేరుతో కథలూ అవీ రాస్తాడు.

శకుంతల మైలాపూరులోనే ఉంటు న్నది. కాలేజీకి నడిచే వస్తుంది. వాళ్ళిల్లు కాలేజీకి మూడు ఫర్లాంగులపైన ఉండదు

ఒకశనివారం సాయంకాలం శకుంతల ఇందిరతో. "మా ఇంటికొస్తావా, ఇందిరా ? మా మామ యొచ్చాడు. కొందరు కవులూ వాళ్ళూకూడా వస్తు న్నారు. సరదాగా ఓ గంట కూచుని వెళ్ళు," అన్నది.

ఇందిర సరేనన్నది. ఆమెకు సాహి త్యాభిలాష ఏమీలేదు. కాని ప్రతిదాన్ని గురించీ తెలుసుకోవాలనే తృష్ణ ఒకటి ఉన్నది.

శకుంతలవాళ్ళిల్లు పెద్దదేగాని చాలా పాతది. గుహలాగుంది. అందులో వాళ్ల ఏ పాతికేళ్లుగానో ఉంటూ, అంత ఇంటికీ ఇరవైరెండు రూపాయల అద్దె ఇస్తు న్నారు. శకుంతల తండ్రి విడిగాకూడా బడిపంతుల్లాగే ఉంటాడు. ఇంటోవాళ్లకు పనులు చెప్పేటప్పుడుకూడా విద్యార్థులను ఆర్డర్ చేసినట్టే చేస్తాడు.

శకుంతల తల్లి చాలా బిడియస్తురా లల్లే కనిపించింది. ఎక్కడో వంటింట్లో దాక్కుని ఇవతలికి రానేలేదు. ఇందిర ఆవిణ్ణి చూడటానికి శకుంతలవెంట తిన్నగా వంట గదిలోకే వెళ్ళింది. శకుంతల ఇందిరను పరిచయం చేస్తుంటే ఆవిడ పెళ్ళికూతురులాగా అయిపోయి మెలికలు తిరుగుతూ నవ్వుతూ, చెప్పే దానికల్లా సరేనన్నట్టు తల ఒక పక్కకు ఒరగేసింది. పమిటతో పదిసార్లు మూతి తుడుచుకున్నది — నోటంట ఒక్క ముక్క అంటే వొట్టే !

"పద్మశ్రీ" కి ముప్ఫయి అయిదే ళ్ళుండవచ్చు. మనిషి చాలా అందంగా ఉంటాడు రాతగా డంటే వికారంగా ఉండాలని ఎక్కడా లేదు. అయినా

ఇందిర ఆశ్చర్యపడింది. శకుంతల పరిచయం చేసినప్పు డాయన తనకేసి చూసి నవ్వగానే ఇందిర నరాలన్నీ ఒక్కసారి అదిరిన ట్టయింది. అటువంటి అనుభవం ఆమె కది మొట్టమొదటి దనవచ్చు. లోగడ ఎన్నడూ ఇంత పెద్దఎత్తున ఆమె నరాలు పీకలేదు.

దీపాలు పెట్టిన అరగంట లోపల ఏడెనిమిదిమంది వచ్చారు. అందరికీ శకుంతల, తండ్రి ఆదేశంతో, కాఫీలు తెచ్చి ఇచ్చింది. (శకుంతలతండ్రి అవతలవాళ్లు చేస్తున్న పనికూడా చెయ్యమని ఆదేశిస్తాడు; తను చెప్పకుండా ఎవరూ ఏపనీ చెయ్యరనో, చెయ్యరాదనో ఆయన అభిప్రాయం అయి ఉంటుంది)

వచ్చినవాళ్ళలో ఒకరిద్దరు తప్ప అందరూ రచయితలే. ఎవరెవరు ఏమేమి రాశారో శకుంతల చెప్పింది; కాని ఇందిర వాటిని వేటినీ చదవలేదు. అందుచేత గుర్తించలేకపోయింది.

సంభాషణ సాగింది. సాహిత్యం గురించి చాలాసేపు మాట్లాడుకున్నారు. సాహిత్యం అభివృద్ధి అవుతున్నదా? దిగనాసిల్లిపోతున్నదా ? ఈ కాలపు సాహిత్యం యొక్క మంచిచెడ్డలు నిర్ణయించటానికి ప్రమాణాలు లేకపోవటానికి కారణ మేమిటి? పాఠకులే విమర్శకులు కూడా అన్న వైఖరి సబబైనదేనా? ఇటువంటి విషయాలు గురించి కొద్దిగా మాట్లాడుకున్నారు.

"ఈనాటి కళలకు అస్వాదకుల అభిరుచే ప్రమాణం. వేరే ప్రమాణాలు మనం ఏర్పాటు చేసినా అమలు జరగవు. అందరూ ఆదరించే కళలకే నాలుగు డబ్బు లొస్తాయి. ఇతరులుకూడా అటువంటి కళనే సృష్టిస్తారు. నాచురల్ సెలక్షన్ — భౌతికవాదం — డెమోక్రసీ వీటన్నిటి ప్రభావంతోనూ ఈ పరిస్థితి ఏర్పడింది. దీన్ని మార్చటం ఎవడి తరమూ కాదు," అన్నా డొక నల్లని లావుపాటి మనిషి.

అదొక జోకన్నట్టు కొందరు నవ్వారు.

"అసలీ అభ్యుదయ వాదులూ, కమ్యూనిస్టూలూ చేరి కశ్మలం చేశారండి. ఆకలి సాహిత్యంట! చెమట సాహిత్యంట! దారిద్ర్యాన్ని గురించి సాహిత్య మేమిటండీ? చల్లగా, హాయిగా, సువాసనల మధ్య, డోలికలలో ఊగుతూండవలసిన సాహిత్యం —" అంటూ ఒక బక్కపలచని ఆయన కళ్లు మూసుకొన్నాడు.

"వ్యాసు డటువంటిసాహిత్యం రాసినట్టు లేదండీ! అందులో ఆకలి గొన్న వాళ్ళకు ధర్మాలతో పనిలే దని కూడా అన్నాడే ఆ మహానుభావుడు!" అన్నారు మరొకరు.

"ఆసలు హిస్టారికల్‌గా మన దేశానికి పట్టిన కర్మేమిటంటే, మన భవిష్యత్తుకు కావలసిన ప్రతిభావమూ ఇతర



దేశాలనుంచి అరువు తెచ్చుకోవలసివస్తున్నది. అవి ఆ దేశాలలో పుట్టి పరిణామం చెందిన భాషాలు. వాటి అవసరమైతే మనకున్నది గాని, వాటికి కావలసిన నేలా, శీతోష్ణస్థితి, వాతావరణమూ ఇక్కడ లేవు. రత్నావళి నాటకంలో ఒక నవమల్లికను తెచ్చి పాతి, ఇది బతికి బట్టకట్టేనా అని అనుకుంటారే, అదే విధంగా ఉన్నాయి మన పురోగామి ఉద్యమాలు. నూటికి తొంభైతొమ్మిది మందికి రాజకీయ పరిజ్ఞానమే లేకుండా డెమోక్రసీ తెచ్చుకున్నాం. ఎలిమెంటరీ వాస్తవికత కూడా పరిపాటి కాకముందే అభ్యుదయ సాహిత్యం వచ్చి పడింది. సినిమాలూ అలాగే తగలడ్డాయి. స్టేజిమీది నుంచి ఇంకా పద్యాలు విశ్రమించనే లేదు. సినిమాలాంటి రియలిస్టిక్ ఆర్ట్ మీడియం వచ్చింది. మనకి సెన్సాఫ్ హ్యూమర్ కూడా లేదు. ఔట్‌డోర్‌లో పరిగెత్తుతూ నాయికా నాయకులు బాజాలతో సహా ఆకాశం అదిరేట్టు డ్యూయెట్ పాడుతుంటే ఒక్కడైనా నవ్వడు! అయ్యా, రెండొందల ఏళ్ళు పాశ్చాత్యులు మనని పరిపాలించిన ఫలితంగా మనం మరో రెండువందల ఏళ్ళు ఇలా నవమల్లికలను పెంచి గుంటపూలు పూయించక తప్పదు. ఈ యుగానికి తెలుగుదేశంలో గొప్ప తోటమాలి అప్పారా వొకడు వచ్చాడు; పోయాడు. అప్పారావు గొప్పవాడన్నాం. మన మానాన మనం సాహిత్యంలో గుంటపూలు పూయిస్తున్నాం."

నల్లని లావుపాటి ఆయన తాపీగా ఈ భయంకరమైన మాట లంటూంటే అందరూ విని ఊరుకున్నారు. ఆయన రచయితకూడకాడుట. బ్యాంకు గుమాస్తా.

"పద్మశ్రీ" దాదాపు ఏమీ మాట్లాడ లేదు. ఎవరేమంటున్నా శ్రద్ధగా వింటు న్నట్టు కనపడ్డాడు. లోకంలో ఒక్కడే మగవాడున్నాడన్న భావం ప్రతి ఆడ దానికీ, ఒక్కతే ఆడది ఉన్నదన్నభావం ప్రతి మగవాడికీ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు కొద్ది నిముషాలపాటైనా కలిగి తీరుతుంది. ఈపూ టిందిరకు పద్మనాభం గురించి అదే భావం కలిగింది.

ఆమె బయలుదేరేసరికి ఎనిమిది కా వచ్చింది. తన ముఖం పద్మనాభరావు మనస్సులో కొంతకాలమైనా నిలిచి ఉంటే బాగుండు నని ఆమెలో గాఢమైన కోరిక తల ఎత్తింది. కాని అందుకు తా నేమి చేయాలో తోచలేదు. వెళ్ళే టప్పుడు అయనకు దగ్గిరిగా వెళ్ళి నమ స్కారం చేసి, "వెళ్ళొస్తానండీ! చాలా సంతోషం!" అన్నది.

అతను చల్లగా నవ్వి, "మంచిది!" అన్నాడు.

ఇందిర, శకుంతల తండ్రి దగ్గిరకూడా సెలవు పుచ్చుకున్నది.

"వెళ్ళిరా! వెళ్ళిరా!" అన్నా డాయన, తనపురామాయించకపోతేఆమె అక్కడే ఉండిపోతుం దన్నట్టు.

శకుంతలదల్లికోసం వంటగదిలోకి వెళ్ళి సెలవు తీసుకోవటానికి ఇందిరకు ధైర్యం చాలలేదు. బిడియం బిడియాన్ని రేపుతుంది.

"చాలా పొద్దుపోయింది శకుంతలా, నే వెళ్లొస్తా నన్నా నని మీ అమ్మతో చెప్పూ!" అని ఇందిర బయలు దేరింది.

శకుంతల బస్ స్టాండుదాకా ఇందిరను సాగనంపి, బస్సెక్కించి, ఇంటకి తిరిగి వెళ్ళిపోయింది.

"ఇంత సేపయిం దేమిటే?" అన్నది సుభద్ర కూతుర్ని చూడగానే.

"ఏమో, అయింది!" అన్నది ఇందిర — తన తల్లికి సంబంధించనట్టు.

"అలా మాట్లాడొద్దనే ఎన్నిసార్లో గడ్డిపెట్టాను. అడిగినదానికి తిన్నగా సమాధానం చెప్పి యాడవ్వేం?"

"ముఖ్యమైన దేమన్నా ఉంటే చెప్పనూ? స్నేహితురా లింటి కెళ్ళాను. కాస్త ఆలస్య మయింది."

"ఎందు కెళ్ళావ్? ఎవ రా స్నేహితు రాలు?"

"చచ్చిచెడి ఇంటికి రాగానే ఏం చంపు తున్నావమ్మా? నా స్నేహితురా లెవరో నీ కేం తెలుస్తుందీ?"

"చెబితే కూడా తెలీని మొద్దునా? చెప్పకుండా తెలీదంటే ఎలా తెలుస్తుందీ? కాకపోయినా కాలేజీలో చేరినప్పట్నుంచీ నీకు నిక్కు జాస్తి అయింది."

ఇందిర నీరస మంతా పోయింది. బలం వచ్చిన గొంతుతో "వద్దు మొర్రో

అంటే నువే నన్ను కాలేజీలో చేర్పించావు." అన్నది.

"నిన్న కాలేజీలో చేరమన్నారుగాని నిక్కమన్నారూ? ఇన్ని మాటలు మాట్లాడటానికి ఓపిక ఉందిగాని. నీకు ఎక్కడికి వెళ్ళావో ఏం చేశావో చెప్పే ఓపికలేదు! ఏం?"

తను వెళ్ళగూడని చోటుకు వెళ్ళి, చెయ్యగూడని పని చేసినట్లు తల్లికి అనుమానమని ఇందిర గ్రహించింది. పోలీసువాళ్ళు గోళ్ళకింద ముళ్ళు గుచ్చుతుంటే బాధ భరించలేక నిజం చెప్పే నేరస్తుడిలాగా, ఆమె తల్లికి శకుంతలను గురించీ, వాళ్ళింటో జరిగిన సమావేశం గురించీ చెప్పింది.

సుభద్రకు తృప్తి కలిగింది; టెన్షను దిగిపోయింది.

అంతలోనే నాగభూషణం వచ్చాడు. ఆయన కోటు విప్పి వంకెకు తగిలిస్తూ, "ఇవాళ ఒక సంబంధం గురించి తెలిసింది," అన్నాడు.

"ఏమిటా సంబంధం? ఎవరు? ఏం చదువుతున్నాడు? నానుస్తారేమిటి?" అన్నది సుభద్ర. టెన్షన్ మళ్ళీ పెరుగుతున్నది.

"చదవటంలేదు; న్యూస్ పేపర్ రిపోర్టరు. రెండువందల జీతం. పదెకరాల ఆస్తి ఉంది. ఒక్కడే కొడుకు. నాలుగువేలు కట్నంకిందా, మరి రెండువేలు పెళ్ళి ఖర్చులకిందా ఇస్తే ఎవరినన్నా చేసుకుంటాడు."

సుభద్ర నవ్వలేదు. నవ్వాలని ఆవిడకి తట్టనుకూడా లేదు.

"నగలేం పెడతారటా?" అని అడిగింది.

"పెళ్ళి ఖర్చులక్కూడా తీసుకునేవాడు నగలేంపెడతాడు? పిల్ల వంటిమీద నాలుగైదువేలు నగలుకూడా ఉండాలిట."

అది మంచి సంబంధమే నని ఏదో విధంగా మనస్సును సమాధానపరచుకొవాలని తహతహలాడుతున్నదానిలాగా సుభద్ర. "పోనీ పిల్లాడైనా బాగుంటాడా? వయస్సు?" అని అడిగింది.

"రెండేళ్ళకిందట ముప్పై నిండింది. పిల్ల అందం వాళ్ళు చూడరు, పిల్లాడి అందం మనం చూడకూడదు."

తండ్రి వేళాకోళ మాడుతున్నాడని ఇందిర గ్రహించిందిగాని సుభద్ర గ్రహించలేదు.

"మీరు పిల్లాణ్ణింతకీ చూశారా లేదా?"

"నేను చూస్తే నీకు చూపించకుండా వుంటానా?"

"అయితే ఇదంతా ఎవరు చెప్పారూ?"

"నీ కీ ఆరాలన్నీ ఎందుకూ? పెళ్ళి కావలసిన పిల్ల ఉన్నది మనకేనా? మరొకరు ఆలోచిస్తున్న సంబంధమ్మాట చెప్పా. షరతు లన్నిటికీ ఇష్టమైతే మనం కూడా కావలసిన వివరా లడగవచ్చు."

"అంతకష్టం మన మెక్కడ పోయ్యగలం ?"

"మరి దేనికొచ్చిన హైరానా ?"

ఒకనాడు ఇందిర బస్సుకోసం నిలబడి ఉండగా ప్రభాకరం కారు ఒంటరిగా తోలుకుపోతూ ఆగాడు ఇందిర కారు దగ్గరికి వస్తుం దనుకున్నాడు కాబోలు. కొంచెంసేపు సీటులోనుంచే చూశాడు ఇందిర అతన్ని చూడనైనాలేదు చివర కతను కారు దిగివచ్చి, "కాలేజీకేనా ? నేను డ్రాప్ చెయ్యొచ్చునా ' అన్నాడు

"ఎందుకూ ? బస్సొస్తుంది ఆ వచ్చేది నా బస్సేనల్లే ఉంది ' అన్నది ఇందిర

"బస్సుడబ్బు లాదా చెయ్యటాని క్కాకపోతే, ఫర్ కంపెనీస్ సేక్ రాకూడదా ?" అన్నాడు ప్రభాకరం

బస్సు సమీపంలోకి వచ్చింది తన బస్సుకాదు ఇందిర కారుదగ్గిరికి వెళ్ళి వెనకసీటులో ఎక్కికూర్చున్నది

"మాట్లాడుకోవటానికి వీలుగా ఉంటుంది ముందుసీటులోకి రాకూడదూ ?"

"రాకూడదని మీకు తెలీదా ?" అన్నది ఇందిర

"నే నంటే అంత కోల్డ్‌గా ఎందుకుంటావో తెలియటంలేదు నే నేం ద్రోహం చేశాను — నిన్నుగురించి డ్రీమ్ చెయ్యటంతప్పు ?"

ఇందిర మాట్లాడలేదు

"తప్పేదన్నా ఉంటే చెబితేగా తెలిసేది అమధ్య — అంటే మనం మహాబలిపురం వెళ్ళొచ్చాక — మా సుశీల ధోరణి చూస్తే మీ రిద్దరూ పోట్లాడుకున్నా రనిపించింది ఇప్పుడు మళ్ళీ మీరు మేకప్ చేసుకున్నట్టున్నారు అయినా, నువు ఒక్కసారికూడా మా ఇంటికి రాలేదు "

"చూడండి ప్రభాకరంగారూ, నేను మీ యింటికి ఓ వందసార్లయినా వచ్చి ఉంటాను సుశీల మా ఇంటికి ఒక్కసారి కూడా రాలేదు స్నేహితమైనా వన్ సైడెడ్‌గా ఉండనవసరంలేదు మీది గొప్పయిల్లు, మాది కొద్దియిల్లు — నిజమే కాని మనం మనుషులకోసం వస్తాంగాని ఇంటికోసం రాంగా ? అందుచేత నేను మీ ఇంటికి రానేదని ఎక్స్యూజ్ చెయ్యకండి " అన్నది ఇందిర

మీ యిద్దరిమధ్యా నేను నలుగుతున్నాను "

"మీ రెందుకూ నలగటం!"

'నా డ్రీమ్ గర్ల్ కనిపించకపోతే బాధకాదా?

ఇందిరకు పట్టరాని కోపం వచ్చింది

"ప్రభాకరంగారూ, మీరు చెప్పదలచుకున్న దేమిటో సూటిగా చెప్పండి నాకు కవిత్వం అర్థంకాదు." అన్న దామె కొరడాతో కొట్టినట్టుగా

ప్రభాకరం బిత్తరపోయాడు

(సశేషం)

# తిమింగిలం వేట

(ఇందిరకు స్కూల్ ఫైనల్ ప్యాసయినతరువాత పై చదువు ఒక సమస్య అయింది. తల్లి కావాలనీ - తండ్రి ఒద్దనీ; ఇందిరకు ఈ ఇద్దరి అభిప్రాయాలవల్లా చదువుమీద అసహ్యం ఏర్పడినా, తల్లి ఒత్తిడిపై తండ్రి ఆమెను కాలేజీలో చేర్పించాడు. ఆ కాలేజీలోనే పాత స్నేహితురాలు సుశీలా, కొత్తగా శకుంతలా తటస్థపడ్డారు. సుశీలా వాళ్లకున్న భోగభాగ్యాలవల్లగానీ, ఆమె అన్న ప్రభాకరంవల్లకానీ ఇందిరకు వాళ్లంటే ఏదోగా వుండేది. అందువల్ల శకుంతలతోనే దోస్తీ ఎక్కువై, వాళ్లయింటికి వెళ్లడమూ, వాళ్ళవాళ్ళతో పరిచయమూ జాస్తి అయింది. ముఖ్యంగా సుశీల మేనమామ పద్మనాభాన్ని చూచినతరువాత ఇందిర గుండెలు కదిలినై.) - ఇక చదవండి.

"మీకు కోపం వచ్చినట్టుందే ?" అన్నాడతను. ఎప్పుడూ అతను ఇందిరను నువ్వనే అంటాడు.

నాకు డ్రీమ్‌గర్ల్ రోల్స్ ప్లేచెయ్యటం ఇష్టంలేదు. కర్మచాలక ఒక డజనుమంది నన్నుగురించి డ్రీమ్ చెయ్యటం జరిగితే వాళ్ళందరిఇళ్ళకూ తిరుగుతూఉండాలా? నాకు వేరే జీవితం లేదా ?"

"నా ఫీలింగ్స్ నిజమైనవి కావని అనుమానమా ?" అన్నాడు డిఫెన్సివ్‌గా.

"నాకు మాటలే అర్థంకావు, వాటి వెనకఉండే ఫీలింగ్స్ ఏ మర్థమవుతాయి? అవి నిజమో, అబద్ధమో నాకేం తెలుస్తుంది ?"

"నిన్ను కన్విన్స్ చెయ్యలేకపోవటం నా తప్పే. ఒప్పుకుంటాను."

"నన్ను కన్విన్స్ చెయ్యాలంటే మీరు చెయ్యవలసింది నాతో చెప్పటం కాదు. మా నాన్నగారిని మీరై, నన్ను పెళ్ళాడాలని ఉన్నదని చెప్పండి. మా నాన్నగారు నా అభిప్రాయం అడిగితే మీ కేసు నేను సపోర్టు చేస్తాను. అంతవరకు ఎష్యూరెన్సు ఇవ్వగలను....ఒక వేళ నేను మీ డ్రీమ్‌గర్ల్‌గా పనికొస్తానుగాని, భార్యగా పనికిరానేమో ?"

"అలా ఇన్సల్ట్ చెయ్యొద్దు. నేను వీలు చూసుకుని తప్పక మీ నాన్నగారితో మాట్లాడుతాను." అన్నాడు ప్రభాకరం. అతనిమాటల్లో ఆనందోత్సాహా లేవీ వెల్లివిరియలేదు; విరుస్తాయని ఇందిర గట్టిగా అనుకోలేదు.

ప్రభాకరం లాటివాళ్ళు ఫ్రీలవ్ సొసైటీ మెంబర్లు; ఫిక్సెడ్‌లవ్ సొసైటీ వారుకారు. వాళ్ళకు కావలసింది డ్రీమ్ గర్ల్సుకాదు, గర్ల్ డ్రీమింగ్

ప్రభాకరం నాగభూషణాన్ని మీట్

కాలేదు ఇందిరను పెళ్ళాడతా నని అన లేదు ఇందిర మాత్రం ప్రభా రానికి మంచి డో స్ ఏటు తృప్తి పొందింది

అనుకోకుండా శకుంతల పెళ్ళి స్థిర పడింది. ఆ విషయం ఇందిరకు సూటిగా తెలియలేదు. శకుంతల చాలా డొంకతిరుగుడుగా మాట్లాడింది.

"నా చదువు త్వరలోనే పూర్తి సే ట్టుంది ఇందిరా."

"ఏం?" అన్నది ఇందిర అయో మయంగా.

"పెళ్ళయింతర్వాత వాళ్ళు చదవ నిస్తారో, చదవనివ్వరో!"

"వాళ్లెవరు? ఎవరి పెళ్ళి," ఇందిర కింకా అర్థం కాలేదు.

శకుంతల నవ్వుతూ ఏటో చూస్తూ, "నా పెళ్ళే" అన్నది.

"నీ — ! నీ పెళ్ళా? హార్టీ కం గ్రాట్స్! పెళ్ళంటే చాలా ఉపోద్ఘాతం ఉంటుందనుకున్నానే. చాలా రోజుల్నుంచీ నలుగుతూ ఉండిఉండాలి. దాచిపెట్టా వన్నమాట!"

"లేదు, లేదు. అంతా సడన్‌గా జరి గింది. అంతా సెటిలయినట్టే అనుకో. అయినా ఆదివారం వాళ్ళు చూట్టాని కొస్తున్నారు; నువుకూడా వస్తావా? నీ ఇన్‌స్టింక్ట్ ఎలా ఉంటుందో చూద్దాం. నీకు కరెక్టుగాడైము శ వారంనాడు చెబుతా తప్పకుం వస్తావు మా బెంగుళూరునుంచి మా అన్నయ్యా వదినాకూడా వస్తారు వాళ్ళు తెచ్చిన సంబంధమే

ప్రెడ్‌గ్రూమ్ ఎట్లా ఉంటాడో ఐడియా ఉదా."

"ఫోటో పంపించారు. స్టూడియో ఫోటో – బాగా రీటచ్ చేసిందిట, మా ఎదురింటి రాఘవన్ అన్నాడు. ఫోటో బాగానే ఉంది; మనిషికీ దానికీ ఎంత తేడా ఉన్నదీ చూడాలి."

"తప్పకుండా వస్తాను. నాకు అను భవంగాకూడా ఉంటుంది."

ఆదివారం పదకొండింటికి ఇందిర శకుంతలావాళ్ళింటికి చేరింది. శకుంతల అన్న అచ్చు శకుంతల పోలికే. మీసాలు తీసేస్తే. వయసు వచ్చిన శకుంతలల్లే ఉంటాడు. శకుంతల వదినె చక్కనివాళ్ళలో జమ. లేత తమలపా కులా గుంది. అంత నాజూకైన మనిషిని ఇందిర ఎన్నడూ చూసినట్టు జ్ఞాపకం రాలేదు. ఆమెను చూసిన కళ్ళతో మరొకరిని చూస్తే వాళ్ళ చర్మం దున్న పోతు చర్మ మనిపిస్తుం దన్నమాట. మనిషికూడా సౌమ్యంగానూ, ఎప్పుడూ నవ్వుతూనూ ఉంటుంది. జీవితంలో కష్టంకన్న సుఖం ఎక్కువున్న ప్రాణి లాగా కనపడింది. ఇందిర ఆమెను చూసి అసూయపడింది

పెళ్ళికొడుకు బెంగుళూరునుంచి శకుంతల అన్నావాళ్ళతో వచ్చాడు




ఎక్కడో తండియార్పేటలో బంధువులింటికి వెళ్ళాడు. పదిన్నరకు వర్జ్యం వెళ్ళిపోగానే బయలుదేరి వస్తారుట. ఇంకో అరగంటలో రావచ్చు.

ఇందిర పెళ్ళికొడుకుఫోటో చూసింది. నొక్కులజుట్టు. మరీ పెద్దకళ్ళు. గవదలు వాచినట్టుగా ఉన్నాయి. ఫొటోలో మనిషి రంగు తెలీదు. బాగా రీటచ్ చేసిన ఫొటోయే. ఎందుకో అతను ఇందిరకు అంతగా నచ్చలేదు. అంతసేపు ఫొటో చూసి ఏమీ అనకపోతే బాగుండదని. "మనిషికూడా ఈ మాత్రం ఉంటే ఫరవాలేదు," అన్నది.

"అంటే: నువ్వయితే చేసుకుంటావన్నమాట !" అన్నది శకుంతల వదిన.

"నా సంగతి అడక్కండి. నే నవసరమైతే కొండముచ్చును చేసుకో మన్నా చేసుకుంటాను. మా నాన్నగారంటూంటారు– జీవితం లాటరీ అనీ ఎవరి నెవరు చేసుకున్నా ఫలితం ఒకటే ననీ !"

"ఆమాట బెర్నార్డ్ షా ఏనాడో అనేశాడు." అన్నాడు శకుంతల అన్న

అతను తన తండ్రికి గ్రంథచౌర్య అంటగట్టినట్టయింది.

"అనవలసిన మాట లన్నీ అదివరకే అందరూ అనేశారు. కాని వాటి ప్రయోజనం మన కేమీ లేకుండావుంది అన్నది ఇందిర, పెళ్ళిచూపుల తంతుమీద హిట్ కొట్టాలనే.

అయితే ఆ హిట్ ఎవరికీ అర్థమైనట్టులేదు. చర్చ సాగితే ఇందిర ఎంతదాకా వెళ్ళేదో. కాని ఆ విషయం అంతటితో పోయింది.

మరి కాస్సేపటికి పెళ్ళివారొక టాక్సీలో వచ్చారు – పెళ్ళికొడుకూ అతని వెంట నడివయసు దంపతూలూనూ.

పెళ్ళికొడుకు ఇందిరకు ంగానే

బాగాలేదు రంగు మంచిరంగే కళ్ళు పెద్దవే గాని మరీ పెద్దవికావు. మనిషి అంత అసహ్యంగాలేడు, కాని అతని చూపులూ ముఖభంగిమలూ ఇందిరకు అసంతృప్తికలిగించాయి. 'కూబి!ముచ్చు! పెళ్ళాన్ని తప్పక మోసగిస్తాడు!' అనుకున్న దామె తన మనస్సులో.

అతను కొంచెంసేపు తనను చూచి పెళ్ళికూతు రనుకొని పూలయినట్టు ఇందిరకు అనుమానం కలిగింది. తనలో నవ్వుకున్నది

బయట టాక్సీ ఆగిన కీడి కాగావే. అలంకరించుకుని సిద్ధంగావున్న శకుంతల లోపలికి ఎరిగెత్తింది. హాలులోనుంచి ఇందిర శకుంతల వదినవెంటే ఉన్నది. అందుచేత కాబోయే పెళ్ళికొడుకు తానే పెళ్ళికూతు రని భ్రమపడి ఉండొచ్చు. అతను కూర్చున్న తరవాత రెండు మూడుసార్లు తనకేసి దొంగచూపులు చూడటం ఇందిర గమనించింది. మిగిలిన వాళ్ళుకూడా గమనించారేమో మరి.

కాస్సేపు నలుగురూ అదీ ఇదీ మాట్లాడుకోవటం అయిన తరువాత అకస్మాత్తుగా శకుంతలతండ్రి. "పిల్లను రమ్మనండీ!" అన్నాడు; ఎవరో వాళ్ళ డ్యూటీ మరిస్తే జ్ఞాపకం చేస్తున్నట్టుగా.

శకుంతల సిగ్గు అభినయిస్తూ వచ్చి కూర్చోవటమూ మధ్యలో ఒక అర నిమిషంపాటు నటన మానేసి వరుణ్ణి తేరిపార చూడటమూ. పెళ్ళిచూపులకు వచ్చినవాళ్ళు శకుంతలను పరమ చచ్చు ప్రశ్నలు వెయ్యటమూ చూస్తూంటే ఇందిరకు రాయటం చాతకానివాడి నాటకాన్ని, ఆడటం చేతకానివా ళ్ళాడుతున్న ట్టనిపించింది. తమకు తెలీనివిషయా లేవీ వాళ్ళడగలేదు. వాళ్ళప్రశ్న లడగటంలో ఉద్దేశం శకుంతల గొంతూ, మాటతీరూ, నత్తి నంగివగైరా జబ్బు లున్నాయేమో తెలుసుకోవటము తప్ప వేరే ఏమీ ఉండటానికి వీల్లేదు.

ఈసంగతి నడివయస్సావిడ దాచను కూడాలేదు. 'నేను భలేగమ్మత్తు చేయ బోతున్నాను చూసుకోండర్రా' అన్నట్టు మొహం పెట్టి, "అన్నట్టు నీ పే రేమిటమ్మాయీ? ఏదో చెప్పారు, మరిచి పోయా; వయసొస్తున్నదా, పేస్లు బొత్తిగా జ్ఞాపకం ఉండటంలేదు." అన్నది.

అదే మొదటిప్రశ్న.

'మోస్ట్ ఫూలిష్! మోస్ట్ ఫూలిష్!' అనుకున్నది ఇందిర.

ఒకదశ వచ్చేటప్పటికి ఈ దృశ్య నాటకంలో అందరూ పోర్షన్లు మరిచి పోయిన ట్టయిపోయారు. ఆ తరవాత సంభాషణ సహజంగా సాగింది.

తనతో ఎవరికీ ఇంక పని లేదని తెలుసుకుందికాబోలు శకుంతల లేస్తూ తనవెంట లోపలికి రమ్మని ఇందిరకు సైగ చేసింది

ఇద్దరూ తిన్నగా పడకగదిలోకి వెళ్ళి, పెద్దమంచంమీద కూర్చున్నారు.

"నీ ఇంప్రెషన్ ఏమిటి, ఉన్నదున్నట్టు చెప్పు." అన్నది శకుంతల.

ఇందిర తికమక పడింది. అట్లా అడిగితే ఏమిటి చెప్పటం? చివరకు ఆమె కపటం లేకుండా, "ఇట్లా చూసి ఏం చెప్పగలమోయ్? ఇంతకన్న రోజూ చూసే మనుషుల సంగతే మనకు ఏమీ తెలీదుగదా? అనెస్టుగా చెప్పాలంటే నాకిదంతా పనికిమాలిన ఫార్సులాగుంది. మనిషిని చూశాం. ఎట్లా ఉన్నాడో తెలిసింది. ఎటువంటివాడో తెలియొద్దా?" అన్నది.

"ఎట్లా ఉన్నాడో అదైనా చెప్పు."

"నీ కెట్లా ఉన్నాడో నాకూ అట్లాగే ఉంటాడు. నా ఇన్‌స్టింక్టేదో చెబుతుందన్నావే, నా కేమీ చెప్పటంలేదు."

"నాకు తగుతాడో లేదో చెప్పలేవా? అది నాకు తెలిసేసంగతి కాదు."

"నేను ప్రిజుడీసయినానేమో చెప్పలేను గాని, నీకింకా మంచి మొగుడు రావచ్చునేమో అనిపిస్తుంది."

"మన కున్న ఛాయి సెంత? అది చూసుకోవాలిగా?"

"అలాటప్పుడీ పెళ్ళి చూపులెందుకూ?"

"మనసు నెంతవరకు సమాధాన పరచుకోవాలో తేల్చుకోవటానికి."

"అది జీవితాంతందాకా తేలదు శకుంతలా. మా అమ్మా, నాన్నా ఒకరికోసం ఒకరు ఎంతో మారారు. కాని ఇన్నేళ్ళయినా ఎడ్జస్టుమెంటు కుదరలేదు. అది కుదిరేదికాదు, ఎవరో ఒకరు పూర్తిగా మరో మనిషైపోతే తప్ప. దాన్ని సమాధానపడట మనాలా? ఇంకో జన్మ ఎత్తట మనాలా?" అన్నది ఇందిర.

"ఇటువంటి అభిప్రాయా లన్నీ పెట్టుకుని రేపు నువ్వెట్లా పెళ్ళిచేసుకుంటావో నాకు తెలియటంలేదు."

"చాలా ఈజీగా చేసుకుంటాను."

"ఆ ట్రిక్కే మిటో నాకూ కాస్త చెబుదూ!"

"పెళ్ళి చేసుకోవటానికి నేను అందం చూడను, ఏదీ చూడను; డబ్బు ఒక్కటే చూస్తాను. మేం బీదవాళ్ళ మని చెప్పను గాని, డబ్బుతో వచ్చే సుఖా లేవీ నాకు లేవు. నౌకర్లూ, కారూ, ఏయిర్‌కండిషనింగూ, మంచిబట్టలూ, ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళే అవకాశాలూ— ఇవన్నీ నాకు కావాలి. మన జీవితం చాలా ఇరుకు. కాదూ?" అన్నది ఇందిర.

శకుంతల ఏదో ఆలోచిస్తూ ఉండిపోయింది.

కొంచెంసేపుండి ఇందిర, "మీవాళ్లు ఈ పెళ్ళికొడుకుగురించి నీ అభిప్రాయం అడిగితే ఏం చెప్పబోతున్నావు?" అని అడిగింది

"వెప్పటాని కేముందీ? నా కిష్టమే వంటాను మావాళ్లు నా కింతకన్న మంచి మాచ్ తీసుకురాలేరు నాకు తెలుసు ఇతను మా అన్నకి స్నేహితుడు." అన్నది శకుంతల.

శకుంతల ఆ మాట అనగానే ఇందిరకు తా నన్నమాట లన్నిటికీ అర్థం లేకుండా పోయినట్టయింది. ఎవరి మనస్సులో ఎటువంటి ప్రపంచం ఉందో రెండో మనిషికి తెలీసుగద! శకుంతల తనకు వచ్చిన సంబంధం సంపాదించుకున్నది. అది ఇందిరకు వచ్చేదికాదు. ఎవరిగొడవ వారిదీ!

## 4

భీమాకంపెనీలను ఉన్నట్టుండి జాతీయం చేశారు. కొంతమందికి ఉద్యోగాలు పోయాయి. తీసేసినవాళ్ళలో నాగభూషణంకూడా ఉన్నాడు.

"మీ కంపెనీలో అందర్నీ తీసేశారా?" అని అడిగింది సుభద్ర మొగుణ్ణి.

"లేదు. నావంటివాళ్ళను కొందరినే తీసేశారు," అన్నాడు నాగభూషణం.

"ఊరికే ఎందుకు తీసేస్తారూ? ఏదో కారణం ఉండేఉంటుంది." అన్నది సుభద్ర తీసేసిన వాళ్ళ న్యాయబుద్ధిలో విశ్వాసం ప్రకటిస్తూ.

"నువ్వు సరిగానే కనిపెట్టావు. ఆకారణంగా తీసెయ్యలేదు."

"పని సరిగా చెయ్యటం లేదనో, పైవాళ్ళతో పోట్లాడితేనో తీసేసిఉంటారు"

"నేను పై అధికారులతో పోట్లాడలేదుగాని, వాళ్ళకు అణగిమణిగి ఉండని మాట నిజమే." అన్నాడు నాగభూషణం పెళ్ళానికి ప్రోత్సాహం ఇస్తూ.

"అది చాలదూ ఉద్యోగం ఊడటానికీ?"


పైవాళ్ళ అడుగులకు మడుగు లొత్తితే ఉద్యోగం నిలబడేదేమో?"

"మీకు వేళాకోళంగా ఉందిగా మాలు. ఒకరి ఉప్పు తినేప్పుడు వాళ్ళకు అణిగి పడుండటం తప్పా? అంత రాజసం ఉంటే అసలు ఉద్యోగాలే చెయ్యకూడదు. ఉద్యోగం చెయ్యటంలో లేని నామోషీ దాన్ని నిలబెట్టుకోవటానికొస్తుందా?"

"ఈ ఉద్యోగంలో ఒకరి ఉప్పు తినటమంటూ లేదు. ఉన్న ఉప్పంతా లోకులది. నాకు ఉద్యోగ మిచ్చినవాళ్ళూ, తీసేసిన వాళ్ళూకూడా లోకుల ఉప్పు తినేవాళ్ళే. అలాటప్పు డేం చెయ్యా లంటారు?"

"ఉద్యోగం పోగొట్టుకొచ్చి నన్ను మాటలతో బురిడీకొడతా రేమిటి? దిగులు ఉద్యోగం పోయినందుక్కాదు, నే నన్న మాటల్లో అవమానం జరిగిపోయిందేమోనని! బాగుంది!"

"ఏం చేస్తే ఉద్యోగం దక్కేదో నువ్వు చెప్పనేలేదు."



"మొదటే చెప్పాను, ఎవరైతే తీసే శారో వాళ్ళకి అణిగిమణిగిఉంటే ఇలా జరిగేదికాదు. అది ముమ్మాటికీ నిజం!"

అసలు నిజ మేమిటంటే, సుభద్ర తన మొగుడిలో ఎన్ని అపకతివక లున్నా భరించగలదుగాని. మానుషం భరించలేదు. నాగభూషణం అడుగడుగునా అదే ప్రదర్శించేవాడు. అది సుభద్రకు వల్లమాలిన ఆతిశయంలాగా కనబడేది. నెహూ్రి, పటేలు వంటి వాళ్ళను కూడా నాగభూషణం ఒక్కముక్కలో తోసిపారెయ్యటం ఆమె విన్నదే. అంతటి అతిశయం నెత్తి అణచకిపోదు. నాగభూషణం ఉద్యోగం పోవటం ఆమెకు ఆశ్చర్యం కలిగించలేదు; అది ఇంత కాలం నిలబడటమే ఆశ్చర్యం! ఉద్యోగం పోయిందన్నవాడు రోజూ వేళ తప్పకుండా వెళుతూనే ఉన్నాడు.

"నాన్నకు ఉద్యోగం పోయిందిగా! డ్రెస్సేసుకుని ఎక్కడికి పోతున్నాడు?" అని అడిగింది ఇందిర తల్లిని. ఇందిర ప్రశ్న పూర్తికాకమునుపే మగపిల్లలిద్దరూ అడిగారు.

"నాకు తెలీదు పొండి" అని సుభద్ర కసిరింది. అవిడ కసలే నడిసముద్రంలో పడి ఉక్కిరిబిక్కిరవుతున్నట్టుంది. మిన్ను విరిగి మీద పడ్డా ఏమీ జరగనట్టు నటించే భర్త, పెళ్ళికి ఎదిగికూర్చున్న కూతురూ! పిల్లల చదువులకు ఖర్చు పెరుగుతోందికాని తరగటంలేదు. ఈ సందున, వున్న ఉద్యోగంకాస్తా ఊడిపోయింది ఇప్పుడేంగాను? వీటన్నిటిని గురించీ సతమతం కావలసిన మనిషి నిశ్చింతగా ఉన్నాడు. సమస్యల భారంతో మండి మనోవ్యాధిపాలవుతున్నది సుభద్ర ఎవ్వరికైనా ఎత్తలేని బరువును మించిన

అనూహ్యమైన బరువుండదు. సుభద్ర తన శక్తికి మించిన బరువు ఎత్త ప్రయత్నించి మానసిక సంక్షోభానికి తనను తాను నిష్కారణంగా గురిచేసుకున్నది.

ఒకనాటి సాయంకాలం దీపాలు పెట్టేవేళ ఇందిర ఇంటికి తిరిగివస్తూ ఎవరో అతను తమ ఇంటి ఎదట వీధిలో నిలబడి, "నాగభూషణంగారూ?" అని కేకపెట్టటం చూసింది. లోపలినుంచి ఎవరూ పలకలేదు గామాలు అతను మళ్ళా కేక పెట్టాడు. అప్పటికి ఇందిర అంతదూరంలోకి వచ్చివుండటంచేత, "ఎవరండీ?" అన్నది.

అతను బిత్తరపోయినట్టుగా పక్కకు తిరిగి చూశాడు. దారేపొయ్యేవాళ్ళందరికీ తానెవరో చెప్పవలసిన అగత్యం తనకు లేనట్టుగా అతను సమాధానం చెప్పలేదు.

ఇందిర ఆ ఇల్లు తనదే నన్నట్టు స్వతంత్రంగా తను వెదురుబద్దల గేటు మీద చెయ్యి వేసి, "నాగభూషణంగారి కోసం వచ్చారా?" అన్నది.

"ఔను. ఆరున్నరకి రమ్మన్నారు. (గడియారం లాంఛనంగా చూసుకుని) ముప్పావుకూడా దాటింది." అన్నాడు ఆ కుర్రవాడు. కుర్రవాడే — గట్టిగా పాతికేళ్ళు లేవు.

"అయితే వస్తారేమో. లోపలికి వచ్చి కూర్చోవచ్చు!" అంటూ ఇందిర గేటు ఎత్తి ఎడంగా పెట్టింది

ఇంట్లో ఎవరూ లేరు. సుభద్ర పక్కింటి కెళ్ళినట్టుంది. పిల్లలు ఆడుకోటోయివుంటారు. దీపం కూడా లేదు. ఇప్పుడు ఎలక్ట్రిక్ దీపాలు వచ్చాయి యింటికి.

ఇందిర తలుపు గొళ్ళెం తీసి లోపలికెళ్ళి, లోపలి లైట్లూ, చూరుకింది వసారాలో లైటూ వేసింది. వసారాలో ఉన్న చిన్న బెంచి మీద ఆ కుర్రాడు కూర్చున్నాడు.

లైట్లు వెలగగానే వెనకవాళ్ళింటో నుంచి సుభద్ర గొంతు, "ఎవరువారూ, ఇందూ?" అని అడగటం వినిపించింది.

"నేనే." అని ఇందిర జవాబు చెప్పింది. ఆమె మొగమూ, కాళ్ళూ, చేతులూ బాగా సబ్బేసి ఒకటికి రెండుసార్లు కడుక్కొని, మొహాని కింత పౌడరూ అదీ వేసుకుని, జడ విప్పి, జుట్టు పైపైన దువ్వి వదులువదులుగా జడ వేసుకుని, బట్టలు మార్చుకుని, చల్ల గాలికని బయటికి వచ్చేసరికి. ఆ కుర్రాడు బుద్ధిమంతుడల్లే ఆ చిన్న బెంచీపైన, చేతులు ఒళ్ళో పెట్టుకుని, తల ఒక పక్కకు ఒరగేసి కూర్చున్నాడు.

అతను చాలా అందంగా ఉండటం చూసి ఇందిరకు చిన్న షాక్ తగిలినట్టయింది. ఇందాక దీపం వేసినప్పుడుగాని, అంతకుముందు రోడ్డుమీద నిలబడి ఉన్నప్పుడుగాని ఆమె అతన్ని సరిగా గమనించలేదు. పట్టుకుచ్చులాటి ఒత్తయిన జుట్టు, కాటుక పెట్టుకున్నా—

అన్నట్టున్న కదురైన కళ్ళు నున్నటి చెక్కిళ్ళు: ఎక్కడా వంకలేని ముక్కు. చిన్నమూతి. దానికి తగినంతే గడ్డము. సినిమావాళ్ళు ఎగరేసుకు పోవలసినవాడే। ప్రయత్నాలు చేసే ఉంటాడు ఈ రోజుల్లో ఎందరో చేస్తున్నారు ఆఖరుకు ప్రభాకరం సినిమావాళ్ళ చుట్టూ, సినీజర్నలిస్టుల చుట్టూ ఎంతకాలం తిరగాడు? సజాని కతని అందం చూసి ఎవరు తీసుకుంటారు? కోతి।

ఆ అబ్బాయికూడా ఇందిరను చాలా సేపు ఎగాదిగా చూశాడు ఇందిర నిలబడే ఉండటం చూసి, "కూర్చోండి।" అని బల్ల చూపుతూ తను లేచాడు.

"నేను కూర్చోను. మీరు కూర్చోండి టైమెంతా?" అన్నది ఇందిర

"ఏడూ పది దాటింది "

"రోజూ మా నాన్నగారు వచ్చేవేళ ఇంకా కాలేదనుకోండి అయినా ఆయన్నడకు అప్పాయింట్మెంటు పెట్టినవాడు—" మాట పూర్తి చెయ్యటం అనవసరం

"మరచిపోయారేమో? లేక ఇంకేదైనా పని పడిందో?" అన్నాడతను

"ఎవరే అదీ? అంటూ సుభద్ర చుట్టూ తిరిగి పీధిలోనుంచి వచ్చింది. చేతిలో వెడల్పాటి గిన్నెలో ఏదో పెట్టుకుని

"ఎవరో। నాన్నకోసంట "

ఆ అబ్బాయిని దగ్గిరిగా చూసి సుభద్ర కళ్ళు పెద్దవి చెయ్యటం ఇంటర గమనించి నవ్వు ఆపుకుంది ఆమె చేసిన యాక్షనుకు సమాధానంగా సుభద్ర "ఇదా? వడియాలపిండి రుబ్బుకొస్తున్నా పొద్దునే రుబ్బుదామంటే పడిచావలా।" అంటూ లోపలికి గబగబా వెళ్ళింది ఇందిరకూడా లోపలికి వెళ్ళింది

కాని సుభద్రకు ఇంట్లో రుబ్బుపిండి పెట్టటం తప్ప మరేమీ పని లేదు ఆమె గబగబా బయటికి వచ్చి చప్పున బ్రేక్ వేసినట్టాగిపోయింది. వసారాలో ఆ కుర్రాడు లేడు తల్లివెనకే వస్తున్న ఇందిర తల్లిమీద పడింది సుభద్ర "ఏమిటే నువ్వు?" అని విసుక్కున్నది

"నువ్వా ఆగటమేమిటీ - వాక్యూమ్ బ్రేకు వేసినట్టూ?" అన్నది ఇందిర

"ఈ అబ్బాయేదీ?"

"బయటికెళ్ళాడేమో? నాన్న ఎంతకీ రాకపోతే ఏం చేస్తాడూ? ఆరున్నరకు రమ్మన్నాట్ట. ఏడున్నరకూడా కావస్తున్నది "

"కుర్రాడు బాగున్నాడుకదూ?"

"నేనంతగా గమనించలేదు," ఇందిర బొంకింది

గమనించకపోవటమేమిటి? నే వచ్చేటప్పటి కిద్దరూ మాట్లాడుకుంటూంటిరే?" సుభద్ర బొంకు పట్టేసింది

"చల్లగాలి కొచ్చి బయట నిలబడాను, నువొచ్చావు"

"పే రేమిటో ? ఎందులకో ?"

"నే నేమీ అడగలేదు పైమేదీ ? లోపలి కొచ్చి, ఒళ్ళు కడుక్కుని, జడేసు కుని, బట్టలు మార్చుకుని బయటి కొచ్చాను అతను నాన్న రాలేదేమా అంటున్నాడు. చేబదు లడగటానికే వచ్చాడో, బాకీ వసూలు చేసుకోవటానికే వచ్చాడోకూడా తెలియకుండా ఊరూ, పేరూ అడగనా ? నే నేమీ అడగలేదు "

"చదవేస్తే ఉన్నమతి పోయిందిట. ఇంటి కొచ్చినవాణ్ణి పేరడగరూ ? ఇప్పు డతను వెళ్ళిపోయాడుగదా. మీ నాన్న వస్తే ఎవరో వచ్చారని చెప్పాల్సిందేగా ?"

ఇద్దరూ లోపలికి వచ్చిన కొద్దిసెకండ్ల ల్లా బయటిగేటు ఎత్తి పక్కన పెట్టిన చప్పు డయింది. నాగభూషణం గొంతు వినబడింది చెప్పకుండా వెళ్ళిపోయిన కుర్రాడు మళ్ళీ వచ్చాడు ఇంటిముందో, వీధి మొదట్లోనో నాగభూషణంకోసం కాపేసినట్టుంది

ఇంతా చేసి వాళ్ళిద్దరూ గట్టిగా ఆయిదు నిమిషాలైనా మాట్లాడుకోలేదు కుర్రాడు వెళ్ళిపోయాడు నాగభూషణం లోపలి కొచ్చాడు

' ఎవరండీ ఆ అబ్బాయి ?" అన్నది సుభద్ర ఆత్రంగా

' ఏ అబ్బాయి ? గోపాలమా ! అతను దినపత్రిక కాఫీసులో సబెడిటర్ గా ఉన్నాడు "

"మన జాతేనా ?"

"అయే ఉండాలి. ఏం ?"

"ఏంలేదు, పెళ్ళయిందా అని !"

"పెళ్ళా ? ఏమో నాకూ తెలీదు నే నెన్నడూ అడగలేదు."

సుభద్ర ఆశ్చర్యం బాగానే అభిన యించింది

"ఇంటో పెళ్ళి కావలసిన పిల్లను పెట్టుకుని, కాస్త కనుముక్కుతీరు గల కుర్రాడు కనిపిస్తే, తరవాత చేసినా చెయ్యకపోయినా, విచారించా లనైనా తట్టదూ ? ఏం మనిషంట ! ఇట్లా ఎంత మంది కుర్రాళ్ళను వదిలేశారో !"

భయంకరమైన అనుమానం. తలుచు కుంటే సుభద్రగుండె లవిసిపోయాయి

"రోజూ నాకు పెళ్ళి కావలసిన కుర్రాళ్ళు కనిపిస్తుంటారు కాదూ ?" అన్నాడు నాగభూషణం వెటకారంగా

"అటువంటప్పుడు దొరికిన ఒక్క కుర్రాణ్ణి ఉపేక్షించటం మరీ అన్యాయం మాటవరసకి, పోనీ మీ రన్నట్టు, ఈ అబ్బాయి ఒక్కడే తటస్థపడ్డా డను కుందాం విచారించా లని మీ కేమన్నా తట్టిందా ?"

లాభం లేదు పెనుగులాడితే నాగ భూషణం మరింత ఊబిలో ఇరుక్కు పోతాడు, పిల్ల పెళ్ళిగురించిన బాధ్యత సుభద్రను వేదిస్తున్నట్టుగా నాగభూష ణాన్ని వేధించటం లేదు ఇల్లు దాటి వీధిలోకి పోతే ఇంటిగొడవ లేవీ జ్ఞాపకం ఉండ వతనికి




"ఇప్పు దేం కొంప మునిగిందీ? ఎదట ఉన్నవాడేగా?" అని అతను గొణిగాడు

"రేపైనా అతన్నిగురించి కనుక్కుంటారా?"

పంతులు ప్రశ్న...'రేపైనా పాఠాలు సరిగా చదువు కొస్తావా' ?... 'ఔను, చదువు కొస్తాను.' అన్నది తప్ప దానికి మరోసమాధానం లేదు కాని నోటంట ఆ మాట అనితీరాలి ఇవాళ పాఠాలు చదువుకురానందు కది శిక్ష !

"ఏం మాట్లాడరేం?"

విద్యార్థి నవమానించా లని పంతులు పట్టుదల !

"చూ ద్దాం లే." అన్నాడు నాగభూషణం

"చూద్దాంలే ఏమిటి? విచారిస్తానానండీ! మీ అమ్మాయే; ఊళ్ళోవాళ్ళమ్మాయి కాదు"

సుభద్ర నోరుచేసుకు అడిగినాకూడా నాగభూషణం నోరారా 'విచారిస్తాను' అనలేదు మొండితనమంటే అట్లా ఉండాలి.

సుభద్ర క్కావలిసిన ఇన్ఫర్మేష నింకా ఉన్నది

"ఆ అబ్బాయి మీ చుట్టూతా ఎందుకు తిరుగుతున్నాడూ?"

"ఏదో పనుండి"

"మీ వల్లనా !" ఆశ్చర్యం ! "ఏమి టా పని ? చెప్పరాదా ?"

"ఉద్యోగంకోసం."

"మీ రిప్పుడు ఇతర్లకి ఉద్యోగాలు కూడా ఇస్తున్నా రేమిటి?" హాస్యం !

"ఇవ్వటం లేదు. ఇప్పించటానికి ప్రయత్నిస్తున్నా."

"అతని కేదో ఉద్యోగం ఉందన్నా రుగా ?"

"అంతకంటె మంచి దొ స్తే చేదా?"

"ఆ మంచి ఉద్యోగం మీ రిప్పించ గలరా ఏమిటి ?"

"ఇప్పించగల నని అత ననుకుంటు న్నాడు."

"మీ కున్న ఉద్యోగం ఊడిం దని తెలుసా ?" వ్యంగ్యం !

గోపాలం (పూర్తిపేరు గోపాల కృష్ణ మూర్తి) ఆదివారంనాడు మళ్ళీ వచ్చాడు.

"రావోయ్, కూర్చో !" అన్నాడు నాగభూషణం.

"ఎందుకండీ ? మాట చెప్పిపోదా మని వచ్చా, అలగేశన్‌గారిని చూసి అప్లి కేష నిచ్చా. పదిరోజు లాగి కనపడ మన్నారు."

"ఈలోపల నేను మళ్ళీ ఒకమాట వేస్తాలే. కూర్చో. నిలబడే ఉన్నావేం ? వేరే పనేమన్నా ఉందా ?"

"ఏమీ లేదండీ," అంటూ అతను పసారాలో చిన్న బెంచీమీద కూర్చు న్నాడు. అది అతని పర్మనెంటు సీటు లాగా అయిపోయింది.

నాగభూషణం తన కుర్చీని అతని కెదురుగా తిప్పుకుని కూర్చుని. "హోటలు భోజనమేగా ?" అన్నాడు.

"అవునండీ. కొంప ఏర్పాటు చేసు కుందామన్నా మాఅమ్మ రోగిష్టిది. పాపం, ఆవిడ నా కేంచేస్తుంది ? నేనే ఆవిడకు చెయ్యాలి. అదీగాక మా అన్నయ్య డాక్టరు. అంచేత ఆవిడ మా అన్నయ్య దగ్గిరే ఉంటున్నది."

"పెళ్ళి చేసుకుంటే నీ సమస్య తీరి పోతుందిగా ! సంబంధా లేవీ రాలేదా ?"

"ఆఫర్సు వస్తూనేఉన్నాయి కానీండి. నా టరమ్సు వాళ్ళకు నచ్చటంలేదు. వాళ్ళ టరమ్సు నాకు నచ్చటంలేదు. తమాషా ఏమిటంటే. నా టరమ్సు వాళ్ళకే లాభం ! కాని ఒక్కరూ ఒప్పుకోరు. చాలా మందికి తమ లాభం ఏమిటో తమకే తెలియదనుకుంటా. అందుకే తెలిసిన వాళ్ళు రెండుచేతులా లాభాలు గడించే స్తున్నారు. నే నద్దెకుంటున్నానే అండీ. ఆ యింటివాళ్లు చవుక అని చేతిపాలు పోయించుకుంటారు; కల్తీనెయ్యి తప్ప కొనరు; అదేం మెంటాలిటీ అంటారు?"

'మాట్లాడుగాని, మొదలు పెడి తే జోరుగానే మాట్లాడతాడు,' అనుకున్న దిందిర. ఆమెలాగే బయటిసంభాషణను



చెవులు రిక్కించి ఆలకిస్తున్న సుభద్ర, అసలు సంగతి చప్పున చెప్పక లోకాభిరామాయణం మాట్లాడతాడేమని విసుక్కున్నది.

"నీ టరమ్సేమి టన్నావూ?"

"చాలా తేలికండీ. నేను కట్నం పుచ్చుకోను. బాజాభజంత్రీలూ, మంత్రాలూ నాకు పనికిరావు. రిజిస్టరు పెళ్ళితప్ప చేసుకోను. మరీ సుఖాలు మరిగినపిల్లను చేసుకోవటంకూడా నా కిష్టంలేదు; ఇది పైకి చెప్పే కండిషను కాదనుకోండి. ఏమంటే నేను బీదవాణ్ణి. నాకు కొన్ని తిక్క లున్నాయి. ఇప్పు డంటే ఏదో ఉద్యోగం ఉందనుకోండి. రేపు నాకసహ్యంవేస్తే రిజైన్ చేసిపారెయ్యొచ్చు. నేను చేసుకోబొయ్యే భార్య గాడ్రెజ్ సేఫ్‌లాటి జీవితం కోరితే అది అమర్చటం నా తరంకాదు. అలాటి జీవితంతో నేను ఉక్కిరిబిక్కిరయిపోతాను. అందుకే సగం నేను బాచిలర్‌గా ఉంటున్నది. నాకు సంపాదన లేనప్పుడు నా భార్యఅయినా నాలుగురాళ్ళు తేగలదైతే సంతోషిస్తాను. చదువుసంధ్యలు లేనిదాన్ని ఎలాగూ చేసుకోననుకోండీ!"

"సంబంధాలేమన్నా వస్తే వాళ్ళకి నీ సంగతి చెప్పొచ్చా?" అని నాగభూషణం అడిగాడు.

"చెబితే చెప్పండి. కాని నేను అనుభవంమీద చెబుతున్నాగా. కట్నం వద్దనేవాడి కెవరూ పిల్లనివ్వరు. పదిహేను రూపాయిల పెళ్ళి పెళ్ళేకాదు. పెళ్ళి చేస్తే ఇరవై ఏళ్ళు కూడబెట్టిన సొమ్ము

కర్పూరంలా హరించుకుపోవాలి. నలుగురిచేతా నానామాటలూ పడాలి లేకపోతే అది పెళ్ళేకాదు." అన్నాడు గోపాలం

గోపాలం వెళ్ళిపోయినాక నాగభూషణం లోపలికి వచ్చి భార్యతో, "నీకు కావలసిందంతా తెలిసిందా ?" అన్నాడు.

"రిజిష్టరు పెళ్ళంటా దేమిటీ? అంటే అప్పు డెప్పుడో మొదలియారు కొడుకు చేసుకున్న పెళ్ళిలాటిదా ?" అన్నది సుభద్ర. ఆవదం రుచి జ్ఞాపకం వస్తున్నట్టుగా.

"అవును. రిజిస్ట్రారు దగ్గిరికి వెళ్ళి, పెళ్ళి చేసుకుంటున్నట్టు చెప్పాలి. ముగ్గురుసాక్షులు సంతకాలు చెయ్యాలి. పెళ్ళి జరిగినట్టు సర్టిఫికెట్టిస్తారు.''

"సౌలా లమ్మినట్టుగా ఉంది. ఛీ. ఛీ! అదేం పెళ్ళి ?"

"అటువంటి పెళ్ళికి ఎవరూ ఒప్పుకోరని ఆతనే అంటున్నాడుగా ? డబ్బు ఖర్చు కాందే, పిల్లతండ్రి దివాలా తియ్యందే పెళ్ళి ఎట్లా అవుతుందీ ?''

"వెర్రాడులా గున్నాడు; అచ్చట్లూ, ముచ్చట్లూ లేకుండా అదేం పెళ్ళండీ ?"

"నీ కా పెళ్ళి ఇష్టమైనాకూడా లాభం లేదులే. ఇందిర కింకా పద్దెనిమిది నిండ లేదు.''

"అదోటా ? చూడండీ. మంత్రాల పెళ్ళికూడా క్లుప్తంలో ముగించవచ్చు. డబ్బుఖర్చుకూడా ఉండదు అంతులుపెళ్ళికి ఖర్చేముండండీ? కట్నాలకూ, కానుకలకూ. అతిథిసత్కారాలకూ డబ్బు తగలడిపోతుందిగానీ! అతను క్లుప్తంగా కొద్దిలో అయిపోయే మంత్రాలపెళ్ళి కొప్పుకుంటాడేమో కనుక్కోండీ. విక్షేపమంటికుర్రాడు చూస్తూ, చూస్తూ పోనివ్వటం నా కేమీ బాగాలేదు."

"నేనడగను. కావలిస్తే నువ్వడుగు."

"ఏం ? ఎందు కడగరూ ? ఒప్పేసుకుంటే పిల్లకు పెళ్ళి అయిపోతుందనా ? అంత ముచ్చటైన అల్లుడు తల్లకిందులుగా తపస్సు చేసినా దొరకడు!"

"అతనికి ఇందిరను చేసుకోవాలని గట్టికోరిక ఉన్నట్టుతెలిస్తేమనంకన్నేషన్లు అడగొచ్చు. ఉట్టి ఖర్మానికి. 'ఇదుగో, అబ్బాయ్! నువు రిజిస్టరు పెళ్ళి అని పట్టుపట్టి కూర్చోక ఏ స స్తవ తో నో మంత్రాలపెళ్ళి చేసుకో,' అంటే నన్ను వెర్రివాడికింద జమకట్టేస్తాడు. మనం ఏదన్నా అడిగేముందు అతనికి ఇందు మీద ఇష్టం ఉండాలి— మామూలు ఇష్టం కాదు, గట్టిఇష్టం. అట్లాగే మనపిల్లకూడా అతన్ని చేసుకోవాలని కొంచెమైనా ఉండాలి." అన్నాడు నాగభూషణం.

"నా కీ సంబధం అక్కర్లేదు!" అన్నది ఇందిర.

తల్లిదండ్రు లిద్దరూ గొప్పషాక్ తిని ఒకరిమొహా లొకరు చూసుకున్నారు.

# 5

గోపాలాన్ని తను పెళ్ళి చేసుకో నవసరం లేదన్న నిర్ణయాన్ని ఇందిర అంత తేలికగానూ చెయ్యలేదు. త్వరగానూ చెయ్యలేదు. మొట్టమొదటిసారిగా తల్లిదృష్టి ఆ కుర్రాడిపైన పడినట్టు తెలిసినప్పటినుంచీ ఆమె ఈ విషయం తన మనస్సులో ఒక పక్కన ఆలోచిస్తూనే ఉన్నది. తన నా కుర్రాడు ఆకర్షించినట్టు తల్లి కేమాత్రమూ తెలియనివ్వలేదు: అతనికి అనుకూలంగా ఒక్కమాటకూడా అనలేదు.

గోపాలం ఇందిరను ఆకర్షించలేదని కాదు; అందచందాలు సంబంధించినవరకూ బాగానే ఆకర్షించాడు. చిక్కల్లా ఏమిటంటే, ఇందిర అందాన్ని ఏనాడూ పెద్దగా ఆరాధించలేదు. ఎవరన్నా అందంగా ఉంటే చూసి సంతోషించటానికి ఆ మనిషికి మొగుడో, పెళ్ళామో కావాలని ఎక్కడుంది? సినిమాతారల అందాన్ని లోకమంతా చూసి ఆనందిస్తున్నది. వాళ్ళ మొగుళ్ళూ, పెళ్ళాలూ అందులో సగమైనా ఆనందిస్తారో, ఆనందించరో?

మగవాడిలో ఒక విశిష్టమైన శక్తి ఉండాలి– "పద్మశ్రీ" లో ఇందిర చూసిన శక్తిలాటిది ఇందిర అటువంటి శక్తిగల భర్తను కోరింది. ఈ కుర్రాడు తనకు రోడ్డుపైన కనపడిన క్షణంనుంచీ అతను మసులుకున్న పద్ధతి చూస్తుంటే అందులో శక్తి ఏమీ కనిపించలేదు. ఆ మాటకు వస్తే ఇందిర కళ్ళకు యువకు లంతా పడిలిన తోటకూర కాడలల్లేనే కనిపించారు. వాళ్ళు అనుకువగా ఉంటే అమ్మాయిలల్లే ఉంటారు. ధైర్యం చూపించినప్పుడు వెకిలిగా ఉంటారు. నిండుతనమూ, నిబ్బరమూ చాలా అరుదు.

గోపాలాన్ని చేసుకొనటానికి ఇందిర మధనపడింది అతని ఆకర్షణ కానేకాదు రూపం వినహాయిస్తే మిగిలిన అన్ని విషయాలలోను అత నామెకు అననుకూలంగా ఉన్నాడు. అతనిది దారిద్ర్యాన్ని ఆరాధించే వేదాంతంలాగా కనబడింది. జీవితపు ఎడారిలో ఒక చిన్న పిచ్చుక గూడు కట్టుకుని, ఘనకార్యం చేసినట్టు సంతోషించే రకంగా కనిపించాడు. మనిషికి జీవితం అనుభవించాలన్న చొరవకన్న, ఆదర్శాలను పాటించాలన్న యావ జాస్తి. అతనికి ఆస్తి లేదు: పెద్ద సంపాదన లేదు. ఉండబోదుకూడా. కట్నం పుచ్చి పిల్ల నిస్తామంటే వద్దనెయ్యటమే గాక, కట్నం తీసుకోకబోవటం ఒక నియమంగా పెట్టుకున్నాడు! అందువల్ల అతని కాబోయే మామగారు సుఖపడిపోవచ్చుగాక, డబ్బంటే చేదైన మొగుణ్ణి కట్టుకున్న ఇల్లాలి గతేమిటి?

ఇందిరను బాధించినది తన తల్లికీ, తండ్రికీకూడా నచ్చిన సంబంధాన్ని

తాను నిరాకరించవలసిరావటం ప్రతి చిన్న విషయంలోనూ షష్టాష్టకంగా ఉండే తన తల్లిదండ్రులకు అభిప్రాయం కలిసినప్పుడల్లా తనకు సమస్య ఏర్పడటం ఇందిర లోగడ ఎన్నోసార్లు గమనించింది. అదే ఇప్పుడు పెద్ద మోతాదులో జరిగింది. లోకజ్ఞానం విషయంలో వాళ్ళిద్దరూ తనను మించుతారని ఇందిరకు తెలుసు. వాళ్ళు మంచిసంబంధమని శిఫార్సు చేసినదాన్ని కాదంటే లోకు లందరి దృష్టిలోనూ తను విడ్డూరంగా కనబడటం ఖాయం. అది ఇందిరకు చాలా పట్టిచ్చేసంగతి. జీవితంతో పేచీ పడకుండానే కావలసినది జీవితం నుంచి రాబట్టుకునే పద్ధతు లున్నాయనీ, తెలివితేటలు గలవాళ్లు ఆ పని చేస్తుంటే, చాతావాతా గానివాళ్ళు మాత్రమే ప్రపంచాన్ని దుమ్మెత్తి పోస్తున్నారనీ ఆమె నమ్మకం. అందుచేత ఆమెకు లోకవిదూరమైన పనులు చెయ్యటం ఇష్టంలేదు. అది చెయ్యవలసి వచ్చినందుకు చాలా బాధపడింది.

"ఏమిటి నీ అభ్యంతరం ?" అన్నాడు నాగభూషణం, ఇందిర కేసి వింతగా చూస్తూ.

ఇందిర మాట్లాడలేదు.

"కుర్రాడు బాగాలేడా ?" అని తల్లి అడిగింది.

ఇందిర ఏదో ఒకటి అనక తప్పలేదు.

"మీ కిప్పుడే పెళ్ళి అయిపోయి నట్టుగా మాట్లాడతా రేమిటీ ? అతను సివిక్ మారేజి కావా లంటూంటే నేనేమో మైనరు నైతినీ ?" అన్న దామె

"అది అతని అభ్యంతర మవుతుంది. నీ అభ్యంతరం ఎట్లా అవుతుందీ ?"

ఇందిర మాట్లాడలేదు.

"అతన్ని ఎలాగైనా పీటల మీది పెళ్ళికి ఒప్పిస్తే నీ కభ్యంతరం లేనట్టేనా ?" అన్నాడు తండ్రి.

తన ఉద్దేశం అది కాదన్న సూచనగా ఇందిర తల అడ్డంగా తిప్పింది. తన కూ కురు అభ్యంతరం లేదంటున్నదనుకున్నాడు తండ్రి.

"సరే, నే నతనితో మాట్లాడతాలే," అన్నా డాయన.

ఈసారి కింతటితో పోనిద్దా మనుకున్నది ఇందిర. ఆ గోపాలం తన తండ్రితో, మీ అమ్మాయి నా కక్కర్లేదని చెప్పెయ్యగూడదూ ? పీడ విరగడ అవుతుంది ! అతను మెత్తబడి, పోనీ పీటలమీద పెళ్ళే చేసుకుంటా ననేస్తే తనకు మరో యుద్ధం తప్పదన్నమాటే ! ఇటువంటి కీచులాటలు చాలా అహ్యం తను ఒక సంబంధం వద్దని అన్నాక, వాళ్లు తనను బోనులో నిలబెట్టి, తన అజ్ఞానాన్నీ అవివేకాన్నీ రుజువు చెయ్యకపోతే, దాని కిష్టం లేదుకాబోలు లెమ్మని ఊరుకోకూడదూ ? వాళ్ళు తన పెళ్ళి భార మంతా నెత్తిన వేసుకోవటంతో ఇంత చిక్కొచ్చింది. (సశేషం)

# తిమింగిలం వేట

(ఇందిర స్నేహితురాలు శకుంతల పెళ్ళిచూపులకు వెళ్ళి, పెళ్ళికొడుకు తనకూ శకుంతలకూ నచ్చకపోయినా అతను పెళ్ళికి శకుంతల ఒప్పుకోవడం ఆమెకు ఆశ్చర్యం కల్గించింది.

అకస్మాత్తుగా గోపాలం తన కోసం రావడం — తన తల్లిదండ్రులకు, గోపాలం మనసులో పెళ్ళిసమస్యపై ఉన్న అభిప్రాయాలు ఒక విధంగా నచ్చగా, తనను గోపాలానికి ఇచ్చి ముడిపెట్టాలనుకోవడమనేది ఒక పెద్ద సమస్యగా ఏర్పడింది.) --- ఇక చదవండి.

తన పెళ్ళి తాను చేసుకోగలనన్న మొండిధైర్యం ఇందిరకున్నది. ప్రభాకరం "క్రూక్" కాకపోతే తను తప్పక చేసుకుని ఉండేదే. ఆ సంబంధం తన అమ్మా, నాన్నా తెస్తారా? తాను ప్రభాకరంతో అతన్ని పెళ్ళాడటానికి సిద్ధంగా వున్నానన్న సంగతి ఈనాటి దాకా వాళ్ళకు తెలియనుకూడా తెలియదు!

ఇందిరకు మథనపడటం తప్పలేదు.

మొత్తానికి నాగభూషణం గోపాలంతో ఏదో అన్నాడు. ఒకనాడు సాయంకాలం ఇందిర కాలేజీ గేటుదగ్గిరకి వచ్చేసరికి అక్కడ గోపాలం, తనకోసమే గామాలు, నిలబడి ఉన్నాడు. ప్రస్తుతం ఇందిరకు గోపాలాన్ని చూడటం బాధాకరమైన విషయాలలో ఒకటిగా ఉన్నది. అతన్ని జ్ఞాపకం తెచ్చుకుంటేనే ఆమెకు ఇంటిదగ్గిర జరిగిన ఘర్షణ గుర్తుకొస్తున్నది.

"ఇలా వచ్చా రెవరి కోసం?" అన్నదామె.

"నీ కోసమే. కొంచెం మాట్లాడాలి. బీచిలోకి పోయి కూచుందామా?" అన్నాడతను. అతని గొంతు వింటుంటే ఈ మాట్లాడవలసిరావటం అతనికి కూడా ఏమంత ఉత్సాహకరంగా ఉన్నట్లులేదు.

"చాలా సేపు మాట్లాడాలా?"

"అది అచ్చంగా నాపైన ఆధారపడిన విషయం కాదు. కాస్సేపు బీచిలో కూర్చుని మాట్లాడటానికేమభ్యంతరం? నడిరోడ్డులో మాట్లాడే విషయం కాదు."

"మరేం లేదు. త్వరగా ఇంటికి పోదామని!"

"అంతగా అయితే టాక్సీలో దిగబెడతాను. ఈ ఒక్కపూటకీ..."

ఇద్దరూ శాంథోం బీచిసుదికి మెట్లు దిగి వెళ్ళారు. ఇసకలో చాలా కొద్దిమంది జనం ఉన్నారు. నీళ్ళకు మరీ దగ్గర కాకుండా, యాభై అడుగుల

కొనసాగింపు [illegible] పుట.



మౌనంలో ఏమీ లేకుండా చూసి ఇద్దరూ కూర్చున్నారు. సంభాషణ ప్రారంభించే బాధ్యత గోపాలానిదనే ఉద్దేశంతోనూ, దాని పర్యవసానానికి తను బాధ్యురాలు కాదని స్పష్టం చెయ్యటానికీ ఇందిర మౌనం వహించింది. గోపాలానికి ఎట్లా ప్రారంభించాలో తెలియక అయి ఉంటుంది. చాలా సేపు అతనూ మాట్లాడలేదు. ఆ నిశ్శబ్దంలో ఇందిరకు ప్రతి సెకండు ఒక యుగ మనిపించింది.

గోపాలం తమ పెళ్ళి విషయమే మాట్లాడతాడు; అంతవరకు ఆమెకు రూఢిగా తెలుసు. తను ఒప్పుకోదు, అదీ ఖాయమే. ఈ రెండు నిజాల మధ్య ఒక బాధాకరమైన సంభాషణ!

"నిన్న మీ నాన్నగారు చెప్పారు," అన్నాడు గోపాలం అకస్మాత్తుగా.

"ఏమని?" ఆమె సహాయం లేకుండా ఈ సంభాషణ నడిచేటట్టు లేదు

"సివిల్ మారేజి నీ కిష్టం లేదన్నట్టు చెప్పారు," అన్నాడు గోపాలం. మాట రావటం అతనికి చాలా కష్టమైనట్టు కనబడింది.

"నే నా మాట అన్నట్టు జ్ఞాపకం లేదే?" అన్నది ఇందిర.

గోపాలం నిర్ఘాంతపోయినట్టు కనబడ్డాడు. ఆమె ఆ మాట అన్న తరవాత అతనికి మాట్లాడేటందు కేమీ లేనట్టు అయింది.

"మన ఇద్దరియూ పెళ్ళాడటానికి నువ్వు చెప్పిన అభ్యంతర మేమిటి?"

"మన ఇద్దరికీ పెళ్ళా? దాన్ని గురించి మాటలు జరిగినట్టుకూడా నాకు తెలీదే?" అన్నది ఇందిర.

"మీ నాన్నగారు చెప్పలేదా? మీ ఇంట్లో ఆ విషయం చర్చించుకున్నారట గదా?" గోపాలం స్వేచ్ఛగా మాట్లాడగలుగుతున్నాడు

'మా ఇంట్లో అటువంటి సంభాషణలు నెలకు ఒకటో రెండో జరుగుతూనే ఉంటాయి. పెళ్ళి కావలసిన పిల్లలున్న ప్రతి ఇంటా జరుగుతాయి. సీరియస్‌గా సంబంధాలు వచ్చినప్పుడు జరిగే చర్చలు కావు ఎవరైనా వివాహ యోగ్యుడు కంటపడినప్పుడల్లా ఇంట్లోవాళ్ళు బాగోగులు చర్చించుకుంటారు. అట్లాగే చర్చించుకున్నారు. మా అమ్మా, నాన్నా మాట్లాడుకున్నారు గాని. నాతో వాళ్ళు మాట్లాడను కూడా లేదు. వాళ్లు జుట్టూ జుట్టూ పట్టుకునే స్థితికి వచ్చేసరికి నేనే కలిగించుకుని, నాకు పెళ్ళి వద్దనేశాను, వాళ్ళ తగాదా ఆపటానికి. అంతకన్న ఇంకేసు జరగలేదు."

తనపని తేలిక చేసుకునేటందుకు ఇందిర అబద్ధమాడింది. తల్లిదండ్రులు ఏకాభిప్రాయానికి రావటం చూసే తనకీ సంబంధం నచ్చిన్నది. తనకు పెళ్ళి వద్దని ఆమె అనలేదు. కాని ఈ విషయాలు గోపాలం రుజువు చెయ్యలేడు.

కాని ఇందిర చెప్పిన అబద్దాలు గోపాలానికి ఉత్సాహం చేకూర్చాయి. అతని ముఖం వికసించింది.


"దాదాపు వారం రోజుల క్రితం మీ నాన్నగారు నాతో మన పెళ్ళి గురించి ప్రస్తావించారు. నేను నాకున్న ప్రిన్సిపుల్స్ గురించి చెప్పాను. ఆయన వాటి కష్టాలేంటో చెప్పలేదు. వినాలి కవి అను నకే లాభం. నాకు కట్నాలు తీసుకోవటం చాలా నీచంగా కనిపిస్తుంది. డబ్బు కష్టపడి సాధించాలి. అనుభవించాలి. అది నా తత్వం."

"అట్లా చెప్పకండి. రోజల్లా ఒళ్లు హూనం చేసుకుని పనిచేసేవాళ్ళే సంపాదిస్తున్నారా. నిజంగా డబ్బు సంపాదించేవాళ్ళేమీ చెయ్యటమే లేదు. దమ్మిడీలు పోగుచేసే మెంటాలిటీని నేను మెచ్చుకోను."

"నాది దమ్మిడీలు పోగు చేసే మెంటాలిటీ అనుకోను. ఎంత శ్రమ చేస్తే అంత గొప్ప అని కూడా నేననుకోవటం లేదు. మన శక్తిని బట్టి సీ అవకాశాన్ని బట్టి ఒకపని మనం చేసేటప్పుడు ఆ పని సాధ్యమైనంత బాగా చేసి సాధ్యమైనంత హెచ్చు డబ్బు సంపాదించటంలో ఆనందం ఉంటుంది. కాదా?"

"ఇంకా తక్కువ శ్రమతో ఇంకా హెచ్చుడబ్బు సంపాదించగలిగితే అది మరీ మంచిదికదా!"

"మరీ హెచ్చుడబ్బు సంపాదించేవాళ్లు ఒంటరిగాళ్ళు. వాళ్ళు చేసేపని సాంఘికమైనదిగా ఉండదు. ఒక్కోసారి సంఘానికి విరుద్ధంగాకూడా ఉంటుంది ... చట్ట విరుద్ధం కాకపోయినా. నా కటువంటి పను లిష్టంలేదు. నేను పత్రికాఫీసులో పని చేస్తున్నానా. ఎంతోమందితో కలిసి ఎన్నో లక్షలమంది కోసం పని చేస్తున్నాను. ప్రపంచవార్తలన్నీ మా చేతుల




మీదుగా ప్రజలు తిరుగుతాయి. ఒక్క క్షణంకూడా ఖాళీగా ఉండడు. పదిమందికీ పనికొచ్చే పని చేస్తున్నానన్న తృప్తిగా ఉన్నాడు."

"పాకీపనికూడా పదిమందికీ పనికొచ్చేదే!"

అతనికి పౌరుషం తెప్పించటానికని ఆమె ఆ మాటన్నది. కాని ఆప్రయోజనం నెరవేరలేదు.

"నేనందుకే అర్హుణ్ణయితే ఆ పని చెయ్యటంకూడా ఆనందంగానే వుంటుంది. చాలామంది పాకీవాళ్ళకుండే మనశ్శాంతి కోటీశ్వరులకు కూడా ఉండదు. ఐతే పాకీవాళ్ళేమిటి, కార్మికులేమిటి, పొలాలలో పనిచేసేవాళ్ళేమిటి? అందరూ పదిమందికీ పనికివచ్చే పని చేసేవాళ్ళే. డబ్బు సంపాదించుకునేది స్మగ్లర్లూ, పెట్టుబడిదార్లూనూ. లోకానికి అవసరమైన పని చేసేవాళ్ళు తమకు జరిగిన అన్యాయం తెలుసుకుని, అశాంతికి గురైననాడు మనమంతా వణికిపోతాం. ఏమీ చెయ్యలేము...ఇదంతా ఇప్పుడెందుకు మాట్లాడుతున్నాం? మీ నాన్నగారు మన పెళ్ళిమాట ప్రస్తావించినప్పుడు నేను నా నియమాలు చెప్పి, వాటిని పాటిస్తే నిన్ను పెళ్ళాడటం నాకు సమ్మతమే ననీ. నీ అభిప్రాయంకూడా తెలుసుకుని చెప్పమనీ అన్నాను. ఇదివరకు నాకు కొన్ని సంబంధాలు వచ్చాయి. కాని ఎప్పుడూ నేను సరే ననలేదు. నిన్ను మొట్టమొదట చూసినప్పటి నుంచీ నాకు చాలా మంచి ఇంప్రెషన్ కలిగింది. అందుకు కారణం కొంత వరకు

మీ నాన్నగారంటే నాకభిమానం ఉండటం కావచ్చు. ఆయనలాంటి మనుషులు చాలా అరుదు. అచ్చంగా పిల్ల నచ్చి పెళ్ళిచేసుకునేదానికన్న పిల్ల మెచ్చువాళ్ళుకూడా నచ్చి చేసుకునే పెళ్ళి ముడి మరింత గట్టిగా వుంటుందికదూ?"

ఇందిర చాలాసేపు అతని మాటలు తీర్చి ఆలోచించుకుంటున్నట్లు కనబడింది.

"నాలో మీరేం చూశారు? ఏం నచ్చింది?" అన్నదామె చివరికి.

"మీ నాన్నగారి పోలికలు." అన్నాడు గోపాలం.

"అందుకే మీరు తప్పుదారిన ఉన్నారు. మా నాన్న అంటే నాకు మీకున్నంత గొప్ప అభిప్రాయం లేదు. మా నాన్న ఇంటి విషయాలు కాస్త పట్టించుకున్నట్టయితే మేం అందరం ఇంకాస్త సుఖంగా బతికేవాళ్ళం. ఆయన లోకసేవన్నీ పనికిమాలిన ఆలోచనలు. ఆయనతో మా అమ్మకు ఒక్క పూటకూడా మనశ్శాంతి లేదు."


గోపాలం ఆశ్చర్యపడుతూ వినసాగాడు.

"అంటే తండ్రిగానూ, భర్తగానూ ఆయన పెద్ద ఫెయిల్యూరన్నమాట! నేను కలలోకూడా ఎక్స్పెక్ట్ చెయ్యలేదు."

"మీరు ఎక్స్పెక్ట్ చెయ్యరు. మీరు మనుష్యుల్ని అంచనా కట్టలేరు. అందుకే నా విషయంలోకూడా పొరపాటు పడ్డారు. నేను పైకి ఎలా కనిపిస్తానో తెలీదు. కాని నాకు ప్రపంచంలో వున్న అన్ని సుఖాలూ కావాలి. బట్టలషాపుల్లోకి వెళ్ళినప్పుడు ఖరీదైన చీరెలూ, అందమైన చీరెలూ చూస్తాను. అవి నాకోసం కాదనిపించినప్పుడు ఒళ్ళు మండి పోతుంది. రోడ్డుమీద మంచిమంచి కార్లలో పోతున్నవాళ్ళనుచూసి, వాళ్ళంతా నాకన్నా ఏం పొడిచేశా రనుకుంటాను. ఒక మంచి ఇల్లూ, అందమైన తోటా, ఇంట్లో వాష్ బేసిన్లూ, తళతళలాడే మొజాయిక్ ఫ్లోర్, అద్దాలూ, వాటర్ హీటర్లూ గల బాత్‌రూములూ, ఫ్రిజిడేర్లూ, ఇంటికి మంచి స్టైలు పెయింట్లూ మంచి అప్‌టుడేట్ ఫర్నిచరూ, ఫస్ట్‌క్లాస్ వార్డురోబులూ, పిక్‌నిక్‌లూ, పార్టీలూ... ఇవన్నీ నా కెందుకుండకూడ దనిపిస్తుంది. నేను ఉద్యోగం చేసి ఇవన్నీ సంపాదించటం కష్టం. పెళ్ళిద్వారా సంపాదించాలసిందే. అన్నీ వస్తాయా అనవచ్చు. సాధ్యమైనన్ని సమకూరేటట్టు చూసుకుంటాను గాని, మా నాన్నలాగా గుడిసెల్లోనే నిజమైన సుఖం ఉందనుకోను. మీరు చెప్పారే, పాకీవాళ్ళ మనశ్శాంతి? అది నాకు లేదు, వద్దుకూడా!"

గోపాలం చాలాసేపు సముద్రంకేసి చూసి, "ఇంక బయలుదేరుదామా?" అన్నాడు.

అతను ఆమెను టాక్సీలో ఇంటిదగ్గిర దింపాడు. దారిలో వాళ్ళేమీ మాట్లాడుకో లేదు.



టాక్సీ వచ్చిచేరేసరికి నాగభూషణం ఇంటిముందు నిలబడి ఎవరితోనో మాట్లాడుతున్నాడు. ఇందిరకు ఆ మొహం ఎక్కడో చూసినట్టున్నది. అవును జానకి పెళ్ళప్పుడు చూసింది. ఎవరో బంధువే.

టాక్సీలో ఎవరొచ్చారా అని ఆశ్చర్యంగా చూస్తున్న నాగభూషణం మొట్టమొదట డ్రైవరుపక్కన కూర్చున్న గోపాలాన్ని గుర్తించాడు. వెనకసీటులో నుంచి తన కూతురు దిగటం చూసి, "నువ్వేమిటే?" అన్నాడు. గోపాలమూ, ఇందిరా కలిసి టాక్సీలో రావటం ఆయనకు శుభసూచకంగానే కనబడింది.

గోపాలం ఇందిరను క్షణంలో ఒప్పించేసి ఉంటాడు అనిపించింది. ఏమీ తెలీదు. తెలిస్తే గోపాలం లాటి సంబంధాన్ని అంత తేలిగ్గా తీసి పారేస్తుందా?

"నీ కూతురు కాదుట్రా, నాగన్నా? ఆ అబ్బాయెవరూ?" అన్నాడు పక్కనే ఉన్న చలపతి.

"అవును. మా ఇందిర ... కాలేజీ నుంచేనటే రావటం?" అన్నాడు నాగభూషణం. ఇందిర చేతిలో ఉన్న కట్టెడు పుస్తకాలూ ఆ సంగతి స్పష్టం చేస్తున్నాయి.

సముద్రపు గాలికి ఇందిర జుట్టంతా రేగి ఉన్నది. ఇందిర మొహం ముడుచుకుని ఉన్నది. దీన్ని బట్టీ, పక్కన ఒక అందమైన కుర్రాడుండటాన్ని బట్టీ ఏమైనా గ్రహించటానికి వీలున్నదా అని చలపతి చూస్తున్నాడు. పట్నంలో బతుకు, అందులోనూ కాలేజీ చదువు.

నియమాలూ, నిగ్రహాలూ ఉండవు; సర్వం జగన్నాథం.

నాగభూషణాన్ని చూసి టాక్సీలోంచి దిగిన గోపాలం, "నేను మా ఇంటికి పోతానండీ," అన్నాడు టాక్సీకేసి తిరుగుతూ.

"అదేమిటోయ్. ఇంకా గట్టిగా పొద్దుకనుగూడాలేదు; పోవచ్చులే. మా ఆవిడ కాఫీ యిచ్చే మూడ్‌లో ఉంది," అన్నాడు నాగభూషణం.

"అయితే నే వెళ్ళొస్తారా. మా శంకరం ఒడుక్కి మీరంతా రావాలి.

"ఇక్కడికి తిరపతి దగ్గిరేగా? విశేషంగా బస్సులున్నాయాయె." అన్నాడు చలపతి.

"నీకుమాత్రమేంతొందరొచ్చిందోయ్?"

"కాదులే. స్టేషనుకు దగ్గిరవి వెధవలాట్టిలో దిగాం. తిన్నగా మీ ఇంటికే వచ్చి పడదామంటె నువ్వుచూడు ఎంత పెద్ద భవంతి కట్టించావో! నువ్వేం తెలివితక్కువ వాడివట్రా? నాబోటి వాళ్ళు వచ్చిపడకుండా ప్లానువేసి మరీ కట్టించావులే ఇల్లు! వస్తా... ఏమే అమ్మాయ్. శంకరం వడుగు వచ్చే మాసంలో. తిరుపతిలో. మీ ఆమ్మా నాన్నా బద్ధకిస్తే నువ్వయినా బయలుదేరి దీయాలి. తెలిసిందా? వడుగు వంకపెట్టి బోలెడంత పుణ్యంకూడా సంపాదించుకోవచ్చు."

ఈలోపుగా గోపాలం టాక్సీవాడికి డబ్బులిచ్చి పంపేశాడు

"టాక్సీలోపోతే బాగుండేదా?" అన్నాడు చలపతి.

"ఎందకురా డబ్బుదండగ? నాలు గడుగులు వేస్తే స్టేషను. లోకల్ ట్రయిన్‌లో పదినిమిషాల్లో పోవచ్చు." అన్నాడు నాగభూషణం.

"పోనీ, పెద్దవాడివి చెబుతూంటే ఎందు క్కాదనాలి," అంటూ చలపతి బయలుదేరాడు.

"లోపలికి పదండి," అంటూ నాగభూషణం ఇందిరకేసీ, గోపాలంకేసి చూశాడు. అంతసేపూ వాళ్ళిద్దరూ వేరు వేరు ప్రపంచాల్లో ఉన్నట్టు కనబడ్డారు గాని, ఏవిషయంగురించీ సమంగా ఆలోచిస్తున్నవాళ్ళలాగా లేరు.

లోపలికి వెళ్ళిన తరవాత ఇది మరింత కొట్టవచ్చినట్టు కనిపించింది.

దొడ్డివేపునుంచి కడిగిన కప్పులతో లోపలకు వస్తున్న సుభద్ర తన్న భర్తను చూడగానే, "అసలావిడ యింతకాలం బతకటమే ఆశ్చర్యంలెండి. ఈ శ్రావణ బాద్రపదాల్లో ఏటా ఆవిడకి ప్రాణం మీదికొస్తూనే వుండేట, మూడేళ్ళ వరసగా చచ్చిబతికింది. ఈసారితో రుణం తీరిపోయింది. డబ్బంటేమాత్రం ఆయుర్దాయం కొనగలమా? అదేమన్నా కూరగాయలా?" అన్నది.

"ఎట్లా చెప్పగలం? రఘురామయ్య డబ్బుతో ఆవిడకు మూడేళ్ళ ఆయుర్దాయం కొన్నట్టే కనబడుతుంది. మన వంటి సంసారాల్లో అయితే ఆవిడ ఏనాడో పోయిఉండేదిట. యాభై వేలు ఖర్చుచేశాట్ట! యాభై వేలు! రెండు తరాల వాళ్ళు కాలిమీద కాలేసుకూచుని హాయిగా తినొచ్చు!" అన్నాడు నాగభూషణం.

"ఎవరమ్మా పోయిందీ?" అన్నది ఇందిర.

ఆ గాంధీటోపీ రఘురామయ్య పెళ్లాం కనకమ్మే! కుటుంబరావు కూతురి పెళ్ళిలో మనం చూడలా?"

"కనకమ్మ గొడవ వెవడిక్కావాలి గాని, కాస్త వీళ్ళద్దరికీ కాఫీ ఇవ్వగలవేమో చూడు." అన్నాడు నాగభూషణం.

సన్నగా, అస్పష్టంగా ఇందిర తలలో ఒక అల బయలుదేరింది. అది ఆమె జీవితంలో ఒక పెద్ద తుఫాను వస్తున్నదనటానికి తొలి సూచన.

"రఘురామయ్య పెళ్ళాం పోయిందా? ఆ ముసలాడి కెన్నేళ్ళు? ఏ సలభై అయిదో ఉండవూ? తనతండ్రి వయసు వాడేనని ఎవరో అంచనా వేసినట్టు జ్ఞాపకం. మళ్ళీ పెళ్ళిచేసుకుంటాడేమో— చిన్నపిల్ల దొరికితే. మనిషిలో ఆకర్షణ ఉన్నది. టోపీ పెట్టుకున్నప్పుడు అగ్రదేశ నాయకులలో ఒకడల్లే ఉంటాడు మొహాన ముడతలుకూడా లేవు. కట్నా



లడగడు ... వయసుమీరిన మొగుళ్లు చిన్నపెళ్ళాలను పువ్వుల్లో పెట్టి పూజిస్తారుట. డబ్బు! ఎంత డబ్బు! కాస్తా కూస్తా! ఆ రోగిష్టిపెళ్ళాం వైద్యం కోసం యాభై వేలు ఖర్చుచేశాడంటే___

"నిన్నేనే! ఒకసారి రా! పేరంటం వచ్చినదానల్లే అలా కూర్చున్నావేం?" అని తల్లి కేక వినపడినదాకా ఇందిర ఈ లోకంలో లేదు.

"ఏమిటోయ్, గోపాలం? ఇందు ఏమంటుంది?" అన్నాడు నాగభూషణం.

ఏమీ ఆశలేనట్టు గోపాలం తలా చెయ్యీ ఆడించాడు.

నాగభూషణం బయటికిపోదాం పద మన్నట్టు తలవిసిరి వరండాలోకి దారి తీశాడు.

"మీరు మీ అమ్మాయి ఉద్దేశం సరిగా తెలుసుకోలేదు. అమ్మాయి నావంటివాణ్ణి చేసుకోదు." అన్నాడు గోపాలం.

"అదేం తీపురం? చేసుకోనంటే మెడలువంచి చేస్తాం! తన సుఖం తనకే తెలియనప్పు డేంచెయ్యాలి?"

"తనసుఖం తనకు తెలియకేంలెండి? బాగానే తెలుసు. దాన్ని గురించే ఆలోచిస్తున్నదికూడా."

"నీకు తెలీదు. గోపాలం దాన్ని ఎట్లాగైనా దారిలోపెట్టాలి. అది బుద్ధిలేక నిన్ను వద్దంటేమాత్రం నేను చూస్తూ ఎట్లా ఊరుకోనూ? పెళ్ళిచేసేభారం నామీద ఉన్నదే! ఇందులో లౌక్యం దేనికీ? నీవంటి సంబంధం నేను మళ్ళీ తీసుకురాలేను. అటువంటి సంబంధాన్ని అది అకారణంగా తీసిపారేస్తే నేను సతేనన్నాననుకో. అందరూ నాకు గడ్డి పెట్టరూ? దాని అభ్యంతరం ఏమిటిటా? ఏమన్నా చెప్పిందా?"

"చాలా చెప్పింది. అవంతా ఇప్పుడెందుకులెండి?"

"పోనీ దాన్నే అడుగుతాను. నువ్వన్నట్టు అది సులభంగా దొరికిన సంబంధమని అలుసుగా చూస్తున్నదేమో! నాలుగువేలు కట్నంపోస్తున్నానని అబద్ధమైనా ఆడతాను. అంతేగాని దాని ఆట సాగనివ్వను."

గోపాలం ఆనందరహితంగా చిన్న నవ్వునవ్వి. "మీ రీ విషయాన్ని ఇంతతో పోనివ్వండి. ఈ పెళ్ళి జరగదు ఇప్పుడు నాకు మీ ఇందిరని చేసుకోవాలన్న కోరిక ఏమీలేదు నేను బయలుదేరతాను. పొద్దుపోతున్నది." అంటూ బయలుదేరాడు.

నాగభూషణం పెద్ద షాక్ తిన్నాడు. ఆయనకు కాఫీ మాటకూడా జ్ఞాపకం రాలేదు. గోపాలం వెళ్ళిన అరనిమిషం పాటు అట్లాగే కొయ్యబారి నిలబడిపోయాడు.

"ఎక్కడున్నారు? కాఫీ చల్లారిపోతున్నది అతన్ని రమ్మనండి. అని సుభద్ర లోపలినుంచి కేకపెట్టింది.

నాగభూషణం జవాబు చెప్పకుండా వెళ్ళాడు.

"అతనేడీ ?" అన్నది సుభద్ర.

"వెళ్ళాడు." అన్నాడు నాగభూషణం ఎవరిమీది కోపాన్నో అణుచుకుం టున్నట్టు కనబడుతూ.

"కాఫీ ?"

"అవతల పారబొయ్యి నీ వెధవ కాఫీ. అసలుకే ఎసరొచ్చింది ? ... సువ్వతనితో ఏమన్నావే ?" అన్నాడు నాగభూషణం కూతురుకేసి తిరిగి.

"ఏమన్నానూ ?" అన్నది ఇందిర కాళీకప్పు కిందపెడుతూ.

"ఏమీ అనకపోతే నిన్ను చేసుకో వటం తనకిష్టంలేదని ఎందుకంటాడూ?"

ఈమాట ఇందిరకు చీమకుట్టినట్టు కూడాలేదు.

"నువు చెబుతావే జోక్ ? 'వాళ్ళివ్వ మన్నారు. మేం చేసుకో మన్నారు.' అని. నేను చేసుకోనని ముందే అన్నాను గద. దాని మీదట అతను పౌరుషం కొద్దీ తనకూ డా ఇష్టం లేదని ఉంటాడు "

"అతన్ని చేసుకో నని చెప్పేశావా?"

"ఆ "

"నీ అంతట నువ్వే ? మాకు భాధ్య తేమీ విడవకుండానే ?"

"చేసుకుంటావా, లేదా అని అడిగితే ఏం చెయ్యాలి, నాన్నా ?"

"నన్నడగమనకూడదూ ?"

"నాతో మాట్లాడమనీ నువ్వే చెప్పా వుటగా ?"

"నీ అభ్యంతర మేమిటో కనుక్కోమ్మ న్నాను. ఇప్పటికైనా నువు నీ అభ్యం తర మేమిటో నాకు చెప్పావా ? నీ పెళ్ళి బరువు నామీద ఉన్నదని నీ కసలు జ్ఞాపకం ఉన్నదా ?"

"నాకు నచ్చా లన్నది ముఖ్యం కాక పోతే నీయిష్టమొచ్చిన సంబంధం తెచ్చి బలవంతాన పెళ్ళిచెయ్యి. లేదూ, నా పెళ్ళిమాట నాకే వదిలెయ్యి. నువ్వేమీ భారం మొయ్యకు."

ఇందిర వైఖరి నాగభూషణానికి దారుణంగా కనిపించింది.

"అంతదాకా వచ్చిందా వ్యవహారం?"

"ఇప్పు డేమన్నాను, నాన్నా ? నీకు నచ్చిన సంబంధం నాకు నచ్చకపోయి నప్పు డేం చెయ్యాలి ? నేను ఇష్టంలేని సంబంధమన్నా చేసుకోవాలి. లేదా నా పెళ్ళి గురించి నువు బాధపడటమైనా మానుకోవాలి. నే నన్న దాంలో తప్పే మిటీ ?"

"నువూ నేనూ చెరో ప్రపంచం నుంచీ వచ్చి నిన్ననే కలుసుకో లేదుగా? గోపాలం వంటి మొగుడు దొరకటం పూర్తిగా పూర్వజన్మ సుకృతమే నని నేను నమ్మాను – ఇందులో అతిశ యోక్తి ఏమీలేదు అటువంటి వాణ్ణి నువు చచ్చు సంబంధం కింద తీసి పారే శావు దానికి గొప్ప కారణం ఏదో

ఉండాలిగా ? నాకు చెబితే అర్థం కాకపో తుందా ? అంత గుంటనా ? నాకు చెప్పకపోగా, నా దగ్గిర దాచిన దేదో అతనికి చెప్పి, నువ్వంటే అతనికి అసహ్యం కూడా పుట్టించావు। ఇదంతా ఏమిటి ? నీ ప్రవర్తన నీకేమైనా బాగుందా ? అదేమి టంటే నీ పెళ్ళి నేను చెయ్యక్కర్లే దంటావు ? అంతేనా ? నీకంత తిండీ, బట్టా సప్లయి చెయ్యా టానికైనా నాకు హక్కుందా ? అది కూడా లేదా ?"

"ఎందుకు నాన్నా, ఉత్త పుణ్యానికిన్ని మాట లంటావు. నాకీ పెళ్ళి ఇష్టం లేదని నీకు మొదటనే చెప్పానే ? ఏమిటి దాచానంటావు ?"

"ఎందుకని ! దేనికని నీకీ పెళ్ళి ఇష్టంలేదు ! నాకు మంచి సంబంధంగా కనపడుతున్నది నీ కింత తేలికగా ఎందుక్కనపడుతున్నది ! అదీ నా క్కావలిసింది. ఇన్ని మాటలు చెబుతున్నావు. ఆ మాట బయటపెట్టావా ?" అన్నాడు నాగభూషణం కప్పెగిరిపోయేటట్టు అరిచి, ఎడమ అరిచేతిమీద కుడిపిడికిలితో గుద్దుతూ.

"ఇష్టంలేక పోవటానికి వేరే కారణం ఉండాలా ? నాకా గోపాలమంటే ఏమీ గ్లామర్ లేదు. నా యిష్టం పైకి చెప్పుకునే స్వతంత్రం ఉన్నదనుకుని చెప్పాను. బలవంతాన పెళ్ళి చేస్తామంటే నేను వద్దన్నానా ? ఇప్పుడుకూడా అనటం లేదే ?"


"అతను చేసుకోనన్నట్టు తెలిసిన మీదట కదా ఇప్పు డంటున్నావు? నిన్ను బలవంతం చెయ్యని వాణ్ణి గోపాలన్ని ఎక్కడ బలవంతం చెయ్యనూ ?"

"గోపాలం కాకపోతే ఇంకోరు. ఈ సారి నన్నడక్కండి. మీకూ, అమ్మకూ నచ్చిన సంబంధం చూసి చేసెయ్యండి. మాట్లాడితే, వొట్టు !" అన్నది ఇందిర.

సుభద్ర కలిగించుకుని, "పోనిస్తురూ, దానికంత యిష్టంలేదో అంటుంటే ఎందుకు రాచి రంపాన పెడతారూ ? అతనుకూడా వద్దనేశాడు గనక ఇక దాన్ని గురించి చర్చించటమే అనవసరం. నా పెళ్ళికి ముందు మిమ్మల్ని గురించి మా అమ్మ తెగగునిసింది. మా నాన్న ఊన్నడిగాడు. నేను చేసుకుంటా నన్నా. 'పిల్లది సరే నన్నది, ఇక నువు నోరు మూసుకో !' అనేశాడు మా నాన్న. పిల్ల ఇష్టం ముఖ్యం." అన్నది

"తరవాత నీగ తేమయిందో చూడు. పెళ్ళికి ముందు మీ అమ్మ గునిసింది, పెళ్ళి అయిన్నాటి న్నుంచీ నువు గునుస్తున్నావు. మీ అమ్మ గునుపు పాటించి ఉంటే ఎంత బాగుండేది !" అన్నాడు నాగభూషణం.

జీవిత సమస్యల లోతుల్లోకి పోవటం నాగభూషణం మనస్తత్వానికి ఏమీ సరి



పడదు. ఈ తర్జన భర్జనలతో ఆయనకు తలనొప్పి వచ్చేసింది. గోపాలంకోసం చేసిన కాఫీ లోటాలో చప్పచల్లారిపోయి ఉన్నది. నాగభూషణం దాన్ని ఒక్క గుక్కలో తాగేసి చల్లగాలికి బయటికి వెళ్లాడు.

ఆరాత్రి నిద్ర పొయ్యేదాకా ఇందిర రఘురామయ్యను పెళ్ళాడటం గురించే కలలు కన్నది. కావలిసినంత డబ్బు! పెద్దఇల్లు! కార్లు! హోదా! ముసలివాడి పడుచుపెళ్లాన్ని లోకం సహృదయతతో చూస్తుంది. కొండమీది కోతి కావలిస్తే దిగివస్తుంది. తను పదిమంది ఉన్నచోటకి వెళితే అందరూ బ్రహ్మరధం పడతారు— కనకమ్మకు పట్టినట్టు! అదీ జీవితం అట్లా బతకాలి, అది తనకు అసాధ్యమా!

కాదూ! కాకూడదు! కాని సాధన మేమిటి? ఆలోచించాలి. దాన్నిగురించి తప్ప ఇంకేమీ ఆలోచించకూడదు. ఇప్పుడే గదా కనకమ్మ వచ్చింది? ఇంతలో ముసలాడు పెళ్ళాడదు. కాని ప్రయత్నాలు జరక్కపోవు. ఎందరూ తన తండ్రిలాటివాళ్ళే ఉంటారా? రఘు రామయ్యకు తన కూతుళ్ళనంటగట్టాలని ఎన్నివందలమంది ఆలోచిస్తూ ఉంటారో! ఎన్ని ఉచ్చులు పన్నుతూ ఉంటారో! తనచేతికి గడ్డిపోచంత ఆధారంకూడా ఇంకా దొరకలేదు. తండ్రితో చెప్పి లాభంలేదు ఆయన సహాయమేఉంటే ఇది అవలీలగా జరిగే పనే! కాని ఆయన సహకరించడు. ఇంకెవరి సహాయమన్నా చూడాలి...

## 6

చలపతికొడుకు ఉపనయనానికి పోదాము వి నాగభూషణంగాని, సుభద్రగాని అనుకోలేదు కాని. సుభద్ర అన్నట్టు జరగవలిసి ఉన్నది జరక్కమానుతుందా? అనుకోకుండా — అంటే సుభద్ర అనుకోకుండా — నాగభూషణానికి భీమాకార్పొరేషన్‌లో మళ్ళీ ఉద్యోగమిచ్చారు

"కొండకు వెళ్ళినట్టూ అవుతుంది. పన్లోపని మన వెధవలిద్దరికీ జంధ్యాలు వేసేయిద్దాం," అన్నది సుభద్ర.

తను ఏసూచనచేసినా మొగుడు ఎదగొట్టతాడనే భయం సుభద్రకు గట్టిగా ఉన్నది. అందుచేత, నాగభూషణం ఊపిరి తీసుకునేలోపుగా.. ఇలా చెయ్యటంలో గల ఉసుళ్ళన్నీ గబగబా ఏకరువు పెట్టింది. ఎక్కడికన్నా వెళ్ళి ఎన్నేళ్ళయిందో — ఆ కుటుంబరావు కూతురు పెళ్ళికే గా వెళ్ళింది? రెండేళ్ళు — రెండేళ్ళ మూడ్జెల్లు. మళ్ళీ మాట్లాడితే. రానుపోనుచార్జీలు ఎలాగూ పెట్టుకునేవే. పాపం. చలపతిగారు అంతగాచెప్పి మరీ వెళ్ళినప్పుడు వెళ్ళకుండా ఉండటం ఏమన్నా బాగుంటుందీ? పోతే నడక ఖర్చు లేపాటి? ఈ వడుగులు మళ్ళీ వేరే చేస్తే బోలెడంతఖర్చు. పదిమందినీ పిలవాలి. ఇప్పుడైతే, ముందనుకోకుండా చేసేశామనవచ్చు!

తను మొదటనే — తన మనసులో — ఆమోదించినదానికి తనపెళ్ళాం ఇంత కాన్యావాసం గెందుకు చేస్తున్నదో తెలీక నాగభూషణం చిరాకుపడి. "సరేలే! సోదంతా దేనికి?" అన్నాడు.

తన కంఠశోషేగాని ఆ మానవుడికి తనమాట ఒక్కటీ తలకెక్కలేదని సుభద్ర భయపడింది...

వాళ్ళు తిరపతికి బయలుదేరిననాడు జోరున వాన.

ఆఖరుక్షణంలో ఇందిర పేచీ పెట్టింది — "ఎవరికో వడుగైతే ఈ వానలోపడి తిరపతి వెళ్ళడమేమిటి? నేను రాను," అన్నది.

"వడుగెవరికో ఏమిటి? సీతమ్మోళ్ళ కుర్రాడూనూ," అన్నది తల్లి.

"మీరు వెళ్ళరండి."

"నువేమవుతావు?"

"ఏమీకాను. ఇంట్లోనే ఉంటాను."

సుభద్ర మొగుడికి అప్పీలుచేస్తూ, "చూశారా? అదొక్కతె ఇంట్లో ఒక్కతే ఉంటుందిట! రాగారాగా రాజుగారిగుర్రం గాడిదవుతున్నదిట!" అన్నది.

నిజానికి ఇందిర మానసికంగా నిర్జనమైన ఎడారిమధ్య ఉన్నదానిలాగా ఉన్నది ఆమె ఆలోచనలకూ, చుట్టూ ఉన్న మనుషులకూ, వారి మాటలకూ, భావాలకూ, సమస్యలకూ, వ్యధలకూ ఎక్కడా పొంతనలేదు ఆమె సమస్య తీరటానికి వీళ్ళెవరూ సహాయపడలేరు, అందుకు సమర్థులు కారు. తనకూ, ఆ



రఘురామయ్యకూ పెళ్ళి అయేదారి ఏది? ఎవరు సహాయం చేస్తారు. కృష్ణుణ్ణి పెళ్ళాడబోయిన రుక్మిణికి వచ్చిన సమస్యే ఇందిరకూ వచ్చింది. రుక్మిణి సందేశం పట్టుకుపోవటాని కొక బ్రాహ్మణుడు దొరికాడు. ఆ బ్రాహ్మణ్ణి పట్టుకోవటానికి రుక్మిణి ఎన్నిపాట్లు పడిందో పురాణంలో చెప్పలేదు. కాని తన అనుభవాన్నిబట్టి రుక్మిణి నానాయాతనలూ పడిఉండాలి. లేదా తనకన్న చాలా సమర్థురాలైనా అయి ఉండాలి

ఈనాడు సందేశం పంపాలంటే బ్రాహ్మ డవసరంలేదు కార్డుముక్క చాలు ఆ కార్డుముక్క ఎవరు రాయాలి? "నాకు మిమ్మల్ని పెళ్ళాడాలని ఉంది." అని తానేరాసి సంతకం పెడితే ఆ రఘురామయ్య తనను గురించి ఏమనుకుంటాడు? ఆకాశరామన్న పేర ఉత్తరం రాస్తే పని అవుతుందా? ఏ పేర రాయాలన్నా రఘురామయ్య ఎడ్రసేమిటి? ఎవరినడిగితే చెబుతారు? నీకు రఘురామయ్య ఎడ్రస్సుతో ఏంపని?" అని వాళ్ళడిగితే ఏం చెప్పాలి?

ఇటువంటి సమస్యలతో సతమతమవుతూ, ఆశ పైకి తన్నినప్పుడు సుఖమయమైన కలలు కంటూ ప్రశ్నలు వంకరగా తలలుపైకెత్తినప్పుడు నిరాశతో కుంగిపోతూ ఉన్న ఇందిరకు ప్రతీదీ చిరాకు కలిగిస్తున్నది. ఒక్కొకసారి అందరిని తన్నాలనిపిస్తుంది దానికి ప్రత్యామ్నాయంగా ఎవరేది చెప్పినా కాదంటూ కూర్చుని కొంత అర్థంలేని తృప్తి చెందుతుంది.

ఇప్పుడామెకు అటువంటి మూడ్ పట్టుకున్నది. తిరపతికి రానని మొరా

యిస్తే తన వైఫల్యానికి కంతికూ విరుగు డవుతుందని!

కూతురి మకురుతనాన్ని పదనిమి షాలు భరించిన మీదట నాగభూషణం అగ్నిపర్వతంలా పేలాడు. ఇందిరను చడామడా తిట్టేశాడు. ఇందిర ఒక చిన్న శోకం పెట్టేసింది. ఆ కన్నీటితో దయ్యం కాస్త దిగిపోయినట్టయింది.

వాన కాస్త తగ్గగానే, ఉన్న సామాన్లు తలా ఒకటీ పట్టుకుని స్టేషనుకు వెళ్ళి పడ్డారు. అందరూ తడిశారు. వణుకుతూ, తుమ్ముతూ తిప్పలు పడటం సరదాగా ఉన్నది. అసలు ప్రయాణమే వాళ్ళకు సరదా ఇచ్చింది. ఇందిర చిరచిర వానలు పడటంతో మరింత అయింది.

లోకల్ ట్రయిన్‌లో వాళ్ళు పార్కు చేరుకునే సరికి వాన పూర్తిగా వెలిసి పోయింది. అక్కడి రోడ్డుమీద పొడి మరకలు కూడా ఉన్నాయి.

ఉపనయనం ఎగువ తిరుపతిలో ఏర్పాటు చేశారు. దళపతి వాళ్ళ బసలోనే నాగభూషణం కుటుంబం కూడా దిగింది. నాగభూషణం కొడుకు కొత్తగా ఉపనయనం జరగటానికి నిశ్చయమైం దని తెలిసి దళపతి అంతులేని సంతోషం పొందాడు. వయసు వచ్చిన వాళ్ళలో కూడా సామూహిక భావా లుంటాయి. ఎంత పుణ్యకార్యమైనా, ఎంత పాపకార్యమైనా ఒంటరిగా చేసిం దానికన్న పదిమందితో కలిసి చెయ్య టంలో ఏదో ఆనందం ఉన్నది. అందు చేతనే అతి సామాన్యప్రజలు ఏకమై విప్లవాలు సాధించగలుగుతారు; మామూలు హత్యలకన్న అనేకవేల రెట్లుండే హత్యాకాండ యుద్ధంలో సాధ్యమవుతుంది.

"వెరీగుడ్! ఫైన్! ఎక్సెలెంట్! నాగుడు బడుద్దాయికి పంచశిఖలు పెట్టేద్దాం!" అని దళపతి అన్నప్పుడు అతను కలిసివచ్చే ఖర్చుగురించే ఆలో చించనే లేదు.

"అన్నట్టు మనకు ఒక అనుకోని వీఐపీ గెస్టువోయ్!" అన్నాడు దళపతి.

"ఆదెవరు?" అన్నాడు నాగ భూషణం.

"రఘురామయ్య ఇక్కడే ఉన్నాడు. మొన్న వచ్చాట్ట. పబ్లిక్ వర్క్స్ మంత్రితో వచ్చినట్టుంది. కనిపించాడు. వడుగుభోజనానికి రమ్మన్నా. వీలుంటే వస్తానన్నాడు."

"సరే. వస్తేరానీ." అన్నాడు నాగభూషణం ముభావంగా.

కాని ఆమాట ఇందిరగుండె పందెపు గుర్రంలాగా దౌడుతీసింది. హంసద్వారా నలుణ్ణిగురించి విన్న దమయంతిలాగా అయిపోయిందామె. ఇది తనకు శుభశకునమా? దేవుడు తన కోర్కె చాటిస్తున్నాడు: "నీవు కోరినభర్తను

నీకు దగ్గరగా తెచ్చాను. చేతనైతే నీ కర్తవ్యం నీవు నెరవేర్చుకో" అంటున్నాడు. కాని ఏం చెయ్యగలదు? ఆ రఘురామయ్య ఎదటనిలబడినా తను చెయ్యగలిగిందేమీ ఉన్నట్టు కనబడలేదు. తన అశక్తత తలచుకుని ఇందిర మండిపోయింది.

వెధవసమాజం – మనిషికి స్వేచ్ఛ లేదు – మనసులోమాట బయటికి అనగూడదు – కావాలన్న చోటుకి వెళ్ళాలంటే సంజాయిషీ చెప్పాలి! తిన్నగా రఘురామయ్యఉండే కాలేజీకి వెళ్ళి, "ఏమండి, మీరు మళ్ళీ పెళ్ళాడే పక్షంలో చేసుకునేటందుకు నే మన్నాను. మిమ్మల్ని చేసుకోవాలని తహతహలాడిపోతున్నాను. మావాళ్ళు ఈ పెళ్ళికి ఒప్పుకపోవచ్చు. మీరు మీ అనంతమైన శక్తిసామర్థ్యాలతో మా వాళ్ళ నోరు మూసి, నన్ను పెళ్ళాడి తీసుకుపొండి." అని చెప్పటానికుంటే ఎంత బాగుండును! మన దిక్కుమాలిన సమాజం అడుగడుగునా అడ్డంకులు పెట్టింది.

ఇందిర అజ్ఞానంచేత సమాజాన్ని నిందించింది. కాని సమాజం ఈవిధంగా లేకపోతే ఇందిర వయసుపిల్ల తన తండ్రి వయసువాణ్ణి, ప్రేమించినా ప్రేమించకుండా పెళ్ళాడటానికి తహతహలాడదు.

మధ్యాహ్నం పదకొండింటికి పురోహితుడు వచ్చాడు. పొగపెట్టాడు రెండు గంటలకల్లా తంతు పూర్తి అయింది. వత్సలు పడక పెళ్ళికొడుకుటుగా మూతిపోయారు.

భోజనాలకు అప్పటికే వేళమించింది రఘురామయ్య రాలేదు. ఆయనకోసం ఆగటమా, భోంచెయ్యటమా?

"ఆయనింకా మన భోజనంకోసం కనిపెట్టుకుని ఉన్నాడా? భోంచేసేద్దాం!" అన్నాడు నాగభూషణం.

నాలుగు దాటాక రఘురామయ్యా పెద్ద కారులో వచ్చాడు.

"వడుక్కు రాలేక పోతిని. వెంకటేశ్వర యూనివర్శిటీకి వెళ్ళవలసి అక్కడినుంచే వస్తున్నాను." అంటూ ఆయన తన చేతికి తగిలించి ఉన్న పూలమాల కొంచెంగా పైకెత్తాడు.

ఇందిర ధైర్యంగా, "మగవాళ్ళకు పూలెందుకూ? మాకిచ్చెయండి, తల్లో పెట్టుకుంటాం," అన్నది, చెయ్యిచాస్తూ.

రఘురామయ్య మొట్టమొదటిసారిగా ఇందిరకేసి పరీక్షగా చూసి నవ్వుతూ, మాలతీసి ఇందిర మెడలో వేశాడు చలపతి ఒక్కడే చప్పట్లు కొట్టాడు. అతను ఇందిరను రఘురామయ్యకు పరిచయం చేస్తూ! నాగభూషణం కూతురు. మీరు దాని మెళ్ళో దండ వేసేశారు. మాదుమనువని మరెవరూ దాన్ని పెళ్ళాడరు!" అన్నాడు. తన హాస్యానికి తానే విరగబడి నవ్వుతూ

"నేనుండగా మరెవరో దేనికీ?" అంటూ రఘురామయ్య వాత్సల్యంగా ఇందిర బుగ్గ పట్టుకున్నాడు.

ఆయన ఎక్కువసేపు ఉండలేదు ముగ్గురు వటువులకూ మూడు అయిదు రూపాయిల నోట్లిచ్చి ఆయన కారులో వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన గురించి చలపతి భార్యా, సుభద్రా చెరొక విధంగానూ మాట్లాడుకున్నారు. పల్లెటూరి దృక్పథం పూర్తిగా వదలని చలపతి భార్యకు అంతా తప్పుగా కనబడింది. పట్నం నాగరికతకు అలవాటుపడిన సుభద్రకిది నిరపాయమైన వినోదంగా కనబడింది. చలపతి అట్లా మాట్లాడి ఉండగూడదని చలపతి భార్య. తన భర్త ఇంకా అంత కన్న చాలా ఘోరంగా మాట్లాడతాడని సుభద్ర.

ఒక్క ఇందిరకే ఇదంతా ఆ వెంకటేశ్వరస్వామి స్వయంగా ఆడిస్తున్న నాటకంలా గున్నది. చలపతి అన్న మాటలూ, రఘురామయ్య అన్న మాటలు ఆయన తన మెడలో దండ వేయ్యడమూ — ఇదంతా వాళ్ళకు సరదాగా తోచి ఉండచ్చు. కాని ఇందిరకు దైవప్రేరిత చర్యల్లాగా కనబడ్డాయి. అందులో ఆమె ప్రయత్నం విజానికి అవగింజంతైనా లేదు — రఘురామయ్య చేతికి తగిలించి ఉన్న దండ అడగటం తప్పిస్తే. ఎందుకలా అడగాలనిపించిందో తనకా క్షణంలో అంత ధైర్యమూ చొరవా ఎక్కడినుంచి వచ్చాయో ఇందిరకే తెలియదు.

కొండదిగి వచ్చాక ఇందిర జీవితం కూడా కొండదిగి మైదానం మీదికి వచ్చేసింది. మళ్ళీ ఎప్పటిపాటే కాలేజీకి పోవటమూ, తిరిగి రావటమూ, కాలేజీ పిల్లలు చెప్పే చెత్త కబుర్లనీ వినటమూ ఇంటికివచ్చి తలిదండ్రుల కీచులాటలు వినటమూనూ. రోజులు గడుస్తుంటే, ఇందిరకు సినిమా ఇంటర్వెల్ అనంతంగా సాగిపోతున్న ట్టుండటమే గాక కొండమీది సంఘటనలు అవాస్తవంగా కనిపించ సాగాయి. తన సమస్య తిరపతి వెళ్ళకపూర్వం ఎక్కడ ఉండిందో మళ్ళీ అక్కడికే వచ్చింది.

ఒకనాడు నాగభూషణం వెంట ఒక కుర్రాడు వచ్చాడు. బాగా ఒడ్డూ, పొడుగూ ఉన్నాడు. రాజ్‌కపూర్ మీసం చామన చాయగా ఉన్నాడు. డెక్రాన్ పాంటూ, అమెరికన్ క్లాకూ ధరించాడు. ఎక్కడో చూసిన మొహంలాగుంది. మనిషి నిలవటం లేదు. పాదాలమీద ఎగిరెగిరి పడుతూ, అనుమతి లభిస్తే డాన్సుకు ఉపక్రమించే వాడి లా కనిపించాడు.

"గుర్తుపట్టావా? మా వెంకటేశ్వర్లు కొడుకు రామనాధం!" అని నాగభూషణం ఆ కుర్రాణ్ణి సుభద్రకు పరిచయం చేశాడు. (సశేషం)

# తిమింగిలం వేట

(గోపాలానికి పెళ్ళివిషయమై వున్న అభిప్రాయాలు ఇందిర తల్లిదండ్రులకు నచ్చటంవల్ల ఇందిరను గోపాలానికి అంటకట్టాలనుకోడం ఇందిరకు కొంత విసుగ్గా అయింది. తనపెళ్ళి తనే చేసుకోగలననే ధైర్యం ఆమెకున్నది. బీచ్‌లో ఇందిర అభిప్రాయం గ్రహించిన గోపాలం పెళ్ళికి విముఖత చూపి వెళ్ళిపోయాడు. రఘురామయ్య భార్య చనిపోయిందని తెలిసిన ఇందిరకు రఘురామయ్యను చేసుకుంటే తన ఆశలు నెరవేరుతయ్యని తోస్తున్నది.

చలపతి ఆహ్వానించగా అతనికొడుకు ఒడుగుకు ఇందిరకు ఇష్టంలేకపోయినా, నాగభూషణం కుటుంబం అంతా ఎగువతిరుపతికి చేరారు. చలపతికొడుకు ఒడుగుతోపాటు నాగభూషణం కొడుకుల ఒడుగులుకూడా అయినై. ఆ సందర్భంలో రఘురామయ్య వచ్చి చేతులోవున్న పూలదండ ఇందిర మెడలో వెయ్యడంతో ఇందిరకు అనేక యోచనలు పోయినయి. కాని తిరిగి ఇంటికివచ్చిన తరువాత మామూలుజీవితం — పూర్వపు సమస్యలతో [illegible].)

— ఇక చదవండి.

"గుర్తుపట్టకేం? అంతా బాగున్నారా నాయనా? మీ నాయనమ్మ కులాసాగా తిరుగుతోందా! మీ చెల్లెలికి మళ్ళీ ఏమన్నా పిల్లలా?" అంటూ సుభద్ర సాంప్రదాయికంగా కుశలప్రశ్నలు చేసి, "ఎప్పుడొచ్చావ్? ఒక్కడివే వచ్చావా?" అని అడిగింది.

"లా కాలేజీలో చేరా నత్తా" అన్నాడు రామనాథం.


"అత్తా" అన్న సంబోధన వినగానే ఇందిర ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. కొంపతీసి వాడు తనకోసం తండ్రి తెచ్చిన సంబంధం కాదుగదా.

అయితే ఇందిరకు అతనిమీద ఏర్పడిన దురభిప్రాయం త్వరలోనే పోయింది రామనాథం పాముజాతికి చెందినవాడే అనుకున్నా, నీళ్ళకట్టె. చాలా అమాయకుడు. బడబడా మాట్లాడేస్తాడు. ఏ విషయమూ లోతుగా ఆలోచించలేడు. సినిమాలు చూసీ, సినిమాపత్రికలు చదివీ అలవరుచుకున్న సంస్కారం అతనిది.

నాగభూషణం అతన్ని ఆ రాత్రికి ఉండిపొమ్మన్నాడు. కట్టుకోనటానికి తన పంచకూడా ఒకటి ఇచ్చాడు.

గోడపక్కగా చిన్న నవారుమంచం మీద కూర్చుని, ఎంతకీ అయిపోని స్క్రూ రీల్‌గా, రామనాథం వాగుతూంటే, సుభద్రా, నాగభూషణమూ, శేషూ, సుబ్బూ ఒకరితరవాత ఒకరు శ్రోతల

కొడవటిగంటి కుటుంబరావు



పాత్ర ధరిస్తూ. మధ్య మధ్య తమ పనులు చూసుకుంటూవచ్చారు.

రామనాథం లాకాలేజీతో మొదలు పెట్టి, సినిమాలను గురించీ, పత్రికలను గురించీ తన స్నేహితులను గురించీ, తాను వెళ్ళిన ఎక్స్‌కర్షన్లు గురించీ, బంధువులను గురించీ, ఫుట్‌నోట్స్ కూడా ఇవ్వకుండా మాట్లాడాడు. ఈ చాంద్రాయణంలో రఘురామయ్య వస్తాడని ఇందిర కలలోకూడా అనుకోలేదు— కాని వచ్చాడు.

"మొన్నటి జూన్ మొదటివారంలో హైదరాబాదు వెళ్ళినప్పుడు రఘురామయ్య కట్టిన కొత్తఇల్లు చూశానత్తా. ఎట్లా ఉందనీ! అంతా లే-టేస్ట్ కన్‌స్ట్రిక్షన్! లే-టెస్ట్ ఫిటింగ్స్! పాస్టెల్‌కలర్ పెయింట్ వేయించాడు. గదుల్లో లైటింగ్ చూసితీరాలి. ఏం ఫర్నిచర్! అబ్బ! కింద కార్పెట్స్! పైన మేడ అంతా ఏర్‌కండిషన్ చేయించాడు. ఓహ్ అద్భుతం! రెండు లక్షలు ఖర్చయిందన్నారు. అయుంటుంది కూడానూ!"

సుభద్ర ముక్కుమీద వేలేసుకుని, "రెండులక్షలు పెట్టి ఇల్లేమిటీ?" అన్నది.

"ఇన్వెస్ట్‌మెంట్‌లే, అత్తా. రెండు లక్షలతో వ్యాపారం చేస్తే అది పదేళ్ళకు తిరిగివచ్చినా గొప్పే. ఈయన ఏడాదికల్లా మొత్తం రాబడతాడుగా! అమ్మో, తిమింగళం! అంత ఇల్లూ తనకోసం కట్టాడనుకున్నావా? మంత్రులకు పార్టీలివ్వటానికీ, పై దేశాలనుంచి గొప్పవాళ్ళు వస్తే—

"అవునూ, ఈనగా రెప్పుడూ మంత్రులవెంటే తిరుగుతాడా ఏం? కిందటి నెల పిల్లల వడుగులకి వచ్చాళ్ళే. అప్పుడూ ఎవరో మంత్రివెంటే ఉన్నా

డన్నారు. ఎంత పెద్ద కారులో వచ్చా డనుకున్నావ్ ?"

"జాతకంలే, అత్తా! సలభై ఏడులో కూడా మనవంటివాడే. అప్పు డీయన స్నేహితులు రజాకార్లు. వాళ్ళే పోషించారు. తరవాత, హైదరాబాదు పోలీశాక్షన్ జరిగిన మీదట గాంధీటోపీ వేసేశాడు. ఢిల్లీ వెళ్ళి పటేలుకు రజాకార్ల సమాచారాలన్నీ చెప్పాడంటారు. మనిషి మాత్రం సాహసి. ఆయన మేనల్లుణ్ణి పోలీసులు కాల్చిచంపారు; కమ్యూనిస్టులే. ఈయనే పోలీసులకి వాణ్ణి పట్టి ఇచ్చాడంటారు. ఇంకా చాలాచాలా చెబుతారు. కాని దేనికీ రికార్డుగాని, సాక్ష్యంగాని లేదు. బెజవాడ పెళ్ళికొచ్చేటప్పుడు వాళ్ళ కారుకింద పడి ఎవడో చచ్చాడు; కేసుకూడాలేదు."

"కాలో ఏదో విరిగిం దన్నారు ?"

"కాలు విరగట మేమిటి? శవాన్ని పోల్చటానిక్కూడా లేకుండాపోతే. చచ్చినవాడి తండ్రికి వెయ్యిరూపాయ లిచ్చాట్ట?"

సంభాషణ రుచించకనో ఏమో నాగభూషణం అర్జంటు పనున్నవాడిలాగా బయటికి వెళ్ళిపోయాడు.

"హైదరాబాదులో వాళ్ళిల్లెక్కడా?" అని అడిగింది ఇందిర

"హిమాయత్‌నగర్‌లో."

ఇందిర కొంచెంసేపాగి, "ఆయన పెళ్ళాం పోయిందిటగా." అన్నది.

"అవును. పోతే ఆయన కేం తక్కువలే? వెయ్యిగుళ్ళ పూజారి. అసలు ఆయన పైకి వచ్చిందె ఆడవాళ్ళతో. ఆయన కో బాబున్నది; చాలా పెద్ద కుటుంబానికి చెందినదట. లక్షల కొద్దీ ఆస్తి ఉండిట. మొగుడు లేడు. ఈయన వాళ్ళ వ్యవహారాలు చూడటానికి కుదిరి మెల్లిగా ఆవిణ్ణి బుట్టలో వేసుకున్నాడు. లేక ఆవిడే ఈయన్ని బుట్టలో వేసుకున్నదో. ఈయనకంటె అంతోఇంతో పెద్దదిట తెల్లగా, లావుగా నాయెత్తుంటుంది ఇదిగాక ఆశ్రయించే ఆడవాళ్ళు కొల్లలు. వాళ్ళ కాయన ఉద్యోగాలూ అవీ ఇప్పిస్తాడు..."

ఇటువంటి విషయాలు వినటం ఇందిరకు రుచించలేదు అయినా వాటినిబట్టి ఆమె తన లక్ష్యాన్ని మార్చుకోవలచలేదు. రఘురామయ్య ఎటువంటివాడైతే నేం? ఆయన డబ్బుకూ, పలుకుబడికీ. ఇందిర ఆరాధించే సాంఘికశక్తు లన్నిటికీ అపరావతారం

ఒకనాడు నాగభూషణం సకుటుంబంగా సినిమాకు వెళ్ళాడు. అక్కడ వాళ్ళకి గోపాలం కనిపించాడు అతని వెంట ఎవరో అమ్మాయి ఉన్నది ఆ అమ్మాయి చాలా అందంగా ఉన్నదనటాని కేమీ సందేహం లేదు ఇందిర అసూయపడలేదు.

గోపాలం నాగభూషణాన్ని చూడగానే ఆ అమ్మాయితోసహా దగ్గిరికి వచ్చి,

"మా ఆవిడంటే. వీరే నాగభూషణం గారు, వారమ్మాయి – నే చెప్పానే – ఇందిర; వాళ్ళమ్మగారు. వీళ్ళిద్దరూ ఇందిర తమ్ముళ్ళు." అన్నాడు తన భార్యతో.

ఆ అమ్మాయి పెద్దవాళ్ళిద్దరికీ నమస్కారాలు చేసి, మిగిలినవాళ్ళకు నాజూకుగా "బో" చేసింది నవ్వుతూ.

ఇందిరకు మండిపోయింది అతను తనను గురించి తన భార్యకేం చెప్పాడు? తనవంటి అందమైనవాణ్ణి చేసుకోనన్నదని చెప్పాడా? ఇందిరపాటి అందగత్తెను తానే చేసుకోనన్నానని చెప్పాడా?

ఎన్నోసార్లు గమనించింది కాని అర్థం చేసుకోలేకపోయింది – గోపాలం గురించి ప్రస్తావన వచ్చినా, అతను అయిదునిమిషాలు ఎదురుగా ఉన్నా ఇందిరకు ఏదో ఒక కోపకారణం తటస్థపడుతుంది; ఎందుచేత? ప్రభాకరాన్నిచూస్తే ఆమెకు చాలా అసహ్యం, కాని అతనిపైన ఇలా ఎన్నడూ కోపంలాంటిది రాలేదు. ప్రభాకరం అసహ్యంగా కనిపిస్తాడు. అసహ్యంగా ప్రవర్తిస్తాడు. అసహ్యం పుట్టిస్తాడు. ఈ గోపాలం అట్లాకాదు ఇతను పైకి సంతోషం కలిగించేవాడిలాగా కనిపిస్తాడు. కోపం తెప్పిస్తాడు.

ఇటువంటివి గమనించటం తేలిక, అర్థం చేసుకోవటం కష్టం

"మీ రే క్లాసు కొంటున్నారు?... మేమూ అదే కొంటాం. అందరమూ సరదాగా ఒకచోటే కూర్చోవచ్చు." అన్నాడు గోపాలం.

సీట్లలో కూర్చునేటప్పుడు గోపాలం ఒకచివరా. అతని పక్కన అతని భార్యా. ఆమె పక్కన ఇందిరా సర్దారు. గోపాలం పెళ్ళిశుభలేఖ వచ్చినప్పు డందులో పెళ్ళికూతురిపేరు చూసిందిగాని, ఇందిరకిప్పు డాపేరు జ్ఞాపకంరాలేదు.

ఆమె అకస్మాత్తుగా ఇందిరకేసి తిరిగి, "మీ రెవరూ మా పెళ్ళికి రానే లేదు. తప్పక వస్తా రనుకున్నాం!" అన్నది

ఇందిర నిర్ఘాంతపోయింది. పెళ్ళినాటికె ఈ మనిషి తను తప్పకుండా వస్తుందని ఎట్లా అనుకున్నదీ? తను ఎవరో, ఆమె కేంతెలుసూ?

"నాకు పరీక్షలో ఏవోఅడ్డొచ్చాయి." అన్నది ఇందిర మెకానికల్‌గా

సాధారణంగా కొత్తగా పెళ్ళయిన వాళ్ళు పదిమందిమధ్య – ముఖ్యంగా పదిమందిమధ్యనే – ఒకరికోసం ఒకరు చచ్చిపోతున్నట్టుగా ప్రవర్తిస్తారని ఇందిర గమనించింది. కాని ఈ జంటలో అటువంటిధోరణి కనిపించ లేదు. వాళ్ళు భార్యాభర్తలు కానట్టుగానో. కొత్తమోజు తీరిపోయినట్టుగానో ప్రవర్తించారు

ఇంటర్వెల్లో గోపాలం, "ఇది హిట్ పిక్చర్! అరవ్వాళ్ళను ఒక సంప్రదా

యాన్ని ఆదరించటమూ పోషించటమూ అంటూ టున్నవాళ్ళు. ఈ పిక్చరు తెలుగులో తీస్తే రెండురోజు లాడదు." అన్నాడు

"వాళ్ళు అందాన్ని ఖాతరు చెయ్యరు. అభిమానమే వాళ్ళ కెక్కువ. ఇటువంటి హీరోలను మరే ప్రాంతంవాళ్ళూ సహించరు." అన్నది అతనిభార్య.

"మన తెలుగువాళ్ళకు అందం చూసి అభిమానించటమైనా తెలిసిందా ? అదీ లేదు." అన్నాడు గోపాలం.

అతను తనను ఎద్దేవా చేస్తున్నాడా అనుకున్నది ఇందిర.

"ఎవరి అభిమానాలు వాళ్ళకుంటాయి. అరవవాళ్ళు మంచి నటులను అభిమానిస్తారు. కొందరు అందాన్ని అభిమానించవచ్చు. మరికొందరు మరొకదాన్ని అభిమానించవచ్చు. అభిమానమన్నదానికికూడా చట్టాలు ఏర్పరుస్తారేమిటి ?" అన్నది ఇందిర.

"నాకు తెలిసినంతవరకు తెలుగువాళ్ళు డబ్బును అభిమానిస్తారు అరవ పిక్చర్లలో కథలు చూస్తే వాటిలో సంఘనీతి అంటూ కనిపిస్తుంది. మన కథల్లో ధనాశతప్ప ఇంకేమీ కనిపించదు."

అతను తననే చెప్తున్నాడని ఇందిర రూఢి చేసుకున్నది. ఆమె కతనిమీద మరింత మంటపుట్టుకొచ్చింది.

సినిమా అయి బయటికి వచ్చి, ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయేటప్పుడు సుభద్ర గోపాలం భార్యతో, "ఏమమ్మాయ్, రుక్మిణీ, మీ రిద్దరూ మాయింటి కోసారి రారాదూ ?" అన్నది.

అవును. ఆ అమ్మాయిపేరు రుక్మిణీ. పేర్లు కుదిర్చినట్టుగా ఉతికాయని అప్పుడే సుభద్ర అన్నది. ఎందుకో ఇందిర కామాటైనా జ్ఞాపకం రాలేదు

ఇల్లు చేరవస్తూ సుభద్ర, "నిక్షేపమంటి కుర్రాడు. అల్లుడు కావలసినవాడు. ఈ పెద్దమ్మ పడగొట్టేసింది." అన్నది.

"చాల్లే ఊరుకుందూ ? అయిపోయిందానికెందుకూ?" అన్నాడు నాగభూషణం. ఆయన లోపల అనుకుంటున్నమాటే తల్లి పైకి అనేసిందని ఇందిర గ్రహించింది.


"ఈ పిల్లయినా బాగానేఉంది."

"మనపిల్లకన్న నయమే." అన్నాడు నాగభూషణం.

ఇందిరకు కోపం రాలేదు.

రిజల్ట్సు వచ్చాయి; ఇందిర పాసయింది. క్లాసు రాలేదు. అయినా — ఇందిరా బియ్యే ! నాగభూషణం ఇందిరకోసం సీరియస్‌గా సంబంధాలు విచారించసాగాడు. ఇందిర తన కేమీ సంబంధించనట్టుగా చూస్తూ ఊరుకుంది.

ఒక సంబంధం వచ్చింది. పెళ్ళికొడుకు పాతికేళ్ళు; లాయరు. తండ్రీ లాయరే తిండికి లోటులేని ఆస్తి ఉంది.



ఇల్లుంది. ఇద్దరే కొడుకులు. పిల్లవాడికి తల్లిలేదు, అప్పచెల్లెళ్ళు లేరు.

"అది బాగుందర్రా! ఈ సంబంధం చేస్తే పిల్లకు అత్తపోరూ, బిడ్డపోరూ ఉండదు," అన్నది సుభద్ర.

"కట్నాలకిందా, లాంఛనాలకిందా నాలుగువేలు, పెళ్ళి దర్పంగా చెయ్యాలి. ఏదో చేశామనిపిస్తే చాలదు. డాన్సు, పాట కచ్చేరీలు పెట్టాలి. ఏ డెనిమిదివేలు ఖర్చనుకో."

"పిల్లవాడు అందంగా ఉంటాడా?"

"కట్నం అడుగుతున్నది అందానికి కాదు. పిల్లవాడు నచ్చకపోతే పిల్ల నివ్వరు. కావలిస్తే పెళ్ళిచూపులకు వస్తారు. రానూ పోనూ ఫస్టుక్లాసివ్వాలి. లేదా మనం వెళ్ళి చూసుకురావచ్చు"

"వాళ్ళు పిల్లను చూడరా ఏమిటి?"

"వాళ్ళ కక్కర్లేదు. ఆ కట్నం పారేస్తే ఎవరినన్నా చేసుకుంటారు."

"ఇదేం సంబంధ మండీ? ఎక్కడా చూళ్లేదూ?"

"కొత్త రోజులూ, కొత్త పద్ధతులూనూ"

"వేళాకోళాని కంటున్నారా? లేక ఈ సంబంధం గురించి నిజంగానే ఆలోచిస్తున్నారా?" అన్నది సుభద్ర. ఆమెకు లోతునీళ్ళల్లో దిగినట్టయింది.

"నిజంగానే ఆలోచిస్తున్నా. ఎవరి నడిగినా మంచిసంబంధ మంటున్నారు!''

"డబ్బు? ఏ డెనిమిదివేలు పుట్టించొద్దూ?"

"ఇది అందరికీ ఉన్నదేగా? ఇంకా మనం నయంకాదూ? ఒక్కత్తే పిల్ల. ముగ్గురు నలుగురు ఆడపిల్లల తండ్రుల

కూ్డా ఇదే సమస్యగా? ఎక్కడో తల తాకట్టుపెట్టి తెస్తాం."

సుభద్ర ఆలోచించింది. ఆవిడ అశ్లీలం అనదలుచుకున్నదాని లాగా గొంతు తగ్గించి. "ఆ గోపాలంలా కట్నం వద్దనేవా ళ్ళుండరుటండీ?" అన్నది.

"ఉంటే వాళ్ళు ఖంతలు. వాళ్ళకి పిల్లల్నిచ్చేవాళ్ళకు తమ పిల్లలపైన ప్రేమ లేనట్టే లెక్క!" అన్నాడు నాగభూషణం.

గోపాలం కట్నం లేకుండానూ, ఖర్చు లేకుండానూ తనను చేసుకుంటా నన్నప్పుడు తను అభ్యంతరం చెప్పి ఉండకపోతే తన తల్లి దండ్రుల కిప్పు డీ సమస్య రాకపోను. తన తండ్రి స్థితిలో ఉన్నవాడు కూతురుకోసం ఏడు ఎనిమిదివేలు ఖర్చు చెయ్యట మంటే మాటలుకాదు. ఒకవేళ అప్పుగా పుట్టినా అది తీరేమాట కల్ల. కాని ఇందిర తన తండ్రికీ సమస్య కలిగించినందు కేమాత్రమూ పశ్చాత్తాపపడలేదు. అంత ఖర్చుచేసి పెళ్ళి చేసే ఆలోచన తటపెట్ట టమే తప్పు; అవాస్తవికం. హైకోర్టు బిల్డింగు కొనాలని ఆలోచించటం లాటిది వెర్రి ఆలోచన. తన పెళ్ళి గురించి ఆలోచించవద్దని ఇందిర తండ్రికి ఏనాడో చెప్పింది. గోపాలాన్ని చేసుకో నన్న నాటి నుంచీ తన పెళ్ళి బరువు తల్లి దండ్రులపైన లేకుండా చూసే భారం నిజానికి ఇందిరపైనే ఉన్నది. ఎందుకంటే, అంతకన్న మంచి సంబంధం తీసుకురావటం తన వల్ల కాదని తండ్రి అనేశాడు. అంతకన్న చచ్చు సంబంధాలు తెచ్చి తాను దివాలా తీసే ఆలోచనలు అయన ఇప్పు డెందుకు చెయ్యాలి?

తల్లి దండ్రులు మధనపడుతుంటే ఇందిర చూస్తూ ఊరుకున్నది.

ఇది జరిగిన ఒక వారానికి కాబోలు పెళ్ళిచూపులకు వస్తున్నా రన్నారు! తల్లీ తండ్రీ హడావుడి పడ్డారు. మగ పిల్లలు నిజంగా పెళ్ళే జరుగుతున్నట్టుగా ఉత్సాహంతో కేకలు పెట్టి ఇల్లంతా నృత్యాలు చేశారు.

మిట్టమధ్యాన్నంవేళ ఒక తల్లీ, ఒక కొడుకూ వచ్చారు. తల్లికి యాభైపే ళ్ళుంటాయి. తలంతా నెరిసింది, నడకా, మాటవైఖరీ చూస్తే పెద్ద వ్యవహ ర్త లాగా ఉన్నది. కొడుకు కొంచెం కురచ రకం. మనిషి రోతగా ఉన్నా డనటా నికి లేదు గాని, నుదురు అంగుళం కన్న వెడల్పు లేదు. గడ్డం కూడా చిన్నది, అదికూడా లోపలికి తోసుకుపోయింది. ఏదో యోగశక్తిచేత తన ముఖాన్ని అలా ముడిచిపెట్టుకున్న వాడిలాగా కని పించాడు. అతని వయస్సు పదిహేడు పైనా, ముప్పైకి లోపూ ఉండవచ్చు మంగోలియను మొహంలాగా గడ్డాలూ, మీసాలు బహుకొద్దిగా ఉన్నట్టు కనిపిం చాడు. అటువంటి మొహం వయస్సు

చెప్పటం కష్టం. ఆ మొహం ముడతలు పడేసదాకా పిల్లవాడి మొహంలా ఉండి ఆ తరవాత ముసలిముఖ మైపోతుంది.

తల్లి పైఖరిని బట్టి ఆమె అభిప్రాయాలను అరచిన్నం అటూ ఇటూగా తూచగలదు ఇందిర. ఆమెకు తల్లిగాని, కొడుకుగాని నచ్చినట్టు లేదు.

పెళ్ళికొడుకును నాగభూషణం ఎంగేజి చేశాడు. అతని పేరు నిత్యానందంట. పాపం. ఇంట్లోకి అడుగు పెట్టినప్పటి నుంచీ ఇందిరనే చూస్తున్నాడు.

ఆడవాళ్ళలో నూటికి తొంభై తొమ్మిది మంది తమచేత ఆకర్షించబడ్డవాళ్ళను, ఇష్టంతో కాకపోయినా, సానుభూతితో చూస్తారు. ఇందిర నూరో ఆడది.

పెళ్ళికొడుకు తల్లి ఒక్క నిమిషం పాటు ఇందిరను కళ్ళు పదునెక్కించి, షాపులో వస్తువును పరీక్షించినట్టు పరీక్షించింది. ఆ తరవాత ఆవిడ ఇందిర కేసి చూసిన పాపాన పోలేదు. కాని ఆవిడ తన కొడుకును అడపా దడపా చూసుకొంటూనే ఉన్నది.

వాళ్లు పావుగంటో, ఇరవై నిమిషాలో కూర్చుని లేచారు.

"మీ అభిప్రాయం రాయండి; తరవాత అన్ని సంగతులూ మాట్లాడు కుందాం." అన్నది పెళ్ళికొడుకు తల్లి.

వాళ్ళను నాగభూషణం లోకల్ స్టేషను దాకా ఊగబెట్టి వచ్చాడు. ఆయన తిరిగివచ్చే మధ్యలో ఇందిర తల్లితో, "ఇదంతా ఏమిటమ్మా? నేనేదో ఉద్యోగము చేసుకుంటాను. నా కెందు కిప్పుడీ పెళ్ళి?" అన్నది.

"పెళ్ళి మానేసి ఉద్యోగాలు చేసు కుంటారుటే? ఉద్యోగాలు చేసేవాళ్లంతా పెళ్ళీ పెటాకులూ లేకుండా ఉండిపోతున్నారా?" అన్నది సుభద్ర.

"ఇదేనా పదివేల పెళ్లి సంబంధం?" అని ఇందిర అడిగింది.

"కాదు; అది అప్పుడే మాను కున్నాంగా? వాళ్ళు కట్నా లడగటంలేదు. మనం ఇష్టమై పెడితే ఏమిచ్చినా తీసు కుంటారాట, పెళ్ళికూడా ఆర్భాటంగా చెయ్యక్కర్లేదనీ, పెద్ద బలగంతో రాము అనీ అన్నారు. ఆ అబ్బా యెట్లా వున్నాడు?"

"ఏడిచి మొత్తుకున్న ట్టున్నాడు."

సుభద్ర కళ్ళు పెద్దవి చేసి, ఈ సంబంధంకూడా పడగొట్టేస్తా వేమిటి?" అన్నది. ఆమె గొంతులో భయమూ, బాధా కనిపించాయి.

ఇందిర చిన్నషాక్ తిన్నది. "ఇంత కన్న మంచి సంబంధం మనం తీసుకు రాలేం" అన్న శీర్షికకింద ఇది రెండో సంబంధ మన్నమాట. మొదటిదాని కిది తీసికట్టే. ఇంకో రెండు మూడేళ్ళు పోయాక ఈ శీర్షికలో మూడోసంబంధం వస్తే అది ఇంకెట్లా ఉండబోతుందో!

ఇంక తాను తాత్సారం చేసి లాభం లేదు. ఈ సమస్యను తానే పరిష్కరించు

కోవాలి తనకీ ప్రపంచంలో సహాయ పడేవా రెవరూ లేరు.

నాగభూషణం ఇంటికి తిరిగి వచ్చి తనభార్యతో రహస్యంగా ఏదో మాట్లాడి, కూతురు దగ్గిరికి వచ్చి. "ఆ కుర్రాడు నీకు నచ్చలేదన్నావుటే?" అని అడిగాడు.

"అమ్మ అడిగితే చెప్పాను. అయినా నాకు నచ్చటం దేముంది? మీ వీలు చూసుకుని మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి," అన్నది ఇందిర.

"ఈ మాట రెండున్నర ఏళ్ళ క్రితమే అంటే ఎంత బాగుండేది?" అన్నాడు నాగభూషణం.

## 7


"మహారాజశ్రీ రఘురామయ్యగారికి.

పరిస్థితుల ప్రోద్బలంకొద్దీ నే నీ ఉత్తరం వ్రాయవలసి వచ్చినది నన్ను క్షమించవలెను మా తమ్ముళ్ళ ఒడుగు తిరుపతిలో జరిగినప్పుడు మీరుకూడా వచ్చినారు. అప్పుడు నా మెడలో మీరు మాల వేసితిరి. ఆ రోజు మొదలుకొని నేను మీ మెడలో యెప్పుడు మాల వేయుదునా యని చూస్తూ యుంటిని. కాని మీరు నాకు అటువంటి అవకాశము కలిగించలేదు. త్వరలో కలిగించ వలసినదని మిమ్ము ప్రార్థిస్తూ యున్నాను. నాకు నా తల్లిదండ్రులు ఏదో సంబంధము చూచినారు నాకు బుద్ధి తెలిసినప్పటి నుంచియు ఈ నాటి యువకుల న్న అసహ్యము. వారికి ఘనమైన ఆలోచన ఉన్నట్లు కనపడవు. వారి ఆలోచన లన్నీ నాకు పరమ అసహ్యము నేను మొదటి నుంచియు మనస్సు పరిపాకము చె దిన వారికే భార్య కావలెనని తలచియుంటిని మిమ్ములను వివాహమాడే అవకాశ మివ్వమని నేను ఇందుమూలముగా వేడుకుంటున్నాను. వ్యవధిలేదు గనుక త్వరలో నా కోరిక తీర్చవలెను

ఇట్లు,

ఇందిర."

ఈ ఉత్తరాన్ని ఇందిర ఒక రాత్రంతా రిహార్స్ చేసి తయారుచేసి, రహస్యంగా రాసి, కవరులోపెట్టి కవరుపైన "శ్రీ సి. హెచ్ రఘురామయ్యగారు, హిమాయత్ నగర్, హైదరాబాదు." అని ఎడ్రసురాసి, మిగిలిన భాగమంతా దేవుడిపైన వేసి పోస్టు చేసింది ఆ ఉత్తరం రాస్తుంటే ఇందిరకు ముచ్చెమటలు పోశాయి చెయ్యి వణికి, దస్తూరీ గుర్తించటం అసంభవంగా తయారయింది. కాని ఆమె ఉద్రేకానికి కారణం తాను తప్పుచేస్తున్నాననే భావం కాదు, తల్లిదండ్రులకూ లోకానికీ తెలిసిపోతుం దన్న భయమూకాదు — తాను వేటాడుతున్న జంతువు యొక్క ప్రమాణం తిమింగలాన్ని వేటాడే వాడికి అదను చూసి హార్పూను వేసే టప్పుడు చెమటలు పట్టి, ఎయ్యి కంపిస్తూ ఉంటుందా — వాడు చిన్న



చేపలనుకూడా వేటాడనివాడూ, తిమింగలం మరీ పెద్దదీ అయినప్పుడు ?

నిత్యానందం వాళ్ళ దగ్గిర నుంచి ఉత్తరం వచ్చింది. వాళ్ళకు పిల్ల నచ్చింది, పిల్లవాడు మీకు నచ్చిన పక్షంలో వచ్చి తాంబూలాలు పుచ్చుకుని ముహూర్తం ఏర్పాటు చేసుకోవచ్చు.

"మనకుమరి పిల్లవాడు నచ్చినట్టేనా" అన్నాడు నాగభూషణం, తన భార్య ఉద్దేశం తెలిసికూడా.

"ఏమండీ! మీరు మళ్ళీ అడ్డుపుల్లలు వెయ్యక, వెళ్ళి ముహూర్తం పెట్టుకు రండి! ఈ సంబంధం చెయ్యిజారిపోతే ఇంక మనని లోకం క్షమించదు." అన్నది సుభద్ర,

"పిల్ల టెక్నికల్‌గా సమ్మతి చెబితే తప్ప సంబంధం ఖాయమైనట్టు నా సంస్కారం ఒప్పదుగా ?" అన్నాడు నాగభూషణం ఇందిర వీపుకేసి చూస్తూ.

"నా దేమీ లేదనీ, మీ యిష్టం వచ్చినట్టు చెయ్యమనీ ఆనాడే చెప్పాగా ?" అన్నది ఇందిర వెనక్కు తిరిగి చూడకుండానే

"చెప్పావనుకో. నేను కొంచెం చాదస్తుణ్ణి; అడుగడుగునా నీ సంతకం అడుగుతూనే ఉంటాను." అన్నాడు నాగభూషణం

ఇందిర ఏమీ అనలేదు. అనటానికేమీ లేదు. తాను ప్రయోగించిన హార్పూను తిమింగిలానికి తగిలిన జాడలేమీ ఇంకా లేవు. ఇప్పుడామెలో ఏ సంతోషమూ లేదు. ఒక్క సంకోచం—ఆ ప్రదసు ఎలా ? దానితోబాటు మళ్ళీ ధైర్యం—ఆ ప్రదసుతో ఆయనకు

ఉత్తరం అందకపోతే ఇంక ఆయన కీర్తిప్రతిష్ఠ లన్నీ దేనికీ? ఇంకో చిన్న సందేహం — ఆ ఉత్తరాన్ని మరెవ రన్నా చూస్తే. దానితోబాటు నమ్మకం — 'కాన్ఫిడెన్షల్' అని రాసిన ఉత్తరాన్ని సాహసించి ఎవరు చూస్తారు?

"సరే ఇవాళే బయలుదేరిపోనా ఏం?" అన్నాడు నాగభూషణం భార్యతో.

"ఇవాళ నవమి మిగులుంది. రేపు వెళ్ళండి. వస్తున్నట్టు ఇవాళ కావలిస్తే ఒక కార్డుముక్క రాసిపడెయ్యండి." అన్నది సుభద్ర

తలుచుకుంటే ఇందిరకు ఆశ్చర్య మైంది — తనకు ఊహ తెలిసినప్పటి నుంచీ ప్రతి చిన్న విషయం గురించీ కాట్లకుక్కలల్లే పోట్లాడుకునే తన తల్లి దండ్రులు తన కిష్టంలేని సంబంధం విషయంలో ఏకాభిప్రాయాని కొచ్చేసి. అభిప్రాయభేదమన్నది ఏనాడూ లేనంత అన్యోన్యంగా మసులుకుంటున్నారు.

ఆ సాయంకాలమే గోపాలం తన భార్య రుక్మిణితోసహా వచ్చాడు.

"ఆ రోజు మనం సినిమాథియేటర్లో కలుసుకున్నాక మూడుసార్లు ప్రయత్నిం చాము రావాలని. ప్రతిసారీ ఏదో ఒక అడ్డు తగులుతూనే వచ్చింది," అన్నాడు. గోపాలం.

"ఇందిరకు సంబంధం సెటిలయిం దోయ్, గోపాలం," అన్నాడు నాగభూషణం.

"ఎవరా లకీమాన్?" అని అడిగాడు గోపాలం సంతోషంగా — కనీసం సంతోషం అభినయిస్తూ.


"ఇది ఇందరకు వచ్చిన బెస్ట్ సంబంధము అనను. కాని ప్రాప్తంకూడా ఉంటా, లిగా?" అన్నాడు నాగభూషణం.

తండ్రినుంచి ఇటువంటి సూటీ పోటీ మాటలు దాదాపు ప్రతిరోజూ వింటూనే ఉన్నది ఇందిర. అయితే వాటిని పట్టిం చుకోదలచలేదు. చాపకింద నీరులాగ తాను చేసుకోవలసిందేదో చేసుకుపో తున్నదిగద! ఇంకా కొంచెం ఓపిక పట్టితే తనకు విమోచనం కలుగుతుంది. ఈ లోపల తను తొందరపడటం దేనికీ?

"అలా అనకండి. ఇందిర సంగతి నాకు బాగా తెలుసు. తనకు నచ్చనివాణ్ణి చేసుకోదు సంబంధానికి ఒప్పుకున్న దంటే వచ్చిన సంబంధా లన్నిటిలోకీ బెస్టన్నమాటే." అన్నాడు గోపాలం.

నాగభూషణం నవ్వి, "అట్లా తన యిష్టం చలాయిణీ చేసుకునే దక్షత కోటి మందిలో ఒక్కడికైనా ఉంటుందా అని మనను గురించి మనం ఎంత ఘనంగా నన్నా అనుకోవచ్చుగాక; అందరమూ పరిసితులకు బానిసలమే — క్రీచర్స్ ఆఫ్ సర్కమ్స్టెన్సెస్!" అన్నాడు.

"అమ్మో, అలా అనకండి. ఈకాలపు ఆడపిల్లలు ఘెరిబిల్ క్రీచర్స్! మా రుక్మిణిని చూడండి. నోట్లో వేలుపెడితే



కొరకలేనిదానిలా ఎలా ఉంటుందో. వాళ్ళ బంధువు లందరితోనూ హోరా హోరీ పోట్లాడి నన్ను పెళ్లి చేసుకున్నది వాళ్ళనాన్న బాగా డబ్బున్నవాడు. ధన మదం చాలా వుందిలెండి. అవసరమైతే పాతికవేలు కట్నం పోసిఅయినాసరే బ్రహ్మాండమైన అల్లుణ్ణి తెస్తానన్నాడు. కూతురిమీద అపేక్షకాదు — తన పరువు ప్రఖ్యాతులు నిలబెట్టుకునేందుకు. నన్ను గురించి ఎవరో చెప్పేసరికి, 'ఛీ! ఛీ!' అనేశాట్ట. అన కేంచేస్తాడూ? మా బంధు వర్గంలో ఒక్క మంత్రి లేడు. సెక్రటరీ లేడు, కంట్రాక్టరు లేడు, ఆఖరు కో పిల్లజమీందారైనా లేడు! తండ్రి ఛీఛీ అనటమే తరవాయి, ఈవిడగారికి నన్నే చేసుకోవాలన్న పట్టుదల జాస్తి అయి పోయింది. ఎంత చెడ్డా ఆ తండ్రి కూతురుగదా!..."

"ఏమండీ, కాస్త మీ గొప్పలు కట్టిపెడతారా?" అన్నది రుక్మిణి.

"నన్నుగురించి గొప్పలు చెప్పుకోవ టము లేదోయ్, నిన్ను గురించే చెబుతు న్నాను."

"మీ కోతలు అందరికీ తెలుస్తూనే ఉన్నాయి."

అంతా వింటున్న ఇందిరకు రుక్మిణిని గురించి ఏమనుకోవాలో తెలియలేదు. ఆమె తాను తోసిపుచ్చినవాణ్ణి పెళ్ళా డింది: మంచి ధనికుణ్ణి చేసుకునే అవ కాశం ఉండీన్నీ మామూలువాణ్ణి చేసు కున్నది. ఈ రెండు కారణాలవల్లా ఇందిర ఆమెను చాలా తేలిక దృష్టితో చూడవచ్చు. కాని ఆ పని చెయ్యటం ఆమెకు సాధ్యం కాలేదు. రుక్మిణిని చూసి ఇందిర అసూయపడవలసి వచ్చింది. రుక్మిణి తనవాళ్ళతో బహిరంగంగా

పోట్లాడి తనకు కావలసినవాణ్ణి చేసుకున్నది. తను? "నాకు ఆ రఘురామయ్యగారిని చేసుకోవాలని ఉన్నది," అని కనీసం తన తల్లితో మాటవరసగా నన్నా అనలేకపోయిందే! అది తన దౌర్బల్యం కాదా? తనకు తన తల్లి దండ్రులను ఎదిరించి పోరాడే ధైర్యం ఉన్నదా? ఉండే ఉండాలి. ఎందుకంటే తాను వాళ్ళకు ఎదురుతిరిగిన సందర్భాలు బోలెడున్నాయి అయితే ఈ విషయంలో తాను పిరికిపందలాగా ఎందుకు ప్రవర్తించిందీ?

ఈ ప్రశ్నకు సమాధానం ఇందిరకు తెలియలేదు. కాని మనం సులువుగా తెలుసుకోవచ్చు. ఇందిర భయపడింది తల్లిదండ్రులకు కాదు; లోకానికి. ఎవతె గాని డబ్బుకోసం ముసలివాణ్ణి చేసుకోవటానికి సిద్ధపడితే, ఆ మనిషిని లోకమంతా నీచంగా చూస్తుంది. ఆ సంగతి ఇందిరకు అంతరాత్మలో తెలుసును. అదే ఆమె పిరికితనానికి అసలుకారణం.

మర్నాడు ఉదయం నాగభూషణం ఆఫీసుకు బయలుదేరి గేటుదగ్గిరికి వచ్చేసరికి పోస్టువాడు కవరొకటి ఇచ్చాడు. ఆ రాత్రి బండికే ఆయన తాంబూలాలు పుచ్చుకోవటానికి ప్రయాణమై పోతున్నాడు. కాబోయే వియ్యాలవారినుంచి వచ్చిందేమో నని కవరు పరీక్షిస్తే దాని పైన "సి. హెచ్ రఘురామయ్య, హైదరాబాదు" అని ఒకమూల అచ్చుకొట్టి వున్నది. రఘురామయ్యంటే నాగభూషణాని కేమాత్రమూ సదభిప్రాయం లేదు. ఆయన ఏనాడూ తనకు ఉత్తరం రాసిన పాపాన పోలేదు. సింహానికి చిట్టెలుకతో పని పడట్టుగా తనతో ఇన్నాళ్ళకి ఆయన కేదో పని పడింది!

వచ్చిన కవరు వచ్చినట్టుగానే జేబులో పెట్టుకుని నాగభూషణం ముందుకు సాగాడు ఆయన జేబులో పెట్టుకుం దొకటాంబన్నది మధ్యాహ్నందాకా తెలియలేదు. ఆయనపని చూసుకుంటూ ఎందుకో జేబులో చెయ్యి పెట్టేసరికి ఉత్తరం తగిలింది. దాన్ని తీసి, కవరు చించి, ఇంగ్లీషులో టైపు చేసిఉన్న ఉత్తరం చదివాడు. తల తిరిగిపోయింది. శరీరంలోని రక్తమంతా సముద్రంలో ఆటు వచ్చినట్టుగా ఏమూలకో పోయి దాక్కున్నది. కళ్ళు భైర్లుకమ్మాయి. బుర్ర మీద రెండు కిలోమీటర్ల మందాన మంచు పేరుకున్నట్టయింది.

ఆ క్షణంలో తన స్థితి తలుచుకుని నాగభూషణం. "చచ్చిపోయే ముందు అందరికీ అలాటి లక్షణాలే కలుగుతాయి తప్పకుండా!" అనుకునేవాడు.

ఒక్కముక్కలో చెప్పాలంటే, రఘురామయ్య నాగభూషణాన్ని, "నీ కూతురేమౌతున్నదో చూసుకోవటము తండ్రిగా నీ విధి," అని రాశాడు. ఇంకొంచెం వివరంగా చెప్పాలంటే,

ఇందిర తనను పెళ్ళాడతా నని "ఆఫర్" చేస్తూరాసిన ఉత్తరం గురించి చెప్పాడు; ఆయీడుది తనయీడువాణ్ణి ప్రేమించట మన్నది అనూహ్యం గనక, ఎ దురుద్దేశంతో ఆమె తనను పెళ్ళాడతా నన్నదీ ఊహించటం తేలికే నన్నాడు; తల్లిదండ్రులు పిల్లలతలలో అలాటి దురాశలు పెడితే తప్ప వాటంతట అవి పుట్ట వన్నాడు; నాగభూషణమే తన కూతురి మనస్సు మెలితిప్పి అలా ఉత్తరం రాయించినా తనకు ఆశ్చర్యం ఉండ దన్నాడు।

ఆ చివరిమాటలు నాగభూషణానికి మర్మభేద్యంగా తగిలాయి. అవి ఒతికుండగా మానే గాయాలు కావు.

రఘురామయ్య విషప్పురుగు. కుట్టటము దానికి సహజం. బధువర్గంలో రఘురామయ్య డబ్బుకు హారతి పట్టనివాడు నాగభూషణం ఒక్కడే. ఆ సంగతి రఘురామయ్యకు తెలిసిఉండకపోదు. అందుచేత, తన డబ్బుకు నాగభూషణం కూతుర్ని ఎర చేశాడని ఆపాదించటంలో ఆయనకు కొంతతృప్తికూడా ఉండవచ్చు. కాని ఇందిర? ఇందిర ఆయనకు ఉత్తరము రాయటమేమిటి? ఏమిటనుకుని రాసి ఉంటుంది? తనతో ఎందుకు చెప్పలేదు? చివాట్లు తగులుతా యనేనా? తనసంగతి ఇందిరకు తెలుసు. కాని ఇందిరసంగతి తనకు తెలీదు। తనకు పుట్టి తన ఎదచే పెరిగిన కూతురు మనస్సూ, అభిప్రాయాలూ ఏ విధంగా పరిణామం చెందుతున్నదీ తనకు ఊహించటానికైనా సాధ్యం కాకుండా ఉంది।

ఆ రఘురామయ్య ఉత్తరం గోప్యమైనది కాదు. దాన్నాయన ఏ దౌర్భాగ్యుడికో డిక్టేటు చేశాడు. ఆదౌర్భాగ్యుడు దాన్ని టైపు చేసి ఒకకాపీ రఘురామయ్య పర్సనల్ ఫైల్లో ఉంచి, మరొక కాపీ సర్క్యులేషన్ కోసమని తనజేబులో పెట్టుకుని, ఇప్పటికే ఎంతమంది స్నేహితులకు చదివి వినిపించి ఉంటాడో. తనకూతురు తనను రచ్చ కెక్కించింది మొత్తానికి।

జరిగింది జరగగా, ముందుసంగతి ఏమిటి? అటువంటి కూతురుపట్ల తనకు బాధ్యత లేమిటి? దాని పెళ్ళి ప్రయత్నాలు చెయ్యటమేమిటి? ఏమీ జరగనట్టు తాను సాయంకాలం పాసెంజరుకు వెళ్ళి, పెళ్ళితాంబూలాలు పుచ్చుకురాగలడా?"

"మీ యిష్టం వచ్చినట్టు చెయ్యండి," అని ఇందిర అన్నది నిజంగా తన భారాన్ని తల్లిదండ్రులకు వదిలికాదు. ఈ లోపల శ్రీమహావిష్ణువల్లే ఆ రఘురామయ్య తనను కాపాడి తీసుకుపోతా డని। ఈ సంబంధం దాని కిష్టంలేదు. తాను తెచ్చే ఏ సంబంధమూ దాని కిష్టం ఉండదు. అసలు దాని పెళ్ళికోసం తను ఏమాత్రమూ శ్రమపడ నవసరం లేదు. ఇందిర ఆ అర్హత పోగొట్టుకున్నది.

పైగా థాంక్‌లెస్‌జాబ్! — శుష్క ప్రయాస!

ఈ సంగతి సుభద్రతో చెప్పటమా? చెప్పటం మొదలుపెడితే తన మనసులో రేగే తుఫానంతా బయట పడుతుంది. చాన్ని సుభద్ర శత్రువుకన్న నిర్దాక్షిణ్యంగా విమర్శిస్తుంది అసలు విషయం అవతలికిపోయి తమమధ్య రామరావణ యుద్ధమైపోతుంది.

నాగభూషణానికి జీవితంపైన ఊహించరానంత రోత పుట్టింది. ఆ రోతవెంట ఒకవేదాంతం పుట్టుకొచ్చింది పట్టించుకున్నవాడికే బాధలు; తోసేసుకు తిరిగేవాడికే అన్ని క్లేశాలూనూ. ఇందిర గాలికి పెరిగిఉంటే ఇంతకన్న అన్యాయంగా తయారవుతుందా! దానిపైన తనప్రభావం ఉండాలని తను పడ్డ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరేగదా! ఇందిరబుద్ధులు తనవాటికి పూర్తిగా విరుద్ధంగా తయారయాయంటే ప్రతి విషయంలోనూ తన వైఖరి దానికెంత హాస్యాస్పదంగా తోస్తూ ఉండిఉండాలి! ఏమైనా ఇకమీద దానిపట్ల తనకు తండ్రి బాధ్యత లేమీలేవు! దానిగతి ఎట్లాకావలసివుంటే అట్లా అవుతుంది.

ఆయన ఇంటికి వస్తూనే ఇందిరను చూసి, "ఆయన ఉత్తరం రాశాడు. నేనే నీచేత రాయించానంటున్నాడు. నాగతి అంతకు తెచ్చావు!" అన్నాడు.

ఇందిర వెలవెల పోయింది. కేక వెయ్యబోయే దానిలా నోరు తెరిచి, నోటికి చెయ్యి అడ్డం పెట్టుకున్నది.

భర్త గొంతుమాత్రమే విన్న సుభద్ర. "ఏమిటండీ అది?" అంటూ వచ్చింది.

"ఏమీలేదు."

"ఏవో అంటున్నారే?"

"నీవిషయం కాదు."

సుభద్ర ఆ విషయం వదిలేసి అంతకన్న ముఖ్యవిషయం ఎత్తింది.

"వంటకూడా చేసేశాను. మీ రా ప్రయాణం కండీ!" అన్న దామె

"ప్రయాణమా?" అన్నాడు నాగభూషణం వెర్రిమొహం వేసి.

"వెళ్ళి తాంబూలాలు పుచ్చుకుని, ముహూర్తమూ అదీ అనుకనిరారూ?"


"అదా? ఇంకో గొడవలో పడిపోయి దానిమాటే మరిచాను ఆఫీసులో శలవుకూడా చెప్పలేదు. తరవాత చూస్తాం."

"తరవాత చూడట మేమిటండీ? నిక్షేపమంటి సంబంధం, ఈసారి మీరే పోగొట్టేటట్టున్నారే! ఎందుకు వెళ్ళరుటా?" అని సుభద్ర నిలవదీసి అడిగింది.

"నన్ను విసిగించకు. నా మన స్సేమీ బాగాలేదు," అన్నాడు నాగభూషణం

సుభద్రకు భయంకరమైన అనుమానం తగిలింది.

"ఉద్యోగానికి మళ్ళీ ఎసరేమన్నా వచ్చిందా? ... బతికాం? ఆఫీసులో



ఎవరితోనన్నా పోట్లాడారా ? బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడ రేమిటీ ?"

"మాట్లాట్టాని కేమీలేదు నువు వెళ్ళి నీ పని చూసుకో !"

మొగు డా మాట అనటంతో ఆయన దగ్గిర ఏదో పెద్ద విషయమే దాస్తున్నట్టు సుభద్ర అర్థం చేసుకుని, పనిమానుకుని ప్రశ్నలు సాగించింది నాగభూషణం రాయల్లే అయిపోయి, కాలుగాలిన పిల్లి లాగా అటూ ఇటూ తిరిగాడు. సుభద్ర వెంట వెంట తిరిగింది. ఆ బాధ పడలేక నాగభూషణం ఏకంగా బయటికే వెళ్ళి పోయాడు.

మొగుడు ఒప్పించుకు పోయినా సుభద్ర తన దృష్టిని ఇం ది ర మీ ద ఫోకస్ చేసి, ఇందిరకూడా తండ్రిలాగే ఏదో అంతస్సంఘర్షణలోపడి కొట్టుకుంటున్నట్టు గ్రహించి, ఆమె చుట్టూ తవ్వసాగింది

"నాన్న ఎందుకే అట్లా ఉన్నారూ ?"

"ఏమో నా కేం తెలుసూ ?"

"పోనీ నువ్వెందు కిట్లా ఉన్నావూ ?"

"నా కేమొచ్చిందీ ?"

"నన్నే మోసం చేస్తావుటే ? నే నంతా చూట్టంలేదనుకున్నావా ? ఆయన వస్తూనే నీతో ఏమిటో అన్నారే ."

"ఏమీ అనలేదు "

"నే వింటేనే ,"

"ఏదో అన్నాడు గామాలు. నేను మరిచిపోయాను "

ఇందిర పైకి చెప్పే సమాధానాలకూ, ఆమె బాహ్య వైఖరికీ ఏమీ సంబంధం లేదు. తల్లి ఒక్కొక్క ప్రశ్నే వేస్తుంటే ఇందిరకు ఊపిరి తీసుకోవటం కష్టమవుతున్నది.

తన పిల్లలూ, కొంతవరకూ తన మొగుడూ రహస్యంగా ఉంచటానికి ప్రయత్నించే విషయాలను బయట పెట్టించటంలో సుభద్రకు పోలీసువాళ్ళు ఎందునా చాలరు. ఆమెబాధ పడలేక ఇందిర తాను ఏ విధంగా తిమింగిలాన్ని వేటాడిందీ, ఏవిధంగా తనను తోకతో కొట్టిందీ, తల్లికి చెప్పేసింది

ఇందిర నాగభూషణానికెంత ఆశ్చర్యం కలిగించిందో సుభద్రకు అంత ఆశ్చర్యమూ కలిగించింది. అయితే సుభద్రకు ఏవగింపు మాత్రం కలగలేదు. తన కూతురు ఐశ్వర్యం మీద కన్నేసినందుకు మెచ్చుకున్నది కూడా. అంతా విని ఆవిడ ఆశ్చర్యంతో కూడిన ఆనందంతో, "ఓసి పిడుగా! కొండకి వెంట్రుక కట్టి లాగితే ఎన్నదన్నా కొంత వస్తుందిటే? నాతో మాటమాత్రం చెబితే నిన్నా ఉత్తరం రాయనియ్యకనేపోదును. అయిందేదో అయింది. ఈ సంబంధానికి ఒప్పుకో. లేకపోతే మీ నాన్న నిన్ను గాలికి వదిలేసి ఊరుకుంటారు; ఏమనుకున్నావో! ఇతను పెద్ద తెలివిగలవాడు కాదు. కుక్కల్లేనీచెప్పుచేతల్లో ఉంటాడు. ఇంకా గోపాలం గడుసుపిండం! అంచేత ఇతన్ని చేపేసుకో, నీ కేలోపమూ ఉండదు." అని హితవు చెప్పింది.

ఒక అరగంటలో నాగభూషణం నాలుగు రోడ్లూ వెర్రివాడిలాగా తిరిగి ఇల్లు చేరుకున్నాడు.

"ఏమండీ, చిన్నపిల్ల తెలీక ఏదో చేస్తే అంత ఇదైపోవాలా? తెలిస్తే మీకన్న పెద్దవాణ్ణి పెళ్ళాడదా మనుకుంటుందా? ఈ భాగ్యానికి మీ మనస్సంతా పాడుచేసుకోవాలా? నాలుగు మెతుకులు తిని బయలుదేరండి. రైలువేళ అవుతున్నట్టున్నది. అది ఈ సంబంధం చేసుకుంటుందిట." అన్నది.

"బలవంతాన చేస్తే చేసుకోకేం చేస్తుందీ? నా చేతిమీదుగా దాని కిష్టంలేని సంబంధం ఎట్లా చెయ్యను? ఎందుకు చెయ్యటం?"

"మీదో చాదస్తం. అది ఏనాడో ఈ సంబంధం రాకముందే ఉత్తరం రాసి ఉంటుంది. దానికీ సంబంధం ఇష్టమేనని నే చెబుతున్నానుగా. నా మాట నమ్మకం లేదూ? మగాళ్ళకీ విషయాలేం తెలుస్తాయీ?"

"అదీ వెళ్ళమంటే వెళతాను వయసులో పెద్దవాణ్ణయితే నేం? మిగిలిన విషయాల్లో అదీ నా అంతదే!" అన్నాడు నాగభూషణం

అది ఆయన కూతురికి విధించిన శిక్ష.

ఇందిర కాస్సేపటికి తండ్రి ఎదటికి వచ్చి, తలవంచుకుని, "ఊరికి వెళ్ళిరా నాన్నా!" అన్నది.

నాగభూషణం లేచి, గబగబా నాలుగు చెంబులు నీళ్ళు పోసుకుని, వచ్చి అన్నం ముందు కూర్చున్నాడు.

(అయిపోయింది)